

ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ — మాతృ దేవోభవ ! పితృ దేవోభవ ! ఆచార్య దేవోభవ ! అతిథి దేవోభవ ! — సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డా॥ ప్రణవ్ పండ్యా
సంపాదకులు
బి.సి.హెచ్.వి. సుబ్బారావు
(అశ్విని)
ఉప సంపాదకులు
ముక్కామల రత్నాకర్
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి

సంపుటి 21 - సంచిక 08
జనవరి 2017

పత్రిక అందనివారు మరియు
పత్రికకు సూచనలు, సలహాలు
ఇవ్వదలచినవారు ఈ క్రింది
ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
040-23700722
94407 69798
99491 11175

## గురుదేవుల జ్యోతిచరణములు

చూస్తుండగానే 21వ శతాబ్ది అడుగు అడుగు వేసుకుంటూ 16వ అడుగును పూర్తి చేసుకుని 17వ అడుగులోకి ప్రవేశించిన శుభోదయమే ఈ 2017 నూతన సంవత్సరపు తలుపుతట్టిన తొలి పలకరింపు. ఈ అడుగు అంధకారము నుండి వెలుగు వైపుగా పయనిస్తుంది. ఎన్నో అవకాశాలను నింపుకొని వేసిన ఈ అడుగులో ఉజ్జ్వల భవిష్యత్తుకు సంబంధించిన ఎన్నో సంకేతాలున్నాయి. సుఖప్రదమైన జీవితము కొరకు ఎన్నో ఆకాంక్షలు ఉన్నాయి. వాటన్నింటినీ మనం వినాలి, అర్థం చేసుకోవాలి, మన జీవిత గమనాన్ని నిర్ధారించుకోవాలి.

హిమాలయాల నుండి వీచే చల్లని గాలులతో పాటుగా వస్తున్న హిమాలయ ఋషుల పిలుపును ఈ సంవత్సరం మనకు వినిపిస్తున్నది. చీకటిలోనే చాలా సమయం గడిపివేశాము. దారి తప్పాము, కష్టాలు పడ్డాము, విషమును కూడా రుచి చూశాము. ఇక అమృతం రుచి చూసే సమయం ఆసన్నమైంది. 'తమసోమా జ్యోతిర్గమయ' గానలహరి గాలిలో తేలుతూ వస్తున్నది. హిమాలయాలలోని ఋషులతో పాటుగా మనము దీనిని గానం చేద్దాము. బద్ధకాన్ని వదిలించుకొని క్రొత్త సంవత్సరపు సూర్యోదయముతో పాటుగా మీ సముజ్జ్వల జీవితమును సాధించుకునేందుకుగాను సిద్ధంగా ఉండండి.

ఆకాశంలో అలముకున్న చీకటిపొరలు విడిపోతున్నాయి. పృథ్వీగ్రహ కక్ష్య నుండి వచ్చే ప్రకాశము అవతరణకు అన్నీ సిద్ధం చేస్తున్నది. ఇటువంటి సమయంలో మనం నిద్రపోతూ ఉండడం సముచితం కాదు. వాసనలనే విషమునకు అలవాటు పడ్డ మనం చాలా సమయాన్ని గడిపివేశాము. సాధనతో అమృతమును త్రాగే సమయం ఆసన్నమైంది.

పరమపూజ్య గురుదేవుల జ్యోతిర్మయ చరణములు ఆకాశము నుండి ప్రకాశము యొక్క అవతరణకై క్రొత్త సంవత్సరం 2017 వైపుగా అడుగులు వేస్తూ ముందుకు వస్తున్నాయి. ఇంతటి అపురూప దృశ్యాన్ని మీ కళ్ళతో కనీసం చూడనైనా చూడండి.

నీలోత్పల ఆకాశం, సువికసిత పవనం, శ్రీ గురుసుందరచరణం, అవతరణకు సిద్ధం
స్వర్ణకాంతి నిర్మితం, అమరచేతనామయం, శ్రీ గురుసుందరచరణం, అవతరణకు సిద్ధం
దేవసంస్కృతి వరణం, శరణన్న వారికి శరణం, ప్రభుని పావన చరణం, అవతరణకు సిద్ధం
నవ సర్జన కరణం, పరమవిశ్వగురుం, శ్రీ గురుని జ్యోతిర్మయ చరణం, అవతరణకు సిద్ధం

– అనువాదం : శ్రీమతి వల్లీశ్రీనివాస్

# విషయసూచిక


1. **సంపాదకీయం:** గురుదేవుల జ్యోతిచరణములు 3
2. **విషయసూచిక** 4
3. **మహాకాలుని కోపాగ్నిని అర్థం చేసికోండి** 5
4. **యుగనిర్మాణ చిత్రావళి-21:** సంపదను సార్థకం చేసిన భామాశాహ్ 7
5. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-55:** జలహారీ బాబాగారిని కలవడం 8
6. **సూక్ష్మీకరణ సాధన-14:** సాధన-యజ్ఞముల సూక్ష్మీకరణ 11
7. **స్వామివివేకానంద జయంతి ప్రత్యేకం:** నవనవోన్మేష భారత నిర్మాణానికి సంకేతమందిన స్థలం 14
8. **నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి ప్రత్యేకం:** దేశపు మట్టిని పూజించే పూజారి 17
9. **రిపబ్లిక్ డే ప్రత్యేకం:** దేశ గణతంత్ర ప్రతిష్ఠకు సవాలు 19
10. **21వ శతాబ్ది-ఉజ్జ్వల భవిష్యత్తు - 2:** వాస్తవికత-దానిని అధిగమించడమెలా? 22
11. **సమయదానమే యుగధర్మము-2:** ఆలసించడానికి ఇది సమయము కాదు 25
12. **అంతర్యాత్ర-2:** అంతర్జగత్తు యొక్క జ్ఞాన విజ్ఞానం-పతంజలి మహర్షి యోగదర్శనము 28
13. **ఆత్మనిరతుడైన యోగి యొక్క అద్భుతమైన ఉద్బోధన** 30
14. **జీవన యాగము:** విద్యార్థి ఎలా జీవించాలి? 32
15. **బోధ కథ:** అహంకారాన్ని వదిలేస్తే బ్రహ్మర్షి అయ్యాడు 36
16. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** ఆధ్యాత్మికత అంటే రొక్కబేరమే - 5 38
17. **నా వారితో నా మాట:** యువక్రాంతి సంవత్సరం 2016 - దివ్యత్వ జాగరణ కార్యశాలలు 41
18. **స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు-32** 44
19. **అశ్వమేధ మహాయజ్ఞం-జనవరి 2018** (కౌంట్‌డౌన్-12) 45
20. **అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం - కార్యకర్తల సమావేశముల నివేదిక** 46
21. **వార్తలు:** ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు 49



## యుగశక్తి గాయత్రి

**విడి ప్రతి రూ॥ 15/-** **సం॥ చందా రూ॥ 150/-**
**3 సం॥ చందా రూ॥ 420/-** **10 సం॥ చందా రూ॥ 1300/-**

చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా (at par cheque) లేక డి.డి.ద్వారా కాని పంపగలరు. యం.ఒ. ద్వారా కూడా పైకం పంపించవచ్చు. కానీ యం.ఒ. ద్వారా వచ్చినప్పుడు పూర్తి అడ్రస్సు ఉండుట లేదు. అందువలన యం.ఒ. ద్వారా పైకం పంపినప్పుడు క్రింద ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించి మీ వివరాలు అన్నీ ఇవ్వ ప్రార్థన. రూ. 5,000 లేక అంతకన్నా ఎక్కువ పంపదలచుకున్నప్పుడు ఆన్‌లైన్ ద్వారా పంపవచ్చును. దీనికన్నా తక్కువ పంపే వారు, రూ. 50/- అదనంగా చేర్చి పంపాలి.

ఖాతాపేరు: **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**
బ్యాంకు పేరు: **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
**ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్**
ఖాతా నెం.: **32506416087**
IFSC Code: **SBIN-0013272**

ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంక్ చలానా జిరాక్సు కాపీని మీ చిరునామా తెలుపుతూ తప్పక మాకు పంపించాలి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట
అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.
ఫోన్: 040-23700722, సెల్: 9949111175


## పండుగలు

**జనవరి 2017**

| | |
|---|---|
| 12-01-2017 | స్వామివివేకానంద జయంతి |
| 14-01-2017 | మకరసంక్రాంతి |
| 23-01-2017 | సుభాష్‌చంద్రబోస్ జయంతి |
| 26-01-2017 | గణతంత్రదినోత్సవం |

**ఫిబ్రవరి 2017**

| | |
|---|---|
| 01-02-2017 | వసంత పంచమి |
| 03-02-2017 | రథ సప్తమి |
| 24-02-2017 | మహాశివరాత్రి |
| 28-02-2017 | శ్రీరామకృష్ణ పరమహంస జయంతి |

**అత్యాశ సమాజాన్ని చిన్నాభిన్నం చేస్తుంది**

# మహాకాలుని కోపాగ్నిని అర్థం చేసికోండి

దండనకై కాక బహుమానానికై పాత్రతను పెంచుకోండి. దీనిని నిత్యం ఒక్కసారి అయినా చదవండి! మరియు చదివించండి.


మహాకాలుడు

సాహసవంతులను ఎలుగెత్తి పిలుస్తున్నాడు! కాలము, యుగం, కర్తవ్యం, బాధ్యత, వివేకం, పౌరుషం (పురుషార్థం) మనల ఎలుగెత్తి మేల్కొల్పుతున్నాయి. ఈ మేల్కొల్పును (పిలుపును) మనం నిర్లక్ష్యం చెయ్య రాదు. పెడచెవిని పెట్టరాదు. ఆత్మ నిర్మాణం కొరకై, నూతన యుగనిర్మాణానికై మనము ముళ్ళతో నిండియున్న దారిలో నడచుటకై ఉత్సాహం చూపాలి. ఆ దారిని అనుసరించి ముందుకు సాగిపోదాం. మన చుట్టు ప్రక్కలనున్న ప్రజలు ఏమనుకొనుచున్నారు, ఏమి చేయు చున్నారనెడి ఆలోచనలను వీడి మన అంతరాత్మ చూపిన మార్గాన్ని అనుసరిద్దాం. ప్రజలు అంధకారంలో, అజ్ఞానంలో కూరుకుపోయారు. అజ్ఞానంలోనే మ్రగ్గిపోవుచున్నారు. కావున మన వివేకంతో, జ్ఞానవంతులమై, దీని ఆధారంగా స్వయంగా, స్వయంకృషితో ప్రగతిమార్గంలో ముందుకు సాగాలి. ఎవ్వరు మనతో విభేధిస్తున్నారు. ఎవ్వరు మనల సమర్థిస్తున్నారనెడి చింతనను వీడి మీనమేషాలు లెక్కింపక మన అంతరాత్మ సాయంతో, సాహసవంతులమై ముందుకు సాగుదాం! సత్య, ధర్మ, న్యాయపాలనకై మనము ఒంటరిగానే ముందుకు సాగి పోదాం! మరియు దీనిని అనుక్షణం జాగృతాత్మల వోలె ఉచితరీతిలో కొనసాగిద్దాం!

పరివర్తన కొరకై సాహసంతో నిండిన సమర్థుల రాకను మహాకాలుడు అపేక్షిస్తున్నాడు. కాని నేడు సమాజంలో సాహసం అడుగంటి పోయింది. యువకులు భయంలో కూరుకు పోయారు. కాని మేము (మహాకాలుడు) ఇట్టి బాధాతప్త స్థితిని ఇంకెంత మాత్రం కొనసాగనివ్వం. దీనిని చక్కదిద్దుటకై ఒంటరిగానే ముందుకు పోవాలి. మరియు పోతుంటాము. సాహసంతోకూడిన ఈ ఒంటరి ప్రయాణాన్ని ప్రస్తుతవిషమ పరిస్థితులు, దుష్ప్రవృత్తులు, దుర్నీతులు అంతమగు వరకు కొనసాగించాల్సి ఉంది. యుగం మారవలసి ఉంది, కావున మన దృష్టికోణాన్ని సవరించు కొని, మరియు క్రియాకలాపములు సాహసంతో మరియు అవసరమైనచో దుస్సాహసంతో (ఊహాతీతమైన సాహంతో) చేపట్టవలసి ఉంది. ఇంతకు మించి మరో మార్గం మన ముందు లేదు.

మనము యుగం యొక్క పిలుపును మాటిమాటికి ఎలుగెత్తి చాటిచెప్పవలసి ఉంది. ఈ పిలుపును అందిపుచ్చుకొని సమయం మించి పోకముందే మనమంతా స్పందించుట సముచితం మరియు తప్పనిసరి కూడా. ఈ యుగం యొక్క పిలుపును (మహాకాలుని పిలుపును) ఖాతరు చేయని వారికి ఇంతకన్నా మించి ఏమిచెప్పగలం. కాని ఈ హెచ్చరిక చేస్తున్నాం. రానున్న రోజులలో వ్యక్తిగత స్వార్థంలో మునిగి తేలుతున్న ప్రతిభా శాలురను మహాకాలుడు బలవంతంగా స్వార్థము నుండి వారిని విముక్తులగావిస్తాడు. అప్పుడు ఏ ఒక్కరు తమ ఇచ్ఛానుసారం విచ్చలవిడిగా ధనాన్ని అపవ్యయం చేయజాలరు. ఏ ఒక్కరి బుద్ధి వ్యక్తిగత కోర్కెల తీర్చుకొనుటలో నిమగ్నం కానేరదు. అట్లే ఏ ఒక్కరి శక్తి సామర్థ్యాలను వారి వారి వ్యక్తిగత కోర్కెల తీర్చుకొనుటలో సంలీనం కానివ్వరు.

మహాకాలుని పై హెచ్చరికను మీ హృదయమందు ధారణ చెయ్యండి. వీనిని మేము (మహాకాలుడు) హృదయపూర్వకంగా, సద్భావనతో వరంగా ఇమ్మని అర్థించుచున్నాము! ఒకవేళ ఈ మా యొక్క సముచితమైన కోర్కెను మీరు మన్నించనిచో, అట్టి పిసినిగొట్టులకు లభించిన దైవీ విభూతులను (అపరిమిత సిరిసంపదలను శక్తియుక్తులను, ప్రతిభాసంపత్తులను) వారు కక్కివేసేలా దండ ప్రయోగం చేసెడి రోజు ఎంతో దూరంలో లేదు. ఈ దండన వారికి ఉరిత్రాడులా బిగించబడుతుంది.) ఇట్టి తీవ్రదండనను తప్పించుకొనుటకై, వారికి ఒక మార్గాన్ని

**కామక్రోధాలను జయిస్తే మనిషి మహోన్నతుడు అవుతాడు**

మహాకాలుడు చూపుచున్నాడు. అదే త్యాగం, ఉదారత, ఆత్మ సంతోషముల ద్వారా చారిత్రాత్మకమైన కీర్తిని పొందెడి మార్గం. దీని ద్వారములు ఇట్టి వారికై తెరచి ఉంచాడు.

రానున్న రోజులలో సమాజంలో ఏ ఒక్కరు ధనికునిగా మనజాలరు. మూలధనంపై సమాజం యొక్క నియంత్రణ ఏర్పడి, ప్రజలంతా వారు జీవించుటకు సరిపడెడి ధనాన్ని సంపత్తులను కలిగి ఉండే ఆర్థిక వ్యవస్థ ఏర్పడుతుంది. ఈ విధంగా సంపదలు పంచబడతాయి.

బుద్ధుని అనుయాయులు త్యాగమయజీవన భావనలను సమాజంలో వ్యాప్తిచేశారు. తత్ఫలితంగా యువతీ-యువకులు యవ్వన సౌఖ్యాలను, సుఖాలను త్యజించి, పరమార్థ ప్రయోజనానికై భిక్షకులుగా మారి కష్టభూతమైన జీవన మార్గాన్ని ఎన్నుకొని దానిలోని ఆనందాన్ని అనుభవిస్తూ గడిపారు. మహాత్మాగాంధీ మార్గాన్ని అనుసరించి, ఉన్నత పదవులను, విలాస జీవితాలను విడచి, లక్షలాదిమంది కష్టాలను భరిస్తూ, ఉరికంబాల ఎక్కుతూ, తుపాకి గుళ్ళకు ఎదురు నిలచి దేశ స్వాతంత్ర్య సమరంలో తమ జీవితాలను అర్పించారు.

ఆ సమయంలో ఈ త్యాగధనులకు వారికి లభించెడి ప్రతిఫలం తెలియదు. కాని వారు చేసిన త్యాగం, తీసికొన్న నిర్ణయం వారికి సౌభాగ్యాన్ని మరియు చక్కని కీర్తిని అందించింది వారిని ధన్యజీవుల చేసింది. ఇది చారిత్రక సత్యం.

అదే రీతిలో మహాకాలుడు నేడు కూడా ప్రతిభాశాలురను యుగ నేతృత్వాన్ని చేపట్టవలసిందిగా ఆహ్వానిస్తున్నాడు. సుయోగ్యతతతో కూడిన సౌభాగ్యవంతుల అవసరం ఎంతో ఉంది. కోర్కెలను, వాసనలను, అహంకారాన్ని వీడి సాహస వీరులైన సత్పురుషులు, సైనికుల్లా ముందుకు నడవాలి, దివ్య అనుదానాలకు భాగస్వాములు కావాలి. పై మార్గం నుండి తప్పుకొని నడిచేవారు. హానికారకులుగా ప్రమాదకారకులుగా నిలచెదరు. ఇట్టివీరిని, మహాకాలుడు తన తీవ్రమైన లాఠీ దెబ్బలతో దండించకమానడు.

మంచిది! ప్రజలు వివేకంతో కూడిన మాటలను వినెదరు గాక! భీషణమైన పశ్చాత్తాపాల నుండి, బాధల నుండి రక్షింపబడెదరు గాక! సుఖసౌభాగ్యాలలో పాలుపంచుకొనెదరు గాక!

*హిందీమూలం: పండిత శ్రీరామశర్మ ఆచార్య*
*తెనుగు సేత: ఎ. వేణుగోపాలరెడ్డి*

## పునాదిరాయి

*మహారాష్ట్రలో జన్మించిన శ్రీ బాలగంగాధతిలక్ బి.ఎ., ఎల్.ఎల్.బి లో ఉత్తీర్ణులయ్యారు. అతని మిత్రులంతా తిలక్ గొప్ప వకీలుగా ధనార్జన చేస్తారని భావించారు. కాని ఆయన ఆలోచనా మార్గం వేరొక దిశగా సాగింది. ఆయన "న్యూ ఇంగ్లీషు స్కూల్", "ఫర్గ్యుసన్" కాలేజిలను స్థాపించి దేదీప్యమానంగా నడిపారు. ఆ సంస్థలలో చదివిన విద్యార్థులు మహారాష్ట్ర ప్రజలలో జాగృతిని కలిగించే కార్యక్రమాలు చేపట్టారు. మెల్లమెల్లగా తిలక్ రెండు జాతీయ ఉత్సవాలను నెలకొల్పారు. 1) గణపతి ఉత్సవాలు 2) శివాజీ జయంతి. బెంగాలులోని దుర్గా నవరాత్రుల వలె గణపతి నవరాత్రులను ఆవిష్కరించారు. ఈ నవరాత్రులనాధారంగా చేసికొని రాష్ట్రీయ తత్త్వాన్ని ప్రచారం చేసే కార్యక్రమాలను రూపొందించారు. ఈ ప్రక్రియ ద్వారా జనజాగృతి వికసించి రేకులు తొడిగింది.*


*"శివాజీ జయంతి" జాతీయతకు ప్రతీకగా జరుపబడింది. "కేసరి" అనే పత్రికలోని దేశభక్తిపూరితమైన సంపాదకీయాలను చదివి ప్రజలు స్వాతంత్ర్య పోరాటంలో నిమగ్నులయ్యారు. ఇదంతా గమనిస్తున్న ఆంగ్ల ప్రభుత్వం తిలక్ మీద రాజద్రోహి నేరాన్ని మోపింది. చివరకు 6 సంవత్సరాలు జైలుశిక్షను విధించింది. దేశ బహిష్కారాన్ని విధిస్తూ బర్మాలోని మాండలే జైలుకు పంపింది. ఆ శిక్షా కాలాన్ని కూడా వృథా చేయకుండా తిలక్ "గీతా రహస్యం" అన్న పేరుతో భగవద్గీతకు భాష్యం వ్రాశారు. ఆ గ్రంథాన్ని చదివి లక్షలాది సత్యాగ్రహులు స్ఫూర్తిని పొందారు. "స్వరాజ్యం నా జన్మహక్కు-సాధించి తీరుతాను" అన్న నినాదాన్ని లేవనెత్తి ప్రజలలో చైతన్యాన్ని రేకెత్తించారు.*

*స్వరాజ్యం కోసం ఇంతగా శ్రమించి బాలగంగాధర తిలక్ స్వరాజ్యభవనానికి పునాదిరాయిగా మిగిలిపోయారు.*

**కర్మహీనులకు, సన్మార్గాన్ని వదిలిన వారికి కష్టాలు తప్పవు**

యుగనిర్మాణ చిత్రావళి-21

# సంపదను సార్ధకం చేసిన భామాశాహ్



విదేశీ శాసకుల నుండి యశస్సు, ధనము పొందేందుకు ఇతరులు ముఖస్తుతితో, కాకాపట్టటంతో ప్రయత్నిస్తున్నప్పుడు కూడా మహారాణా ప్రతాప్ దేశ స్వాధీనత కొరకు తన కృషిని తగ్గనీయలేదు. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా మహారాణా ప్రతాప్ ప్రజలకు ఎలా తన ప్రేమను పంచి ఇచ్చాడో, అటువంటి శాసకుడు, ఆనాడు ఇంకెవరూ లేరు. దేశం కొరకు; సత్యం కొరకు; ధర్మం కొరకు ఒంటరి పోరాటం చేస్తున్న ఇటువంటి వ్యక్తికి సన్మానం చేయాలి.

భామాశాహ్ మహారాణా ప్రతాప్ ఒంటరిగా అక్బర్‌తో కత్తిదూశాడని విన్నాడు. కానీ అతని సైన్యం పని అయిపోయింది, సాధనములు అంతరించిపోయాయి. తన పరివారంతో ఒక నిర్జన వనంలో ఇంకా ఆశతో ఎదురు చూస్తున్నాడు. తన తపస్సు నెరవేరుతుందని, ముక్కలు ముక్కలు అయిన రాజ్యాలను ఒకే సూత్రంలో కలిపి కోల్పోయిన స్వాధీనతను, స్వాభిమానమును ప్రాప్తించుకోవాలని కలలు కంటున్నాడు. మహారాణా యొక్క ఈ నిష్ఠ చూసి భామాశాహ్ హృదయం గద్గదమయింది. సంపత్తిని వ్యక్తిగత సుఖాలలో ఖర్చు చేస్తున్న అతని వాక్కు మూగపోయింది. మనస్సు మారి పోయింది. సంపత్తి వ్యక్తిది కాదని, మొత్తం దేశానిదని భావించాడు. సమాజం కొరకు దేశం యొక్క ఉన్నతి కొరకు ఉపయోగించడమే ధనం యొక్క సదుపయోగం అని విశ్వసించాడు.

ఈ భావనతో భామాశాహ్ తన మొత్తం సంపత్తిని మహారాణా ప్రతాప్‌కు ఇవ్వాలని నిశ్చయించుకున్నాడు. ఈ భీషణ ప్రతిజ్ఞ విని లోభులు, దురాశాపరులయిన కుటుంబసభ్యులు పరిగెత్తుకుని వచ్చారు, ఏమిటి మీరు చేస్తున్న పని అని అడిగారు. ఈ డబ్బు మన సుఖం కొరకు, ప్రపంచం యొక్క మేలు చూడటం భగవంతుని పని. మీరు మాకు చెందవలసిన డబ్బుని ఎందుకు దానం చేస్తున్నారు? అని ప్రశ్నించారు.

భామాశాహ్ దృఢంగా జవాబు ఇచ్చాడు – "ధర్మం, సంస్కృతి రక్షణలో అసంఖ్యాక ప్రజలకు లాభం కలుగుతుంది. మీరు శ్రమ చేసి సంపాదించుకోగలమనే దాని మీద నమ్మకం పెట్టుకోవాలి. దేశం యొక్క అవసరాలు తీర్చకపోతే అది అధర్మమే కాదు పాపం కూడా. ఆ పాపంలో భాగం పంచుకునేందుకు నేను సిద్ధంగా లేను. భగవంతుడు అందరిలాగే మీకు బుద్ధి ఇచ్చాడు, చేతులు ఇచ్చాడు. మీ ఏర్పాట్లు మీరు చేసుకోండి. సంపద మీద కుటుంబ సభ్యులకు అధికారం ఉందని మరచి పోండి. అది లోకహితం కొరకు ఎక్కడికి అవసరం అయితే అక్కడికి వెళ్తుంది.

భామాశాహ్ తన పూర్వీకుల నుంచి లభించిన 37 లక్షల ధనరాశిని మహారాణాకు సమర్పించాడు. మహారాణా ప్రతాప్ ఇలా అన్నాడు – "తండ్రీ! మీ సాహసం ధన్యం, మీరు దేశం యొక్క, జాతి యొక్క వదనాన్ని ఉజ్జ్వలం చేశారు. అందరు తమ హితం కొరకు మాట్లాడుతుంటారు, పని చేస్తుంటారు. కానీ మీరు పరమార్ధానికి ప్రాముఖ్యతను ఇచ్చి ప్రపంచంలో స్వార్ధం కన్నా పరమార్ధమే గొప్పదని చాటిచెప్పారు. "ధర్మం, పరమార్ధ రక్షణ కొరకు తమ సర్వస్వాన్ని దానం చెయ్యవచ్చు.


భామాశాహ్ యొక్క ఈ త్యాగంతోనే మహారాణా ప్రతాప్ ఇంకొక సైన్యాన్ని కూడగట్టుకుని పోగొట్టుకున్న చిత్తౌడ్‌ను తిరిగి గెలుచుకున్నాడు.

– అనువాదం : ముక్కామల రత్నాకర్

**అతిగా వ్యవహరించడమే ఆపదలకు మూలం**

పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-55

# జలాహారీ బాబాగారిని కలవడం



తిరుపతి వెళ్ళే దారిలో కొందరు సాధువులను కలిశారు. వారిలో ఒకరు జలాహారీ బాబా. 'అథిరల' అనే తీర్థం దగ్గర కలిశారు. ఈ తీర్థం స్థానికంగా మాత్రమే ప్రసిద్ధి చెందింది. చెన్నై (అప్పటి మద్రాసు) నుండి 100 కి.మీ. దూరంలో ఉన్న ఈ తీర్థంలో ఒక సరోవరం ఉంది. పరశురాముల వారు ఇక్కడ స్నానం చేశారని అక్కడివారి నమ్మకం. ఆ తరువాత వారి మాతృ హత్యాపాపం తొలగిపోయిందట. సరోవరం దగ్గర శివాలయం ఉంది. గుడి దగ్గర ఒక కుటీరంలో జలాహారి బాబా ఉండేవారు. ఆయన కౌపీనం మాత్రమే వేసుకునేవారు. ధుని వెలిగిస్తూ ఉండేవారు. ఆయన అసలు పేరు వేరేదో ఉంది కానీ కేవలం నీటిపై మాత్రమే ఆధారపడ్డారు కాబట్టి ఆయన పేరు జలాహారి బాబా అయిపోయింది. నీరు తప్ప ఆయన వేరేదీ స్వీకరించడం అక్కడి ప్రజలెవ్వరు చూడలేదు. బాబా దగ్గరకెళ్ళి శ్రీరామ్ తనను తాను పరిచయం చేసుకునే ప్రయత్నం చేశారు, కానీ బాబా పెద్దగా ఆసక్తి చూపలేదు.

బాబా, నాదొక ప్రశ్న. మీరు మాత్రమే దానికి సమాధానం చెప్పగలరు, అన్నారు శ్రీరామ్. బాబా ఆ ప్రయత్నాన్ని కూడా పట్టించుకోలేదు. 'సాధకుడెవరైనా సరే, ఏ జిజ్ఞాసనైనా సమాధానపరచలేడు. ప్రశ్న ఎక్కడ్నుంచి పుడుతుందో, అక్కడే సమాధానం పుడుతుంది, లేదా ఆ పరమాత్మే తృప్తిపరచగలడు.' అన్నారు బాబా.

శ్రీరామ్ ఓటమిని అంగీకరించలేదు. "నేను మీ గురించే తెలుసుకుందాము అనుకుంటున్నాను. కేవలం నీరు త్రాగి జీవించి ఉండగలమా? శరీర అవసరాలన్నీ సమకూరుతాయా?" ప్రశ్న వింటూనే బాబా ధుని నుండి ధ్యాస మళ్ళించి శ్రీరామ్‌ను కొంతసేపు తదేకంగా చూశారు. "నువ్వు కూడా మజ్జిగ, జొన్న రొట్టెల మీదే బ్రతుకుతున్నావుగా, నీ శరీర అవసరాలన్నీ పూర్తవుతున్నాయా?"

బాబా జవాబుకి శ్రీరామ్ అవాక్కయ్యారు. తన సాధన, తపశ్చర్యల గురించి బాబాకెలా తెలిసిందో? తన చుట్టూ ఉన్నవారిలో చాలామందికి కూడా ఈ విషయం తెలియదు. చాలా సన్నిహిత కుటుంబసభ్యులకి తప్పితే ఎవరికీ ఈ వ్రతం, సంకల్పం గురించి తెలియనే తెలియదు. ఆశ్చర్యపోతున్న శ్రీరామ్‌ను చూసి, "వృథ చెందకు. నీ సాధన, ఉద్దేశాల గురించి నాకే కాదు, ఇంకా చాలామంది సాధకులకి తెలుసు. ఇందులో వింతేమీ లేదు. నిన్ను తపస్సు చేయమన్న సత్తానే ఇంకెందరో సాధకులని నీకు సహకరించమని ప్రేరణ ఇస్తోంది." అన్నారు బాబా.

తన సాధనకు సంబంధించి ఒక క్రొత్త తథ్యం తెలిసింది. ఇంకేమి అడగవలసిన అవసరం కనిపించలేదు. వేంకటేశ్వర స్వామి దర్శనం అయ్యాక పాండిచ్చేరిలోని మహాయోగి ఆశ్రమానికి వెళ్తావుగా, అక్కడనుంచి సరాసరి తిరిగి వెళ్ళిపోవాలని సూచించారు బాబా. చెప్పడం పూర్తవుతూనే ఇక నాతో ఎక్కువ మాట్లాడించకు, భక్తులు వేచి ఉన్నారు అన్నారు బాబా.

శ్రీరామ్ వెనకకు తిరిగి చూస్తే కుటీరం బయట కొందరు భక్తులు చేతులు కట్టుకుని వేచి ఉన్నారు. శ్రీరామ్ బాబాకు నమస్కరించి అక్కడ నుంచి వెళ్ళిపోయారు. బాబా వెల్లడించిన తథ్యాన్ని గురించి ఆలోచిస్తూనే దారంతా నడిచారు శ్రీరామ్.

## కఠినమైన తిరుపతి యాత్ర

ఇప్పుడు ఆశ్చర్యం కృతజ్ఞతాభావంగా మారుతోంది. ముందు పెద్ద పనులు పూర్తి చేయాల్సి ఉంది అనే అనుభూతి కలుగుతోంది. స్వాతంత్ర్య ఆందోళనలో పాల్గొనడం అందులో ఒక చిన్న భాగం. ఇక్కడికి రావాలని ప్రేరేపించిన మానసికస్థితి, నేపథ్యం కూడా ఇక ముందు రాజకీయ, సామాజిక కార్యకలాపాల నుండి కాస్త పక్కకి తప్పుకోవాలనే సూచిస్తున్నాయి.

తిరుపతికెళ్ళే దారిలో వేంకటేశ్వరస్వామిని గురించి ఎన్నో కథలు, అనుభవాలు, భావాలు వినవచ్చాయి. తిరుమల పర్వతంపై ఉండే వేంకటేశ్వరస్వామి ఆలయం అన్నింటికన్నా

సమతుల్యాన్ని పాటించేవారు తెలివైనవారు

సంపన్నమైన దేవస్థానం. ఈ ఆలయం ఉన్న పర్వతాన్ని 'శ్రీ సంపన్నం' అని కూడా అంటారు. ద్రవిడంలో 'తిరుమల' అంటే అర్థం కూడా ఇదే. 'తిరు' అంటే 'శ్రీ', 'మల' అంటే పర్వతం.

ఆదిశేషుడే పర్వతరూపంలో ఇక్కడ స్థిరపడ్డాడని నమ్మకం. అందుకే దీనిని శేషాచలం అని కూడా అంటారు. కొండపైన దేవుడిని దర్శించుకోవడానికి వెళ్తే ఆయన మీద పాదం మోపినట్టు అని నమ్మేవారు కొండ క్రిందనుండే నమస్కరించి వెళ్ళిపోతారు. ఇలా భావించేవారు చాలా కొద్దిమందే, కానీ ఉన్నారు. పురాణాల ప్రకారం అంబరీష మహారాజు, భక్త ప్రహ్లాదుడు కూడా కొండపైకి వెళ్ళలేదు. పర్వతపాదం దగ్గరే పూజ చేసి తిరిగి వెళ్ళిపోయారట. ఈ శ్రద్ధతోనే రామానుజాచార్యులవారు దండప్రణామాలు ఆచరిస్తూ కొండెక్కి స్వామి గుడివరకు వెళ్ళారట. ఆ తరువాత చాలామంది భక్తులు ఈ మార్గాన్నే అనుసరించారు.

ఏడు కొండలతో ఉన్న శేషాచలానికి ఇప్పుడైతే బస్సు ప్రయాణించే మార్గం కూడా ఏర్పడింది. ఇలా కొండ చుట్టూరా ఉన్న రోడ్డు షుమారు 22 మైళ్ళు ఉంటుంది. కానీ ఆ రోజుల్లో నేరుగా నడిచే వెళ్ళవలసివచ్చేది. నడక దారి సుమారు 8 కి.మీ. ఇందులో ఒక రెండున్నర కి.మీ. చాలా కష్టంగా ఉంటుంది. కొంత దూరం వెళ్ళి, మధ్య మధ్యలో సేద తీరుతూ యాత్ర కొనసాగించాలి. అందుకు ఏడు, ఎనిమిది గంటలు పడుతుంది. విశ్రాంతి తీసుకోడానికి కాకుండా కొందరు వ్రతాలు, సంకల్పాలు తీసుకోవడానికి కూడా ఆగుతారు.

శేషాచలం పరిసరాలు చాలా మనోహరంగా ఉంటాయి. మామిడి, చందనం చెట్లతో నిండిన పర్వతం చల్లటి నీడతో, సుగంధభరితంగా ఉంటుంది. భావనతో యాత్ర సాగిస్తే రామాయణ, మహాభారతాలలో వర్ణించిన ఋషుల ఆశ్రమాల లాగా అనుభూతి కలుగుతుంది. ఆ గ్రంథాలను చదివి ఉంటే అందులోని వర్ణన అనాయాసంగా గుర్తుకొచ్చేస్తుంది. యజ్ఞాలు, యాగాలతో శోభిల్లుతుండే ఋషులు, మునులు తిరగాడే స్థలాలు ఇలానే ఉంటాయి కాబోలు అనిపిస్తుంది.

గుడి నుండి సుమారు 8 కి.మీ. దూరంలో పాపనాశనం తీర్థం ఉన్నది. దర్శనానికి ముందు యాత్రికులు అక్కడికి వెళ్తారు. అక్కడొక జలపాతం ఉన్నది. అందులో స్నానం చేస్తే పాపాలన్నీ పోతాయని నమ్ముతారు. శ్రీరామ్ కూడా అక్కడికెళ్ళి స్నానం చేశారు. నీరు స్వచ్ఛంగా, చల్లగా ఉన్నాయి. నీటిలో ఏవో ఓషధ గుణాలు కూడా ఉన్నట్టు అనిపించింది. స్నానం చేసొచ్చాక ఎంతో స్ఫూర్తిని అనుభూతి చెందారు. అలసటంతా పోయింది. అలసట పోయి, రోగాల నుంచి కాస్త ఉపశమనం కలుగుతోంది కాబట్టి జలపాతంలోని నీరు పాపాలను తొలగిస్తుందని నమ్మి ఉంటారు. అక్కడి యాత్రికులు వినోదంగా మాట్లాడుకోవడం వినిపించింది. ఎన్ని పాపాలు చేసినా పర్వాలేదు, తీర్థంలో దేవతలు వాటిని తొలగించేస్తారులే, మనం స్నానం చేస్తే సరిపోతుంది అంటూ నవ్వుకుంటున్నారు.

పాపనాశనం నుండి ఆలయానికి వెళ్ళే దారిలో పాండు గుహ కనబడుతుంది. అక్కడ పంచ పాండవుల విగ్రహాలు, విష్ణు పాదముద్రలు ఉన్నాయి. శ్రీరామ్ ఇక్కడ కొంతసేపు ఉన్నారు. తపోసాధనల వల్ల ఉప్పొంగిన చైతన్య భావం ఇక్కడ ఉన్నట్టు అనిపించింది. అది జాగృత స్థలం. అటూ ఇటూ తిరగకుండా అరగంట ధ్యానం చేసుకున్నారు. ఆ తరువాత ఎక్కడా ఆగకుండా తిరుపతి ఆలయానికి వెళ్ళారు. సుమారు రెండు మీటర్ల ఎత్తున్న విష్ణుమూర్తి విగ్రహాన్ని చూస్తూనే ఉల్లాసం పొంగి పొర్లుతుంది. చతుర్భుజ ఆకారంలో రెండు చేతులలో శంఖచక్రాలు ఉన్నాయి. ఒక చేయి అభయముద్రలో ఉంది. మరొకటి నడుం మీద ఉన్నది. విగ్రహం విశేషాలు జాగ్రత్తగా పరిశీలిస్తేనే కనిపిస్తుంది. లేకపోతే వస్త్రాలంకరణలో కనిపెట్ట లేము. ఇప్పుడు దర్శనానికి అనుమతిస్తున్నారు. వెనుక నుంచి భక్తులు తోస్తుంటారు. ఆలయ అర్చకులు, సేవకులు కూడా ముందుకు నెట్టేస్తుంటారు. కానీ అప్పట్లో ఈ ఆ వేగం ఉండేది కాదు. భక్తులు ఓర్పుతో నిలబడి ఉండేవారు. ఎన్నో మైళ్ళు కష్టపడి కాలినడకన చేరుకోవడం వల్ల ఓపిక దానంతటదే వచ్చేది.

### మూల విగ్రహం అలంకారం

గుడి ఎంత పురాతనమైనది? ఈ విషయంలో వేరు వేరు నమ్మకాలు ఉన్నాయి. ఇవన్నీ తెలుసుకోవడంలో శ్రీరామ్ సమయాన్ని వృథా చేయలేదు. సుమారుగా పది నిమిషాలు వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని కన్నార్పకుండా చూస్తూనే ఉన్నారు. శివకేశవుల సమన్వయ స్వరూపమైన వేంకటేశ్వర విగ్రహం మీద ఆభరణాలు దేదీప్యమానంగా తేజస్సుతో వెలుగుతున్నాయి. శ్రీరామ్ జాగ్రత్తగా చూశారు. ఆ తేజస్సు ఆభరణాలది కాదు, విగ్రహం నుండే వస్తోంది. విగ్రహంలో చైతన్యం, కంపనలు

**బుద్ధి ఉన్నదా? అనే ప్రశ్న బుద్ధిలేనివాడే వేస్తాడు**

ఉంటే సహజమైన దీప్తి అలాగే కనిపిస్తుందని అంతస్సులో అనిపించింది. దానిని కప్పి ఉంచడానికే అలా అలంకరణ చేస్తారు. దర్శనానికి వచ్చిన సామాన్యులు విగ్రహం తేజస్సును చూసి విచలితులు కాగలరు. పూర్తిగా చైతన్యవంతులు కాని వారు కూడా తమ ధర్మం, కర్తవ్యాలను వదిలేసి సేవ పూజల్లో మునిగిపోయే అవకాశం ఉంది.

ఆ వైభవం, రాజసం చూసి అబ్బురపడిన శ్రీరామ్ లక్షలు, కోట్లమందికి ఆరాధ్యుడైన వానికి ఆ హంగు, ఆర్భాటం ఆ మాత్రం ఉండాలిలే అనుకున్నారు. వీటన్నింటినీ పెద్దగా పట్టించుకోకుండా పూజా విధానం మీద ప్రత్యేకంగా దృష్టి సారించారు. 11వ శతాబ్దానికి ముందు వేరే విధానాలు పాటించేవారు. ఆ తరువాత రామానుజాచార్యులవారు నిర్దేశించిన విధానంలోనే పూజ జరుగుతోంది. ఇందులో కర్మకాండలు, ఉపచారాలు చాలా ఉన్నాయి. అష్టయామ ఆరతి, పవళింపు, నైవేద్యం, స్నానాది కృత్యాలు విధిపూర్వకంగా చేస్తారు. ఆ ఉపచారాలలోని రహస్యం తెలుసుకోవడానికి కొంతసేపు పుష్కరిణి దగ్గర కూర్చుని తమ చిత్తంలో చొరబడి చూడసాగారు.

పూర్తి స్పృహలో ఉండి శ్రీరామ్ మానసికజగత్తులో ఉపచారాలు చేస్తున్నారు. ప్రతి ఒక ఉపచారానికి చిత్తంలో ప్రత్యేకమైన భావం పురికొలిపినట్టు అనుభూతి కలుగుతోంది. ఆచమనం కోసం వేంకటేశ్వరునికి నీటిని సమర్పిస్తే ఆ విగ్రహం నుండి పవిత్రతలో మొదటి కిరణం ఆశీర్వదిస్తున్నట్టు తనలోకి ప్రవేశించింది. ప్రక్షాళన, స్నానం, ఆహారం, పవళింపు మొదలైన విధానాలతో కూడా ఏదో ఒక ప్రత్యేకమైన భావం కలిగింది. పుష్కరిణి దగ్గర చాలామంది తలనీలాలు సమర్పించుకుని స్నానం చేస్తున్నారు. ఈ ఆచారం తిరుపతిలోనే ఎక్కువగా ఉంటుంది. కోరికలు తీరితే భక్తులు వచ్చి ఇక్కడ నీలాలు అర్పిస్తారు. దేవఋణం తీర్చుకునే విధానం లాగా అనిపించింది శ్రీరామ్‌కి.

గొప్పస్థాయిల్లో ఉన్న సాధకులకి పూజలు పునస్కారాలు అవసరం ఉండకపోవచ్చుగానీ సామాన్య, సగటు సాధకులకు అవసరం. ఈ ఆలోచనలతో పుష్కరిణి నుంచి బయలుదేరి ఆలయ శిఖరాన్ని చూశారు. సూర్యుని కిరణాలు దాని మీద పడి మెరుస్తున్నాయి. ఆ మెరుపు శ్రీరామ్ మనస్సును బంధించింది. రక్కున లేచి శిఖరాన్ని అలానే చూస్తుండిపోయారు. అలా కళ్ళార్పకుండా చూస్తూ ఉండిపోవడంతో, వెనకనుంచి ఎవరో, ఏం చూస్తున్నారు అంటూ పలకరించారు. భక్తులకు తమ భవిష్యత్తు కనిపిస్తుంది. నీకు కూడా ఏదైనా కనిపిస్తోందా?

శ్రీరామ్ ఈ మాటలు విన్నారే కాని ఏ జవాబు ఇవ్వలేదు, వెనక్కి తిరిగి చూడలేదు. శిఖరం మీద మంచు నిండిన హిమాలయ పర్వతాలు కనిపించసాగాయి. తమ గురువుగారి సాన్నిధ్యంలో గడిపిన ఆ పర్వత శిఖరం కనిపించింది. కొన్ని క్షణాలవరకు గురువుగారి తెల్లటి తల వెంట్రుకలు, గడ్డం కూడా కనిపించాయి. తరువాత వారి ముఖారవిందం కనిపించింది. కొన్ని క్షణాల్లోనే ఆ దృశ్యం కరిగిపోయింది. ధ్యాసపెట్టి చూస్తే ఆలయ శిఖరం మునపటికి మల్లే సంపూర్ణ తేజస్సుతో వెలుగుతోంది. ఆ దృశ్యం అందించిన సందేశాన్ని అర్థం చేసుకోవడానికి శ్రీరామ్ పెద్ద కష్టపడలేదు. స్పష్టంగా అర్థమైంది. శిఖరాన్ని మనస్ఫూర్తిగా మళ్ళీ చూసి రెండు చేతులు జోడించారు. తరువాత ఆలయ ద్వారం వైపు తిరిగి నమస్కరించారు. భవిష్యత్తులో ఉత్తర, దక్షిణ భారతాలను కలిపే సేతువుగా 'తిరుపతి' ఉంటుందని ఆయనకు అనిపించింది. గాయత్రీ సాధన ప్రచారానికి, దేశాన్ని ఒకటిగా, అఖండంగా ఉంచడానికి ఏదైనా కార్యక్రమాన్ని చేయాలంటే ఇక్కడి కంపనలు సర్వశ్రేష్ఠమైనవి. ఇలా ఆలోచిస్తూనే ఆలయాన్ని చూసుకుంటూ తిరిగి తదుపరి యాత్రకు బయలుదేరారు.

– అనువాదం: *శ్రీమతి జయలక్ష్మి*

## సర్వోన్నతమైన కానుక

*"ఐసెన్ హోవర్" అమెరికాకు రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. దేశం నలుమూలల నుండి ఎన్నెన్నో కానుకలు వచ్చాయి. వాటిల్లో ఒక చీపురు కూడా ఉంది. పంపినవారు దానితో పాటు ఒక లేఖ కూడా పంపారు. "అయ్యా! మీరు మీ ఉపన్యాసంలో నన్ను ఎన్నుకున్నట్లైతే రాజ్యతంత్రంలో ఉన్న మురికిని కడిగి వేస్తాను" అని చెప్పారు. నేను పంపుతున్న ఈ చిన్న కానుక మీ పనికి చక్కగా ఉపయోగపడుతుందన్న నమ్మకం నాకుంది. ఈ చీపురు మీ వాగ్దానాన్ని ఎల్లప్పుడు మీకు గుర్తుచేస్తూ ఉంటుంది." తనకు వచ్చిన కానుకలను అన్నింటినీ చూపిస్తూ రాష్ట్రపతి "ఇదే నాకు వచ్చిన సర్వోన్నతమైన కానుక" అన్నారు.*

– అనువాదం: *పొన్నూరు హైమవతీశాస్త్రి*

**బుద్ధి ఉన్నవానికి సర్వత్రా జ్ఞానం కనిపిస్తుంది**

సూక్ష్మీకరణ సాధన - 14

# సాధన - యజ్ఞముల సూక్ష్మీకరణ

యజుర్వేదములో 'యజ్ఞావై శ్రేష్ఠతమం కర్మ' అనే ఉక్తి వస్తుంది. అనగా యజ్ఞము ప్రపంచంలోనే అన్ని శ్రేష్ఠమైన కర్మల కంటే శ్రేష్ఠమైనది. శాస్త్రకారులు గాయత్రీ జ్ఞానమార్గము ద్వారా వ్యక్తిలోని అజ్ఞాన తమస్సును దూరం చేసి అతనిని బంధవిముక్తుడిని చేస్తే; అక్కడే యజ్ఞము దేవపూజన ద్వారా భక్తియోగము, సంగతీకరణము ద్వారా జ్ఞానయోగము, దానము ద్వారా కర్మయోగము యొక్క ఒక సమగ్ర సాధన పద్ధతికి ప్రతీక. యజ్ఞమును సర్వశ్రేష్ఠముగా ఎందుకు గుర్తించారు? అని విశ్లేషణ చేసుకుంటే ఈ పవిత్ర ప్రక్రియలో 'కారణశక్తి' ప్రయోగమే కారణము అని తేలుతుంది. 'స్థూలము' కంటికి కనిపిస్తుంది. 'సూక్ష్మము అదృశ్యమైనప్పటికీ ఉపకరణాలద్వారా గుర్తించవచ్చు'. 'కారణము' కేవలము బుద్ధి ద్వారా తప్ప ఇంకొక విధానము లేక ఉపకరణముల ద్వారా గుర్తింపబడదు. పరీక్షించలేము. యజ్ఞములో ఈ కారణశక్తినే ఉపయోగిస్తారు. కారణశక్తిని పైకిలేపి ఉపయోగిస్తారు. ఇది లేకపోతే పదార్థము ఒక జడవస్తువు. అందువల్లనే యజ్ఞమును శ్రేష్ఠమనేగాక, వరిష్ఠమని కూడా అంటారు. 'యజ్ఞ ప్రశంసా' ప్రకరణాలలో అనేక సందర్భాలలో యజ్ఞాగ్ని యొక్క విశిష్టత ప్రతిపాదించబడినది.

మీమాంసాకారుడు యజ్ఞపరిణామంగా ఎన్నటికీ నశించని సూక్ష్మసంస్కారములు ఉత్పన్నమవుతాయి అని తెలిపాడు. యజ్ఞకర్త సమస్త వ్రత అనుబంధములు పాటిస్తే దాని పరిణామంగా దేవత్వము లభించి తీరుతుంది. మీమాంస కారుడు ఈ సూక్ష్మసంస్కారమునకు 'అపూర్వ లేక అదృష్ట' మనే పేరు ఇచ్చాడు. యజ్ఞకర్మల వలన ఉత్పన్నమైన ఈ అపూర్వ రూప సూక్ష్మ సంస్కారము వ్యక్తికి సమయానుసారంగా అద్భుతమైన మహత్వపూర్ణమైన లాభాలు కలిగిస్తుంది. బ్రాహ్మణాది పుస్తకములలో అందువల్లనే యజ్ఞము శ్రేష్ఠతమ కర్మగా ఉల్లేఖించబడినది.

యజ్ఞము ద్వారా 'కారణశక్తి' సూక్ష్మీకరణ జరుగునని కొన్ని ఉదాహరణల ద్వారా అర్థము చేసుకొనవచ్చు. ఉల్లిపాయలో, అరటికాండములో ఒకదానితర్వాత ఒకటి అనేక పొరలు ఉంటాయి. వస్తువులలో ప్రాణులలోకూడా ఇలాగే అనేక పొరలు ఒకదానితర్వాత ఒకటి ఉంటాయి. మనిషికి మూడు శరీరాలు ఉన్నాయి. స్థూలమైన కంటికి కనిపించేది, సూక్ష్మమైన అశరీర స్థితి. దీని ఉనికి భూతప్రేతముల క్రియా కలాపాలలో తెలుస్తుంది. కారణ శరీరము-దేవశరీరము. ఈ మూడు ఒకదానికంటే ఒకటి సూక్ష్మమైనవి. ఎక్కువ శక్తి కలవి.

పదార్థమునకు కూడా మూడు శరీరములు ఉంటాయి. తులసి యొక్క స్థూల రూపము మానవుని నిత్యజీవితంలో కనిపిస్తూనే ఉన్నది. ఇది ఈగలు, దోమలను తరిమివేసి వాతావరణాన్ని సంశోధితము చేస్తుంది. సూక్ష్మంలో అది ఇంకా ప్రఖరమై మనోరోగాలు నాశనము చేస్తుంది. చరణామృతము-పంచామృతములో కలిసినప్పుడు మనస్సులో పవిత్రత నింపి, దేవకార్యాలలో ప్రయుక్తమౌతుంది.

యజ్ఞమునకు నాలుగు ఆధారములున్నాయి. ఈ నాల్గింటినీ సూక్ష్మీకృతము చేయవలసి ఉంటుంది. మొదటిది-వ్యక్తి. రెండవది-అగ్ని. మూడవది-వాణి. నాల్గవది-చరు లేక హవిష్యాన్నం. ఈ నాలుగు స్థూలరూపంలో మాత్రమే ఉపయోగించబడినప్పుడు వాటి యజ్ఞీయ ప్రయోజనములు పూర్తిగా వర్ణింపబడినవిధంగా అద్భుత ఫలితాలను హస్తగత మవుతాయి.

యజ్ఞీయప్రక్రియలో నలుగురు ఋత్విజులు పాలుపంచు కుంటారు. హోత, అధ్వర్యు, ఉద్గాత, బ్రహ్మ. ఈ నలుగురు ఎవరికో ఒక్కరికి ఆ పేరుపెట్టి నియుక్తి చేయబడరు. వారు నిర్ధారిత సమయంలో నిర్ధారిత స్థాయిలో త్యాగ, తపస్సులు చేయవలసి ఉంటుంది. తపశ్చర్య చేసి ఉండకపోతే యజ్ఞము యొక్క సూక్ష్మకారణ శక్తులను మేల్కొల్పటానికి అవసరమయ్యే శక్తి లభించదు. మొదట హోత-ఋగ్వేదము యొక్క అనుశాస నములు పాటిస్తాడు. అధ్వర్యు-కర్మ అంటే యజుర్వేదమును ఉపయోగిస్తాడు. ఉద్గాత-గానము చేయగలిగేవాడు. సామవేద అనుశాసనములను పాటిస్తాడు. సాధారణ గాయకుడు కాదు. భక్తిభావముతో తనదంతా సమర్పణ చేసిన సాధకుడు. బ్రహ్మ చతుర్వేదపారంగతుడైన అధర్వవేది. అన్ని ప్రక్రియలను

**అన్నీ ఉన్న మనిషి ఆరోగ్యం కుదుటబడాలంటే కొంచెం ప్రేమకూడా కావాలి**

నియమనము (control) చేసే ప్రబోధకుడు, నిర్దేశకుడు, వ్యవస్థా సంయోజకుడు. ఈ వర్ణన ఇక్కడ యాజకుల ఋత్విక్కుల వ్యక్తిత్వము యొక్క సూక్ష్మీకరణ చెందించే ఉచ్చస్తరీయ స్వరూపాన్ని తెలియజేస్తుంది. యజ్ఞమనే శ్రేష్ఠతమ ప్రక్రియ పైన చెప్పిన నలుగురు ఋత్విక్కులు తమ తపస్సాధనలో పరిపూర్ణత పొందినప్పుడే చెప్పబడిన ఫలితాలను పొందగలుగు తారు. దశరథుని ద్వారా పుత్రకామేష్టి యజ్ఞము చేయించటానికి అధ్వర్యు స్థాయి కలిగిన వ్యక్తి శృంగిమహర్షి. శృంగిమహర్షి అధ్వర్యుడుగా లేకుండా అంతకుముందు ఆయన చేసిన ప్రయత్నములన్నీ సఫలమవలేదు. సంయమ తపో బలములు కలిగిన ఋషి ఋత్విక్కుడుగా ఉండటం వలన యజ్ఞకార్యము సంపన్నమై అభీష్ట ఫలితములు పొందగలిగారు. ఇదే వ్యక్తిత్వ సూక్ష్మీకృత కారణరూపము యొక్క ఫలశృతి. ఋత్విజుల తర్వాత యజ్ఞాగ్నుల యొక్క ప్రసంగము వస్తుంది. యజ్ఞాగ్ని పవిత్రమైనది. దానిని అభిమంత్రితము చేస్తారు. అగ్గిపుల్ల గీసి కుంపటిని వెలిగించటము లేక సిగరెట్టు వెలిగించడము లాంటి ప్రక్రియలలో అగ్ని సూక్ష్మీకృతము చెందదు. ఏదోవిధంగా అగ్నిని ప్రజ్జరిల్లింపజేసి ఆహుతులు వెయ్యరు. అగ్నిని మంత్రశక్తి ద్వారా ఆమంత్రితము చేసి మంథనద్వారా ప్రకటితము చెయ్యాలి. అప్పుడే అది యజ్ఞాగ్ని అవుతుంది. అఖండదీపములో నిరంతరము ప్రజ్జురిల్లే అగ్ని యజ్ఞాగ్ని యొక్క స్వరూపము.

ఆహుతులలో వెయ్యబడిన సామగ్రిని, అగ్ని పైకి తీసుకు వెళుతుంది. వాయువు దానిని అంతరిక్షంలోనికి కొనిపోతుంది. భూమిమీద హోమము జరుగుతుంది. యజ్ఞాగ్ని యొక్క ఊర్ధ్వీకరణశక్తి దానిని అంతరిక్షములోనికి కొనిపోతుంది. ఆ తరువాత ఆ అగ్నియొక్క రెండవది అయిన, కానీ అద్వితీయమైన విద్యుచ్ఛక్తి ద్వారా అది ఇంకా ఊర్ధ్వలోకాలలోకి తీసుకెళ్ళ బడుతుంది. ఆహుతివ్వబడినటువంటి హవిస్సు-అగ్ని, విద్యుత్తు ద్వారా ఊర్ధ్వగామియైన స్థూలమునుండి, సూక్ష్మతమము అవుతూ, తన యొక్క దివ్యరూపాన్ని పొందుతుంది. ఈవిధమైన తన సూక్ష్మీకరణ రూపములో యజ్ఞాగ్ని కేవలము మనుష్య లను, ప్రాణులను, వనస్పతులను పరోక్ష వాతావరణము యొక్క నియమన (control) సంశోధనలను అనుకూలంగా మార్చటం వంటి ప్రయోజనాలను పూర్తిచేస్తుంది. యజ్ఞఊర్జ కేవలము అగ్నిహోత్రము వల్ల ఉత్పన్నమైన వేడి కాక అది ఒక అతి సూక్ష్మమైన సామర్థ్య సంపద. ఇది వ్యక్తుల మీద, సమగ్ర వాతావరణము మీద తమ ప్రభావాన్ని చూపించి, వాటిని శక్తిసంపన్నము చేస్తుంది. మూడవది మంత్రశక్తి లేక వాక్కు. సంస్కృతము చదివిన ఏ వ్యక్తియైన సహజంగానే స్పష్టంగా ఉచ్చారణ చేయగలుగుతాడు. కానీ ఇందువల్ల మాత్రమే ఫలితాలు రావు. శుకమహర్షి పరీక్షిత్తునకు తెలిపిన కథ, ఇతర ఏ ఋషియైన తెలుపగలడు. కానీ ఆ ఫలితము వచ్చి ఉండేది కాదు. స్వయంగా శుకమహర్షి తండ్రే అనేక మంత్రముల ద్రష్ట. ఏ వ్యక్తి అయినా అక్షరములను గుర్తుపెట్టుకొని ఋషి కానీ, ద్రష్టకానీ అవ్వడు. అందువల్లనే పూర్వకాలంలో ఎంచుకున్న మంత్రములలో ప్రవీణులై పారంగతులయ్యేవారు. వారినే ద్రష్టలనేవారు. దీనికి ఉదాహరణగా గాయత్రీ మంత్ర ద్రష్ట ఋషి విశ్వామిత్రుడని చెప్పవచ్చు. అందువల్లనే గాయత్రీ మంత్ర వినియోగంలో ఆయన పేరు స్మరింపబడుతుంది.

జ్ఞాన, కర్మలకి కొంత హద్దు ఉన్నది. కానీ భావనల ఉదాత్తీకరణము, మంత్రోచ్చారణద్వారా, వాక్కుద్వారా జరిగినప్పుడు, అది మానవుని అంతరాళమునే కాక, సంపూర్ణ వాతావరణమును కుదిపివేస్తుంది. యజ్ఞములో వాణియొక్క ప్రయోగము సూక్ష్మరూపములో సామగానముగా ప్రయుక్త మౌతుంది. భావప్రధాన సంగీత తరంగముల వలె గానము చేయబడ్డ ఋక్కులు, సంపూర్ణశరీరమును స్పందితము చేయుటయేకాక, సంపూర్ణ వాయుమండలాన్ని మథిస్తుంది. సామవేదము యొక్క ఈ ప్రాణదాయిని మధురవచనమును ఛాందోగ్యోపనిషత్తులో ఈవిధంగా చెప్పినది. 'వాచాః ఋక్ రసః ఋచః సామరసః.'

దేవసంస్కృతియొక్క అత్యద్భుతమైన వైజ్ఞానిక పద్ధతులలో వాక్ శక్తి యొక్క విస్తృతీకరణకొరకు యజ్ఞాగ్నిని (amplifier) ఉపయోగించడము ముఖ్యమైనది. వికసించిన వాణి, విశిష్ఠ ప్రయోజనము కొరకు విశిష్ట వ్యక్తియొక్క ముఖము నుండి ఆవిర్భవించినపుడు ఒక క్షిపణి (Missile) వలె పనిచేస్తుంది. శబ్దశక్తి యొక్క సూక్ష్మీకృత రూపమే ఈనాడు విభిన్న రోగముల నిదానము కొరకు, చికిత్సాక్షేత్రములో (Ultra sonic) తరంగ రూపాలలో ఉపయోగించబడుతున్నది. కానీ ఈ శబ్ద శక్తే చాలా పురాతన కాలం నుండి వరదానములు ఇవ్వటానికి, పరామర్శ సత్సంగరూపాలలో ఉపయోగింపబడుతున్నది. లక్ష్యాన్ని ఛేదించి, తిరిగి తమ ఉద్గమస్థానానికి తిరిగివచ్చే

**సంపాదన ఎంత ముఖ్యమో దాని సద్వినియోగం కూడా అంత ముఖ్యమే**

శబ్దభేది బాణములు ఈ యుగములో కనిపించుటలేదు. లేసర్ కిరణాల ద్వారా వాక్‌శక్తి యొక్క ఈ ప్రచండ సూక్ష్మశక్తినే ఉపయోగించుకుంటున్నారు.

నాలుగవది హవిష్యము లేక చరు. స్థూలముగా ఇది పదార్థమే. యజ్ఞప్రక్రియలో దీని 'కారణ'శక్తిని అభివృద్ధి చేస్తారు. అర్హత కలిగిన యాజకుడి ద్వారా హవిష్య సంగ్రహము, పవిత్రీకరణము, సంస్కారీకరణము చేయబడుతుంది. యజ్ఞాగ్నిలో వండిన 'చరు'లోనే ఈ అంశములు ఉంటాయి. ఇది మాత్రమే అనువంశిక (genetic code) ప్రారబ్ధం మీద, సూక్ష్మ సంస్కారముల మీద ప్రభావం చూపించగలుగుతుంది. హోమము చేయబడే పదార్థము ఎంత పవిత్రంగా ఉందో, శుద్ధముగా ఉందో, దానిమీదే దానియొక్క కారణశక్తి ప్రకటీ కరణము ఆధారపడి ఉంటుంది. పదార్థము స్థూలంగా ఒక వనస్పతి, ఒక ఖాద్యాన్నము, ఒక తీపి లేక దుగ్ధ(పాలు లేక పాలతో చేయబడిన) రూపంగా ఉంటుంది. కానీ యజ్ఞాగ్ని స్పర్శ, దానిని పరివృద్ధితము (Magnify) చేస్తుంది. ఇదేవిధంగా ప్రాణాగ్ని ఉద్దీపన కుండలినీజాగరణ సాధన ద్వారా యోగాగ్ని ప్రకటీకరణ బ్రహ్మతేజస్సుగా రూపొందుతుంది. ఇదేవిధంగా యజ్ఞ ప్రయోజనములో ఉపయోగించబడే సామాగ్రియొక్క ఉపయోగం ఒక చమత్కారముగా ఉంటుంది. రోగముల, మనోవికారముల నివారణ, జీవనీశక్తి సంవర్ధనలో, ఈ ప్రభావాలను స్పష్టంగా చూడవచ్చు. 'చరు'లో 'తీపి', ఖాద్యాన్న ములు, పాలు చక్కెరల సమ్మిశ్రణ యజ్ఞాగ్నిలోకి పంపబడి, సంస్కారితము చేయబడుతుంది. ఇది చాలా జాగ్రత్తగా చేయబడాలి. ఎందువల్లనంటే దీని ప్రభావము జీవకోశముల మీద కాక D.N.A. జీన్స్‌లాంటి అతి సూక్ష్మఘటకముల మీద కూడా ఉంటుంది.

ఈవిధంగా ఋత్విజులు, యజ్ఞాగ్ని, వాక్‌శక్తి హవిష్య – చరు – నాలుగు కూడా యజన ప్రక్రియలో సూక్ష్మీకరణ ప్రాధాన్యత గలవే. నిజానికి యజ్ఞము ఒక 'జ్వలన' ప్రక్రియ కాదు. పైన చెప్పిన నాలుగు తత్త్వముల కారణశక్తిని అభివృద్ధి పరచి పైకి తెచ్చే ఒక విజ్ఞానసమ్మతమైన ప్రక్రియ. ఇది జరుగకపోతే యజ్ఞములో చెప్పబడే ఫలితాలు రావు.

ఇక్కడ యజ్ఞము యొక్క ఉదాహరణ ద్వారా ఆత్మబల సంవర్ధన, శక్తిసంచయం కొరకు సూక్ష్మీకరణ ప్రక్రియ ఏవిధంగా చేయబడుతుందో తెలియజెప్పాను. ప్రాణశక్తి ఏకత్రీకరణ, ఊర్ధ్వగమనము, బహులీకరణము చేసే వ్యక్తి తన సాధన తపశ్చర్యల ద్వారా అనేకమందికి లాభము చేకూర్చగలడు. మంత్రసాధకుడు కూడా ఋత్విజుల వలె, కొన్ని సాధనా నియమాలను పాటించవలసి ఉంటుంది. వారు నిర్ధారిత కాలంలో నిర్ధారిత విషయములను అభ్యసించవలసి ఉంటుంది. అభీష్ట ప్రసంగము తప్ప, ఇతర నిరర్థకమైన మాటలు త్యజించాలి. ఎంతవరకు సంభవమో అంతవరకు మౌన–ఏకాంత తపస్సాధనలో నిరతులై ఉండాలి.

ఛాయాపురుష సిద్ధికొరకు తన అనేక ఛాయలలో ఏ సిద్ధిని హస్తగతం చేసుకోవాలని అనుకుంటున్నామో ఆ స్థాయి అభ్యాసము చేయాలి. ఏవిధంగా అయితే స్థూలశరీరమునకు స్నాన, శయన, భోజన, వ్యాయామములు అవసరమో అదే విధంగా సూక్ష్మశరీరమునకు సాధనా విధానముల పోషణ ఇవ్వవలసి ఉంటుంది. దానిని ఏ ప్రయోజనము కొరకు ఉపయోగించుకోవాలో అటువంటి తపస్సాధనలను ఎన్నుకొని వాటిలో నిమగ్నం అవ్వాలి.

సమాధిస్త యోగి తన శరీరమును గాఢనిద్రాస్థితికి తీసుకొని వెళ్ళవలసి ఉంటుంది. ఏ సమాధి అభీష్టమో, దానికి తగిన సాధనలు చేయాలి. షట్చక్రములు, పంచకోశములు, మూడు గ్రంథులు వీటన్నింటిని ఒకేసారి సిద్ధింపజేసుకొనలేము. ప్రతి సాధన చాలాకాలంపాటు జటిలమైన, భిన్నభిన్న విధానాలను అనుసరించి చేయవలసి ఉంటుంది. దేనికి ప్రాముఖ్యతనిస్తే దానిని మాత్రమే సూక్ష్మశరీరము స్వీకరించి, ఒక క్రమిక వ్యవస్థానుసారము మిగతావాటిని తర్వాత సిద్ధింప జేసుకొనుటకు వదలివేస్తుంది. ఏవిధంగా వ్యవసాయములు అనేకమో అదే విధంగా యోగసాధనా పద్ధతులు, ఉద్దేశ్యములు అనేకములు. సాధకుడు శాస్త్రనిర్దేశానుసారము విభిన్న అభ్యాసముల ప్రయోజనము కొరకు వాటిని అనుగుణ్యంగా క్రమంలో నిర్మించుకొనవలసి వస్తుంది. వీటిలోనే చాలా ప్రాముఖ్యత వహించేది 'సాధన యొక్క సూక్ష్మీకరణ'. దీనిలో ప్రత్యక్ష స్థూల క్రియాకలాపములను నిరోధించి వ్యక్తిత్వము, వాణి, ప్రాణాగ్ని, ఆహారము, యోచనలను వాటి 'కారణ' రూపమును అభివృద్ధిచేసి క్రమపద్ధతిలో సునియోజితము చేసుకోవాలి. యజ్ఞప్రక్రియకు, సాధనయొక్క సూక్ష్మీకరణకు ఎంత సామ్యము ఉన్నదో స్పష్టంగా చూడవచ్చు.

*(సశేషం)*

**ప్రతి పని మనస్ఫూర్తిగా చేసేవారికి విజయం తథ్యం**

స్వామి వివేకానంద జయంతి ప్రత్యేకం

# నవనవోన్మేష భారత నిర్మాణానికి సంకేతమందిన స్థలం



అదృశ్య జగత్తు యొక్క ప్రబల ఆకర్షణ, జన్మాంతర సంస్కార బలం మరియు నియతి యొక్క విధివిధానం వివేకానందుని అటు వైపుగా పట్టిలాగ సాగాయి. ఆ సంకేతస్థలం వద్దనే శ్రీపాదశిల ఉన్నది. హిందూమహా సముద్రం, అరేబియా సముద్రం మరియు బంగాళాఖాతముల త్రివేణీ సాగరసంగమ ప్రాంత ఉత్తుంగ తరంగాలు ఈ పావనశిలను అనునిత్యము అభిషేకిస్తుంటాయి. ఇది ఆ జగన్మాత నివసించే పవిత్ర ప్రాంతం, ఆ జగదంబ యొక్క తపోస్థలి. స్థలమనేల? అది భూమి యైనా లేదా సంద్రమైనా ఆ పరదేవత అంతటా సమానంగా విరాజ మానురాలై ఉంటుంది. ఐతే కన్యాకుమారికి మరింత విశేషం ఉన్నది. పరమపావని ఆ దేవి సర్వవ్యాపియైనప్పటికినీ; కొన్ని చోట్ల ఆమె అదృశ్యరూపమున ఉంటూ ఉంటే; ఇంకొన్ని చోట్ల ఆ దేవి యొక్క కాంతులు మాత్రం కనిపిస్తుంటాయి. ఐతే మరికొన్ని చోట్ల ఆ మహాదేవి పూర్ణరూపమున సాక్షాత్కరించి ఉంటుంది.



కన్యాకుమారిలో అదే జరిగింది. జగద్రక్షకి అక్కడ సాక్షాత్తుగా ఉన్నది. ఇది దాని ప్రత్యేకత. ఆదిశక్తి మాతా జగదంబ కన్యా రూపమున దేవాధిదేవుడు మహాదేవుడిని పతిగా పొందుటకు ఇక్కడ తపమాచరించినది. ఒకానొక కాలమున ఇక్కడ ఆ దేవి యొక్క మందిరము అలరారుతుండేదేమో కానీ నేడు సముద్రపుటలలు శ్రీపాదశిలను ముఖ్యభూమి నుంచి వేరు చేశాయి. ప్రస్తుతం శ్రీపాదశిల సాగర కెరటాల నడుమ ఉన్నది. ఆలయం మాత్రం ముఖ్యప్రదేశములో నిర్మించబడినది. యువసన్యాసి మందిరములోని మాత శిలామూర్తికి ప్రణమిల్లి నాడు. ఆ పిమ్మట బయటకు వచ్చి శ్రీపాదశిలను తదేకముగా చూడసాగాడు. ఆ శిల వద్దకు చేరుకొనటానికి అతని వద్ద ఏలాంటి సాధనము లేదు. సముద్రపు ఒడ్డున కొంతమంది సరంగులు తమ తమ పడవలతో నిల్చుని ఉన్నారు అన్నది నిజమే కానీ; డబ్బు చెల్లించి సముద్రము మీద ప్రయాణించటానికిగాను ఈ యువకుని వద్ద డబ్బేమీ లేదు. రుసుం చెల్లించకుండా నావికులు అతనిని తమ పడవలో ఎందుకు ఎక్కించుకుంటారు?

శ్రీపాదశిలను దర్శించాలని ఆ యువకుని ప్రాణం కొట్టుకుపోతున్నది. తన నిశ్చలమైన మనస్సులో ఆ తల్లి పిలుపు స్పష్టముగా వినిపిస్తున్న అనుభూతి కలుగుతున్నది. అది ప్రాణములలో అలజడిని రేపుతున్నది. ఆ పిలుపు తీవ్రం నుండి తీవ్రతరం–తీవ్రతరం నుండి తీవ్రతమమౌతున్నది. పదునాలుగు భువనములను, సకల జీవజంతువులను, సప్త సముద్రములను, చరాచరసృష్టినంతటిని సృజించిన ఆ జగన్మాత తనను పిలుస్తున్నది అని అనిపించసాగినది. మరి ఇంక దేనికొరకు నిరీక్షణ? అడ్డంకి ఏమిటి? నావికులు రూకలు చెల్లించనిదే పడవ ఎక్కించుకొనటానికి సిద్ధంగా లేరు అన్నది నిజం. ఆ పరదేవతకన్నా గొప్ప నావికుడు ఎవరున్నారు? అంతే ఆ ఆలోచన వచ్చినదే తడవుగా ఆ యువకుడు చెంతనే ఉన్న ఒక పెద్ద బండ మీద కెక్కి పెద్దపెట్టున నీటి శబ్దము వచ్చే టట్లుగా ఒక్క ఉదుటున ఎగసిపడుతున్న సాగర కెరటాలలోకి దుమికాడు.

నీటి ధ్వని పెద్ద కలకలమే రేపింది. దానితో అక్కడున్నవారి దృష్టంతా ఆ దిశగా మళ్ళింది. తీరమున ఉన్న జనులకు ఆ యువసన్యాసి శ్రీపాదశిల వైపుగా సముద్రజలాలలో ఈదుకుంటూ వెళ్ళటం కనిపించింది. ఆ చుట్టప్రక్కలున్న సముద్రమంతా ఉవ్వెత్తున పడిలేచే తరంగాలతో గర్జిస్తున్నది. అలలు ఒకదాని తరువాత మరొకటి తాటి ప్రమాణమున ఎగసిపడుతున్నాయి. ఆ తరంగాలు 'యువకుడా! దుస్సాహసం

**ఇవ్వడంలో నీ చెయ్యి పైన ఉంటుంది**

చేస్తున్నావు. జాగ్రత్త సుమా!' అని యువసన్యాసిని హెచ్చరిస్తు న్నట్లున్నాయి.

ఆ సన్యాసి మాత్రం ఇదేమి పట్టించుకోకుండా ఏకాగ్ర మనస్కుడై ఈదుకుంటూ పోతున్నాడు. అతనికి ఈ సవాలు కూడా సుఖముగానే అనిపిస్తున్నది. బయట అశాంతి ఆవరించి ఉన్నది కానీ ఆతని మనస్సున పరమశాంతి నెలకొని ఉన్నది. తను–తన ప్రియమైన మాత! అంతే! వారి నడుమ మరెవ్వరు లేరు. యువకుని అంతరంగమున ఆ జగన్మాతను చూడబోతు న్నందుకు కొంత విచిత్రమైన ఉత్కంఠ మరియు విలక్షణమైన సుఖానుభూతి ప్రస్ఫుటితమగుచున్నది. తాను ఈ ప్రకృతితో ఒక రోమాంచకమైన ఆట ఆడుతున్నట్లుగా అనిపించసాగింది. ఈ సన్యాసి జగన్మాతను కలుసుకోవాలని ఉవ్విళ్ళూరుతున్నాడు. ప్రకృతిలోని ఆ మార్గమున అనేక ఇబ్బందులు దారంతా ఉన్నాయి. అవి ఎలా ఉన్నాయంటే చిన్నారి–చిన్నారి బాలుడు అల్లంత దూరమున తన తల్లిని చూసి చేతులు చాచి నేరుగా ఆమె వద్దకు పరుగులిడుతున్నాడు. ఇంతలో ఉరుకులు పెడుతున్న ఆ చిన్నారిని ఆటపట్టించటానికి ఒకరు తమ చేతులను అడ్డుగా పెట్టి అడ్డగించినటుల, తన కాళ్ళతో నిలవరించి అమ్మ చెంతకు చేరనీయకుండా చేసినట్లుగా, అందమైన ఆ బుడతడి కళ్ళకి అడ్డముగా తన అరచేతులను తెరగా పెట్టి బాలునికి తల్లి కానరాకుండా చేసినట్లుగా ఉన్నది ఇక్కడి పరిస్థితి. అయితే తల్లిని కనబడనీయకుండా చేసినందున బెంబేలెత్తిపోయి ఏడ్చే పసివాడేమీ కాదు ఆ యువసన్యాసి. భయంకర పరిస్థితులు ఎదురైనప్పుడు వివశమవ్వటం అనేది ఆ బాలుడు ఎన్నడూ నేర్వలేదు.

అయినప్పటికీ తల్లి తనకు చేరువలోనే ఉన్నదని ఆతనికి తెలుసు. చుట్టుప్రక్కలే ఉన్నది, అతనికి మాత్రం కనిపించటం లేదంతే! లీలను ప్రదర్శిస్తున్నది. తల్లీ–బిడ్డ మధ్య దాగుడు మూతలాట సాగుచున్నది. యవ్వనములో ఉన్న ఆ సన్యాసి తన మాతను కనుగొంటే మంచిదే లేనిచో ఆ జగన్మాతయే బిడ్డని తప్పకుండా తన ఒడిలోకి తీసుకుంటుంది. కనుకనే ఆ యువకుడు నిశ్చింతగాను, నిర్భీతితోను ఉన్నాడు. వివేకా నందుడు సముద్రమును ఎన్నోమారులు చూశాడు. ఐతే నేటి సముద్రపు మహాగర్జన, నింగిని తాకుతున్నాయా అన్నట్లు పైకి లేచి పడుతున్న విశాలమైన పర్వతాకారపు ఆ అలలను అతను ఇంతకు మునుపెన్నడు చూడలేదు. సముద్రపు కెరటాలతో ఆ యువకుడు గతములో చాలాసార్లు ఆడుకుంటూనే ఉంటూండే వాడు. కానీ అలలు కొండచిలువ వలె అతనిని ఈ రీతిగా ఎన్నడూ బాధించలేదు. ఈవిధంగా ఇదివరకెన్నడూ యువకుడిని సంద్రపుటలలు అంతెత్తున పైకి లేపుతూ–క్రిందికి పడవేయలేదు.

ఒక క్రోపోద్రిక్తిత మహాగజము మనుష్యులను తన తొండంతో పైకెత్తి గిరగిరా తిప్పి నేలకేసి విసరికొట్టినట్లుగా లేదా అంతులేని కోపముతో పేట్రేగిపోతున్న వృషభము ఎవరో ఒకానొక మనిషి ప్రాణమును హరించివేసేందుకు ఆ వ్యక్తిని తన కొమ్ములతో కుమ్ముతూ పైపైకి ఎగరేసేందుకు ప్రయత్ని స్తునట్లుగా ఈ క్షణములో కడలి తరంగాలు అతనిపై అటువంటి భీకర క్రోధమునే ప్రదర్శిస్తున్నాయి.

కోపముతో ఎగసిపడుతున్న మహాసాగర కెరటాలు, మానవులను భక్షించే సొరచేపలు, సర్పములు మరియు భయంకర మహామత్స్యముల నడుమ జగన్మాత యొక్క అదృశ్య కృప యనే అభేద్య కవచము కూడా అతని వెన్నంటే ఉన్నది. అదే ఆ యువసన్యాసిని తన లక్ష్యమునకు చేరుస్తున్నది. అట్టి స్థితిలో నీరు తగ్గుముఖం పడుతున్నట్లుగా అనిపించింది అతనికి. తాను శ్రీపాదశిలను చేరుకున్నానని సన్యాసికి తెలిసినది. నీటిమట్టం తగ్గగానే కాళ్ళ క్రింద ఉన్న కంకరరాళ్ళు నిలదొక్కు కునేందుకు తోడ్పడ్డాయి. ఆ యువసన్యాసి తలెత్తి చూడగానే ఆ జగదంబయే నిరాకారరూపమున ప్రత్యక్షమైనట్లుగా ఆకాశము–కడలి ఏకమై, సమస్త ప్రకృతి ఒక్కరూపును దాల్చినట్లుగా ఎదురుగా అద్భుత దృశ్యం ఆవిష్కృతమైనది.

ఆ యువకుడు ముందుకు సాగాడు. శ్రీపాదశిల చేరువనే ఉన్నది. ఆతని కన్నుల నుండి అశ్రువులు జాలువారాయి. ఈ అఖిల సృష్టికి, తనకూ మాతయైనట్టి ఆ జగన్మాత ఈ శిల మీద ఆసీనయై తపమాచరించినది. సన్యాసి ఆ పవిత్ర శిలకు శిరస్సువంచి ప్రణమిల్లినాడు. 'హే మాతా! నీ తపస్సుతో ఈ పాషణం కరిగిపోయింది. కనుకనే నీ పదచిహ్నములు ఇక్కడ ముద్రించబడినాయి' అని తనలో తాను అనుకున్నాడు. ఆ క్షణమున అకస్మాత్తుగా అతనికి వెలుగు రూపమున భువన మోహిని, జగద్వ్యాపినీయైన మాత యొక్క ప్రత్యక్ష్య సాన్నిధ్యాను భూతి కలుతోంది అన్న జ్ఞానం ఉదయించసాగినది. క్షణ క్షణానికి ఆకాశము మరియు సముద్రపు వర్ణములు మారి

**తీసుకోవడంలో నీ చెయ్యి క్రింద ఉంటుంది**

పోతున్నవి. మేఘములు మరియు గాలివాన యొక్క రూపు రేఖలు కన్నుమూసి తెరచేలోపే పరివర్తన చెందుతున్నాయి. గాలిలోని అలౌకిక సంగీతం అతనిలో ఆధ్యాత్మిక ప్రపంచమును సృష్టిస్తున్నది. ఈ అద్భుతానుభూతితో వెంటనే ఆ సన్యాసి ధ్యానమాచరించుటకు పద్మాసనంలో కూర్చుండిపోయాడు.

భరతభూమి యొక్క చివరి అంచున, మహాసాగరముల సంగమస్థానమున, జగన్మాత యొక్క తపోస్థలిలో, చెక్కు చెదరకుండా నిలచి ఉన్నటువంటి ఆ దేవి యొక్క పద చిహ్నాముల చెంత ధ్యానం చెయ్యసాగాడు. మనస్సు మెల్లగా గాఢ ఏకాగ్రతను సాధిస్తున్నది. అతను ధ్యానం లోతులలోకి వెళ్ళసాగాడు. భారతభూమి యొక్క వర్తమానం మరియు భవిష్యత్తుల మీద ఆతని దృష్టి కేంద్రీకృతమైనది. జగత్ ద్రష్టయైన ఆ దేవదేవి యొక్క దివ్యదర్శనంలో దేశం పతనమవ్వటానికి వెనుక గల కారణము ఆవిష్కృతమవ్వసాగినది. మన వేద భూమి అత్యున్నత శిఖరముల నుండి ఎలా, ఎందుకు పతనా వస్థకు చేరుకున్నది? ఆ సమస్యకు అసలు కారణమేమిటి? నివారణోపాయమేది? అన్నవాటికి సమాధానము యువ సన్యాసికి ధ్యానపు లోతులలోకి వెళ్ళినప్పుడు వివరముగా తేటతెల్లమవ్వసాగినది.

వేగముగా వీచే గాలితో పాటు, సముద్రపు అలల భీకర గర్జనకు తోడు లభించిన ఏకాంతములో స్వామీ వివేకానందుని అస్తిత్వములో భారతదేశం స్పందించసాగినది. భారతదేశము సాధించిన అమోఘమైన ఉపలబ్ధులు ఆతని హృదయా కాశములో నక్షత్రముల వలె వెలుగులీనసాగాయి. అనంతమైన కాలం యొక్క ఆవరణను తొలగించి మేధస్సుకు అందనటు వంటి అతి ప్రాచీన గత శతాబ్దులు తమ రహస్యాలను ఆతనికి తెలియజెప్పసాగాయి. భారతీయ సాంస్కృతిక స్వర్ణిమ స్వరూప మనే సత్యము సాకారమగుటను గాంచినాడు. వేదం నినదించ బడిన ఈ భూమాత శరీరములోని ధమనులలో కేవలం ఆధ్యాత్మికత మాత్రమే రక్తప్రవాహముగా, ప్రాణ ప్రవాహముగా ఉరుకులు పెట్టడమును చూశాడు. భారతజాతి రక్తముగా–ప్రాణముగా ఉండే ఆ ఆధ్యాత్మికత గత కొంతకాలముగా వికృతమైన విశాల రూపు ధరించుట చేతనే భారతదేశము పతనమనే లోతులలోకి జారిపోయింది అని తెలుసుకున్నాడు.

గడచిన కాలములో తేజరిల్లిన అట్టి ఆధ్యాత్మిక చేతనా పునఃప్రతిష్ఠాపన ద్వారానే నవభారత నిర్మాణము జరుగుతుంది అని జగన్మాత అతనికి అనుభూతిని కలిగించసాగినది. ఉపనిషత్తులు వల్లించిన ఈ వేదభూమి మరల ఆ ఉపనిషత్ జ్ఞాన చేతనను తనదిగా చేసుకుని తీరాలి. జాతి–మతం, ఉచ్ఛనీచములు, భాషాభేదములు, ప్రాంతీయ వేర్పాటులను మరచి అఖండదేశీయ సాధనను చేసితీరాలి. ఈ దేశంలోని మనిషి మనిషిని భక్తి, శ్రద్ధ, జ్ఞానం, వివేకములనే సద్గుణములతో పోషించాలి. వివేకానందుడు తన గాఢ ధ్యానానుభూతిలో 'భారతమాత యొక్క అసమాన శోభను మసకబారించే దుర్బలత లను చూశాడు. తిరిగి ఆ వైభవమును, అఖండ సౌందర్యమును ప్రదానం గావించే సత్యములు కూడా ప్రస్ఫుటితమైనాయి.' భారతభూమి యొక్క పాతకాలపు స్వర్ణిమ కాలం, పతనమనే కందకములోకి జారిపోయిన వర్తమానం, సముజ్జ్వల భవిష్యత్తు ఆ దేవి యొక్క దయతో స్పష్టముగా గాంచగలిగినాడు.

మూడురోజులపాటు సాగిన ఈ అవిరామ ధ్యానసాధన తరువాత యువసన్యాసి ఒక దేశ నిర్మాణకర్త, విశ్వశిల్పి 'స్వామి వివేకానందునిగా' పరిణతి చెందాడు. ఆతనికి ఇది క్రొత్త జన్మ. వివేకానందుని ఆత్మ కరుణతో ద్రవించిపోతూ సర్వవ్యాపక స్థితినందుకొన్నది. ఆ రోజున యువసన్యాసి కళ్ళెదుట తన కర్తవ్యపథం సుస్పష్టముగా గోచరించినది. అంతేకాదు ఆ క్షణములలోనే అనేక సంవత్సరముల పాటు చేసిన ఆత్మచింతనా సాధన యొక్క సారభూతతత్త్వము ఆవిష్కృతమైనది.

ఇక యువక సన్యాసికి భారతమాత సముజ్జ్వల భవిష్యత్తును సాకారం చెయ్యటమనే పురుషార్థమే ఎదుట మిగిలి ఉన్నది. ఇదే ఆ జగన్మాత–వివేకానందునికి ఇచ్చిన సంకేతం, సందేశం మరియు ఆదేశం. కన్నీళ్ళతో సముద్రం వైపుగా చూశాడు ఆ యువకుడు. ఆ అశ్రువులే అసంకల్పితముగా శ్రీపాదశిల మీద జాలువారి సన్యాసి యొక్క సమర్పణాభావనను చాటకనే చాటాయి. ఇదే తన తరపు నుండి ఆ జగన్మాతృకకు యువ సన్యాసి ఇచ్చిన భావాంజలి! కన్నీటి సుమాలను ఆ దేవి శ్రీచరణ ముల దగ్గర అర్పిస్తూ తన లక్ష్యం దిశగా సాగిపోవటానికి ఉద్యుక్తుడయ్యాడు స్వామి వివేకానంద.

*– అఖండజ్యోతి, జనవరి 2016*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**సహాయం చేసేవారినే దేవతలని అంటారు**

### నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి ప్రత్యేకం

# దేశపు మట్టిని పూజించే పూజారి



ఆయన గదిలో అడుగుపెట్టగానే ఆ ఆంగ్ల అధికారి నివ్వెరబోయాడు. విప్పారిన కళ్ళతో గదిని పరిశీలించాడు. చాలా సాధారణమైన గది, ఏ విధమైన అలంకరణ లేదు. నేలమీద పరచి ఉన్న ఒక చాప మీద ఆయన కూర్చుని ఉన్నాడు. పక్కన కొన్ని పుస్తకాలున్నాయి. వ్రాయడానికి ఒక పీట, దాని మీద కొన్ని కాగితాలు, పక్కనే కలము. చేతిలో ఒక పుస్తకం ఉంది. చూడబోతే అది వివేకానందులవారి సందేశాల సంకలనంలా అనిపించింది. అది తమ శిష్యులకు, మిత్రులకు, గురుభాయిలకు అప్పుడప్పుడు వ్రాసినది. ఆ రచనల్లో దేశప్రేమ అనే నిప్పు శ్రోతల హృదయాలను రగల్చక మానదు. స్వామివారి ఓజస్వీ ఆలోచనలు ఆయనకు, ఆయన లాంటి అనేక ఇతర దేశభక్తులకు ప్రేరణ కలిగిస్తాయి. గదిలోని ఇంకో మూల త్రాగేనీటి కుండ ఉంది.

ఎదురుగా ఉన్న గోడ దగ్గరున్న వేదిక మీద పూల మధ్యలో ఒక వెండి డబ్బా ఉంది. అది పూజావేదిక లాగా అనిపిస్తోంది. దాని దగ్గరే ఒక చిన్న ఆసనం కూడా పరిచి ఉంది. దాని మీదే కూర్చుని పూజ, ధ్యానాలు చేస్తారు కాబోలు. ఇవి మాత్రమే ఉన్న ఆ గదిని ఆంగ్ల అధికారి చాలాసేపు చూస్తూ ఉండిపోయాడు. తను కూర్చోడానికి గదిలో కుర్చీ లాంటిదేమీ లేదు. నిల్చుని ఉండడమే నయం అనుకున్న ఆ అధికారి, "మిస్టర్ సుభాష్! మిమ్మల్ని ఖైదు చేసేందుకు నా దగ్గర వారెంట్ ఉంది." విచిత్రమైనభావంతో కొనసాగించాడు – "ఎలా ఉండాల్సిన వాడివి, ఎలా ఉన్నావు?"

సుభాష్ చంద్రబోస్ ఇంగ్లాండ్‌లో ఉన్నప్పట్నుంచి ఈ అధికారి పరిచయమే. 20 సెప్టెంబర్, 1920నాడు సుభాష్ ఐ.సి.ఎస్ పరీక్ష పాసైనరోజు ఇతనికి ఇంకా గుర్తు. పాసైన వారిలో సుభాష్ స్థానం నాలుగోది. ఆంగ్లంలో ప్రథమంగా నిలిచారు. ఆంగ్లేయులను వారి భాషలోనే మట్టికరిపించారు. వార్తాపత్రికల్లో దీనిగురించి చాలా చర్చ కొనసాగింది. కొన్నాళ్ళకే వార్తాపత్రికల్లో ముద్రించిన ముఖ్య సమాచారం, ఐ.సి.ఎస్ పదవికి రాజీనామా ఇచ్చిన సుభాష్. 22 ఏప్రిల్, 1921. ఈ రోజు భారతీయచరిత్రలో తిరిగి రాయలేనిది.

ఈ అధికారికి తెలుసు, ఆయన గనక ఆ రోజు రాజీనామా చేయకపోతే తప్పకుండా ఇప్పుడు తాను అయన క్రింద ఉద్యోగిగా ఉంటూ, సలాము కొట్టి, అప్పగించిన పనిని చేయవలసి ఉండేది; కానీ ఇప్పుడు పరిస్థితి వేరు. అందుకే, "ఎలా ఉండాల్సినవాడివి, ఎలా ఉన్నావు" అన్నాడతను. దానికి నవ్వుతూ జవాబుగా సుభాష్, "సరిగ్గా చెప్పారు మిస్టర్ గ్రిఫిథ్! నేను నౌకరుగా ఉండేవాడిని, కాని ఇప్పుడు నా దేశ స్వాతంత్ర్య సంగ్రామ సైనికుడిని." అన్నారు.

ఆ జవాబుకి విసుగెత్తిపోయిన అధికారి ఆ విసుగుతోనే, "నేను ఇప్పుడే అరెస్ట్ చేయాలి." అన్నాడు. మళ్ళీ నవ్వుతూ సుభాష్ అన్నాడు "తప్పకుండా. నీకు అప్పగించిన పని నువ్వు చేయి." అప్పుడు అధికారి, "నీ గదిని వెతకాలి" అన్నాడు గంభీరంగా. "ఓ తప్పకుండా" అని మళ్ళీ నవ్వుతూ జవాబిచ్చారు. జరుగుతున్న దానికి, జరగబోయేదానికి ఏమాత్రం చింతలేకుండా, నిశ్చింతగా ఉంది ఆయన నవ్వు, మాట.

ఆంగ్ల అధికారి గ్రిఫిథ్ చాలా జాగ్రత్తగా గదిలోని వస్తువులను పరీక్షించసాగాడు. పుస్తకాలు, కాగితాల్లో అనుమానాస్పదంగా ఏదీ దొరకలేదు. తరువాత వేదికపై ఉన్న వెండి డబ్బా తీస్తే అందులో చూర్ణం లాంటిదేదో ఉంది. "ఇదేంటి మిస్టర్ సుభాష్" అడిగాడతను. "ఇది మా దేశపు మట్టి మిస్టర్ గ్రిఫిథ్" అభిమానంతో వచ్చింది జవాబు.

"కానీ ఇక్కడ దీనిని ఇలా పూలతో అలంకరించి ఉంచడంలో ఆంతర్యం ఏంటి?" ఆత్రుతగా అడిగిన ఆ ప్రశ్నకు సుభాష్ ఇలా అన్నాడు. "నేను నా దేశపు మట్టిని రోజు పూజిస్తాను. స్వాతంత్ర్యం అనే నా లక్ష్యాన్ని స్మరిస్తూ ఉంటాను." ఈ జవాబు ఆ అధికారికి ఏమాత్రం అర్థం కాలేదు.

"మిస్టర్ సుభాష్! నీకు ఖచ్చితంగా పిచ్చిపట్టింది. లేకపోతే మట్టిని ఎవరైనా పూజిస్తారా?" అన్నాడు. దానికి మళ్ళీ నవ్వుతూ, "ఇది నీకు అర్థం కాదు. నువ్వు ఇంగ్లాండ్‌లో పుట్టావు. భారత

**ఆచరణలోనికి రాని జ్ఞానం వృథా**

దేశంలో పుట్టుంటే తల్లి విలువ, మాతృభూమి విలువ తెలిసేది. నువ్వు మట్టి అంటున్న ఆ వస్తువు నా మాతృభూమి పాదధూళి. నేను రోజు దీనిని పూజిస్తాను, నా నుదిటిపై పెట్టుకుంటాను. ఈ విషయాలన్నీ నువ్వు అర్థం చేసుకోలేవు. నీకు అప్పగించిన పని చేయి."

సరేనంటూ సుభాష్‌కు సంకెళ్ళు వేసి తీసుకెళ్తున్నా ఆయన ముఖంలో మందహాసమే ఉండడం చూసి అధికారి విస్తు బోయాడు. ఇన్నాళ్ళల్లో ఇలా బంధించుకుని తీసుకుని వెళ్తున్నప్పుడు మనుషులు కలవరపడడమే చూశాడు కానీ ఇలా ప్రసన్నంగా, ఏ చింతా లేకుండా ఉన్నవారు ఎవరూ లేరు. "ఇలా అరెస్ట్ అయినందుకు నీకేమాత్రం బాధ లేదా మిస్టర్ సుభాష్" అన్న అధికారిని చూసి, "కష్టం, త్యాగం – ఈ రెండు స్వాతంత్ర్యానికి పునాదులు. వీటి ఆధారంగానే మా స్వతంత్ర, సశక్త దేశం నిర్మించబడుతుంది. దేశంలోని యువత అందుకు తమని తాము అర్పించుకోడానికి సిద్ధమైనప్పుడు స్వతంత్రమనే కల నిజమవడానికి ఎంతో కాలం పట్టదు." అంటూ సుభాష్ మాటలు, చెప్పిన విధానం, వాణిలో దాగున్న సాహసం గ్రిఫిత్ వెన్నును వణికించింది. ఈ మనిషి నిజంగా గొప్పవాడు, ఇదే పరిస్థితి కొనసాగితే మా ఆంగ్లేయులంతా భారతదేశం వదిలి వెళ్ళాల్సిందే అని మనసులోనే అనుకున్నాడు అతను.

ఆ తరువాత రహస్యంగా సుభాష్‌ను బర్మాలోని మాండలే జైలుకి తరలించారు. లాలాలజపతిరాయ్, భగత్‌సింగ్ బాబాయి సర్దార్ అజిత్ సింహ్, లోకమాన్య బాలగంగాధర్ తిలక్ వంటి గొప్ప దేశభక్తుల కఠోర తపస్సుకు సాక్షిగా నిలిచిన జైలు అది. క్రాంతికారుల పుణ్యతపోభూమికి చేరుకుని సుభాష్ చాలా ఆనందించారు.

మహర్షి అరవిందోగారి ప్రియశిష్యుడు, తన సహపాఠి, మిత్రుడు అయిన దిలీప్‌కుమార్ రాయ్‌కు 2 మే, 1925న సుభాష్ తన హృదయ భావోద్వేగాలను వ్యక్తపరుస్తూ రాసిన ఉత్తరం, "ఇక్కడ ఉండడం వల్ల నా ఆలోచనల్లో మార్పు వస్తోంది. ఈ జైలు వాతావరణం నాలో దార్శనిక ఆలోచనలు కలిగిస్తోంది. జీవితం గురించి నేనిక్కడ నేర్చుకున్నది, చదివిన దర్శనాలు నాకు చాలా లాభదాయకమైనవి. ఆరోగ్యమైన వ్యక్తికి ఆలోచించే సమయం ఉంటే ఇక్కడ కష్టాలు కూడా సుఖంగా అనిపిస్తాయి. ఈ జైలు గోడల లోపలే లోకమాన్యుడు గీతారహస్యాన్ని రచించారు. చేతులకు బేడీలున్నా వ్రాస్తున్నప్పుడు ఆయన ఆత్మలో ఆనందం, పరమశాంతి ఖచ్చితంగా ఉన్నాయి. అటువంటి గొప్ప దేశభక్తుల అడుగుజాడలలో నడుస్తున్నాననే ఆలోచనే నాలో గౌరవాన్ని, ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ జైల్లో నాకు ఆత్మశాంతి లభిస్తుందని నా నమ్మకం."

నిజంగానే మాండలే జైలు ఆయనకు తపోభూమిగా మారింది. అక్కడ ఆయన ఆత్మవిశ్లేషణ చేసుకున్నారు, ఆలోచనలు, జీవితాన్ని సరిదిద్దుకున్నారు. ఏదో ఈశ్వరీయ శక్తి అంతరిక్షం నుండి ఆయనలో అవతరిస్తున్నట్టు అనుభూతి చెందారు. జైల్లో కష్టాలు ఆయన సాధనలుగా మారాయి. కాలం గడుస్తున్నకొద్దీ ఆయనలో క్రొత్త వ్యక్తిత్వం నిర్మాణం కాసాగింది. ఆయన అందరి ప్రియతమ సేనాని, మహా నాయకుడు, నేతాజీ అయ్యారు.

దేశశిల్పి, నైపుణ్యం గల యోధుడు, ఆలోచనాపరుడు, రచయిత రూపంలో ప్రజలు ఆయనలో మార్గదర్శకుడిని చూడ సాగారు. భారతీయ యువత ఆయనతో, "దేశమంతా చీకటిలో మునిగిపోయిన ఈ విపత్కర పరిస్థితుల్లో మీ వ్యక్తిత్వం మాకు ప్రకాశస్తంభంగా నిలిచింది" అన్నారు. అప్పటికీ, ఇప్పటికీ ఇది కాలానుగుణమైన తథ్యం. నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేటికీ దేశప్రజలకు ప్రేరణ, ప్రకాశపుంజం.

*– అఖండజ్యోతి, జనవరి 2016*

*అనువాదం – జయలక్ష్మి*

## పరిపూర్ణ మానవుడు కావాలి

*పండిత మోతీలాల్ నెహ్రూ తన కుమారుడు జవహర్‌ను విదేశాలకు పంపించి చదివించాలనుకున్నారు. ఆయన మిత్రుడైన సుందర్‌లాల్ అలహాబాదులో ప్రముఖ న్యాయవాది. నీ కుమారుని విదేశాల్లో చదివిస్తే ఎంత ఖర్చవుతుంది? అని అడిగారు. దాదాపుగా ఒక లక్ష రూపాయలవుతుంది అని చెప్పారు మోతీలాల్. అదే డబ్బును తియ్యకుండా ఉంచితే నీ కుమారునికి జీవితాంతం ఉపయోగపడుతుంది కదా? అన్నాడు మిత్రుడు. మోతీలాల్ వెంటనే సమాధానమిచ్చారు. "నేను నా తరువాత డబ్బును వదలిపోవాలనుకోవడం లేదు. ఒక పరిపూర్ణ మానవుడిని వదలాలని చూస్తున్నాను."*

*– అనువాదం: పొన్నూరు హైమవతీశాస్త్రి*

**ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుంది**

రిపబ్లిక్ డే ప్రత్యేకం

# దేశ గణతంత్ర ప్రతిష్ఠకు సవాలు




"భారత ప్రజలమైన మేము ఈ భారతదేశాన్ని సార్వభౌమ, సామ్య వాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా రూపొందించు కుని, భారత పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని ఆలోచనలోను, భావ ప్రకటనలోను, మతవిశ్వాసం లోనూ, ఆరాధనలోను స్వేచ్ఛను జీవిత అవకాశాలలో సామాజిక విషయాలలోను సమానత్వాన్ని, వ్యక్తి గౌరవాన్ని, జాతీయ ఐక్యతను, సమగ్రతను పెంపొందించుకునే విధంగా సౌభ్రాతృత్వాన్ని కల్పించి ఈ రాజ్యాంగ పరిషత్తులో చర్చించి, తీర్మానించి, పరిగ్రహించి చట్టరూపంలో మాకు మేము 26 నవంబరు 1949 నాడు సమర్పించుకుంటున్నాము." ఈ ఉపోద్ఘాతం కలిగిన రాజ్యాంగాన్ని భారతదేశం 26 జనవరి 1950 నుండి అమలు పరిచింది. ఈ పదాలు భారత సంవిధానానికి ఆత్మ అంటారు. వీటిని స్వీకరించిన 67 సంవత్సరాలకి అసలు ఈ వాక్కులు భారతదేశ జన-గణ-మనస్సుల్లో ఎంతవరకు అవతరించాయి, దేశ గణతంత్రం ఏ దిక్కులో ముందడుగు వేస్తోంది అనేది పరిశీలించుకోవాలి.

రాజకీయ అస్థిరత్వాన్ని ఆధారం చేసుకుని జాతి ఐక్యతను, సమగ్రతను భంగపరచడానికి ప్రక్కదేశాలు చేసే ప్రయత్నాలను చూస్తే, పదికాలాల పాటు దేశాన్ని సంరక్షిస్తూ, ప్రగతిపథంలో ఖచ్చితంగా నడిపించే గొప్ప సంవిధానం మనది అని తెలుస్తుంది. కానీ పేదరికానికి, సంపన్నతకు మధ్య అంతరం పెరగడం, ప్రాంతీయ అసమానతలు, ప్రాంతాల మధ్య విభేదాలు, జాతీయ రాజకీయ దళాలతో పోలిస్తే ప్రాంతీయ రాజకీయ దళాల దృష్టికోణంలోని సంకుచితత్వం, ఇవన్నీ చూస్తే మాత్రం మన పూర్వీకులు ఏ భావంతో సంవిధానాన్ని రూపొందించారో దానిని మనం అమలుపరచడంలో విఫలమయ్యామని అనిపిస్తోంది. దేశంలో ఇప్పటికీ భేదభావాలున్నాయి. సాంప్రదాయ, మూఢ విశ్వాసాల ఆసురీశక్తులు అడపా దడపా తలెత్తుతూనే ఉన్నాయి. దేశ ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పించడమనేది అసాధ్యంగా కనిపిస్తుంది. దేశంలో కొత్త రాష్ట్రాలు అవతరించాయి, మరెన్నో రాష్ట్రాలను అడుగుతున్నారు. దేశంలోని రాష్ట్రాల మధ్య, రాష్ట్రాలలోని జిల్లాల మధ్య ఆర్థిక, వికాస అసమానతలు తగ్గకపోగా పెరుగుతూనే ఉన్నాయి.

దేశ గణతంత్రం ఏర్పడినప్పటి తరం ప్రజలు 67 ఏళ్ళలో దానిని వారితోపాటు పెరిగి పెద్దవడం దగ్గర నుంచి చూశారు. అప్పట్లో వాళ్ళ పెద్దల కళ్ళల్లోని కలలు మసకగా గుర్తుంటాయి. శ్రేయస్సు కోసం వారు కన్న కలలు ఇప్పటికీ అవే, అలా కలలుగానే ఉన్నాయి. పేదలు, సంపన్నుల మధ్య తేడా పెరుగుతూనే ఉంది. దారిద్ర్యరేఖను మనం ఎంత పైకి తేవడానికి ప్రయత్నిస్తున్నా జీవించడం మాత్రం ఇప్పటికీ అంతే కష్టంగా ఉంది. అందరు ప్రక్కవాళ్ళ కన్నా ఎక్కువ హంగు ప్రదర్శించాలని చూస్తున్నారు.

ఎన్నో శతాబ్దాల బానిసత్వం వదిలిపోయి సంపూర్ణ స్వరాజ్యం వచ్చేసరికి ఆశలకి హద్దులు లేకుండా పోయాయి. మనస్సుకు నచ్చినట్టు చేయాలని ప్రతి ఒక్కరి కోరిక. దానివల్ల మొదట్లోనే మహత్వాకాంక్షలు పెరిగి అసమ్మతి పడగవిప్పింది. ఏ గణతంత్రాన్ని సాధించడానికి వందల జాతులు, మతాలు, సముదాయాలు మూకుమ్మడిగా పోరాడాయో, ఇప్పుడు వాటి భీషణ వేర్పాటు మొదలైంది.

అసహనం, విభజన, అణచివేత, రక్తపాతం, దోపిడీ ఇవన్నీ చూసింది దేశం. అయినా వాటన్నింటినీ మరచిపోకముందే ఒకరినొకరు తారాస్థాయిలో నిందించుకోవడం చూశాం.

**అతిగా తినడం ఆరోగ్యానికి హానికరం**

సమాజం అన్ని విషయాలకీ కేంద్రబిందువుగా మారిపోయింది. పూజ-ప్రార్థన, దేశభక్తి, ఆటపాటలు, చదువులు అన్నీ సహజంగా చేసుకుపోయే మన పరంపర క్రొత్త దారి పట్టింది. మన లలితకళలు, సాహిత్యం అన్నింటికీ రూపురేఖలు మారి పోయాయి.

ఇది విశ్వఏకీకరణ యుగం. దానంతట అదే వచ్చిందా, ఎవరైనా తెచ్చారా అన్నది ప్రశ్నార్థకమే. కానీ దాని పరిణామం స్పష్టంగా ఉంది. ప్రపంచమంతటా, ముఖ్యంగా ఆసియా ఖండంలో ఆర్థికవ్యవస్థ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. మన సామాజిక, సాంస్కృతిక స్థితిపై తీవ్రంగా ప్రభావం చూపుతోంది. కుటుంబాలు, భాషలు, ఉత్సవాలు, సదస్సులు, చేనేతలు అన్నింటి అంచనాలు మారిపోయాయి.

ఉద్యోగాలు, వ్యాపారాలు, వాటి అవసరాలు మునుపటి లాగా లేవు. దేశం పట్ల నిష్ఠలో కూడా తేడా ఉంది. ప్రపంచం ఒక గ్లోబల్ విలేజ్‌గా మారింది. స్వచ్ఛంద ఆర్థికవ్యవస్థ వల్ల ప్రజలు ఏ దేశంలో, ఏ కంపెనీలకి పని చేస్తుంటే వాటి పట్ల మాత్రమే నిష్ఠగా ఉంటున్నారు. అనేక ఒత్తిళ్ళ వల్ల వ్యక్తి స్వార్థపరుడయిపోతున్నాడు. విజయాలు, అపజయాలు అన్నీ తన స్వంతం అయిపోతున్నాయి. డబ్బు పిచ్చి బాగా పెరిగి, ఎలా సంపాదిస్తున్నాం అనేదానికి హద్దులు, మర్యాద లేకుండా పోతోంది. ఆ విధానాలు, ఆస్తుల గురించి ఎవరైనా ప్రశ్నిస్తే దాన్ని వ్యక్తిగత అవమానంగా భావిస్తున్నాడు. నేడు జి.డి.పి తగ్గుతోంది, ధరలు పెరుగుతున్నాయి. ఆశ్చర్యం ఏంటంటే మన దేశంలో లక్షల కోట్లకు పడగెత్తినవారు 96మంది ఉన్నారు, వారు దేశాన్ని ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉంచారు. పైపైన చూస్తే అన్నివైపులనుండి ప్రగతి సాధిస్తున్నాం అనిపిస్తుంది.

చిన్నాపెద్ద తేడా లేకుండా అందరి చెవులకీ మొబైలు ఫోన్లు అతుక్కుపోయాయి. క్షణక్షణానికి, గంటగంటకీ కుటుంబంతో, వ్యాపారులతో, పరాయివారితో అలా మాట్లాడుతూనే ఉండడం అవసరం అయిపోయింది. పర్మనెంట్ పనులన్నీ పోయి టెంపరరీ అయ్యాయి. రోజువారీ జీతాలొస్తున్నాయి. చాలామందికి ఉపాధి దొరికింది, కాని చిన్నపాటివే. అందరి పిల్లలు స్కూళ్ళకు వెళ్తున్నారు, కాని కొన్నేళ్ళకే. ఉన్నత విద్య ఖరీదు బాగా పెరిగింది, జనాభాలో చాలా శాతం వాటి వంకైనా చూడలేరు. ఈ పదేళ్ళల్లో కోటీశ్వరులు వందలకోట్ల ధనాన్ని సంపాదించారు. ఈ కాలంలో పెరిగినంత పేదరికం ఏ దశాబ్దంలోను లేదని కూడా కొన్ని చోట్ల చెప్తున్నారు. రెండు వేలల్లో కూడా నెల గడుస్తుంది నగరాల్లో. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా ధరలు మాత్రం ఆకాశాన్ని దిగి కాస్త కూడా దిగట్లేదు.

ఒకప్పుడు నదులు ప్రవహించేవి. ప్రవహించే స్వచ్ఛ నదీ జలాలలో స్నానం చేసేందుకు ఎన్నో పండగలుండేవి. గంగా యమునలలో రోజూ స్నానం చేసేవారు చాలామందే ఉండేవారు. ఇప్పుడు వర్షం పడ్డప్పుడు తప్ప నదుల్లో నీరే కనిపించదు. మంచినీటి నదులు మెల్లిమెల్లిగా సరస్వతిలాగా మాయమైపోతున్నాయి. ఒకప్పుడు గంగ అనగానే నమస్కరించే వారు. ఇప్పుడు నగరాల్లో గంగా యమునలపైన కట్టిన వంతెనల మీద వెళుతూ జనాలు ముక్కు మూసుకుంటున్నారు.

రైతులు కనే కలలు అర్థరాత్రివై ఉంటాయి. తెల్లవారు ఝామునవైతే ఇన్నేళ్ళల్లో కాస్తో కూస్తో నిజమయ్యేవి. ఆత్మ హత్యలు లేని రాష్ట్రమే లేదు. ఒక చోట కరువు, మరో చోట వరద. ఆర్థిక వ్యవస్థ క్రొత్తది కాబట్టి అన్నింటికన్నా ముందు పంటలకు సంబంధించిన రాయితీలపైనే వేటు పడుతుంది. నాయకుల కన్ను ముందు విత్తనాలు, ఎరువు, డీజిల్ మీదే పడుతుంది. పంటలు వేసేటప్పుడు ధరలు పెరుగుతాయి, కోతకు వచ్చినప్పుడు ప్రభుత్వం ధరలు నిర్ణయిస్తుంది. చెరుకు అమ్మినా అప్పే మిగులుతుంది, వరి, గోధుమలు అమ్మితే బొటా బొటిగా ఖర్చులకు సరిపోతాయి.

దేశంలోని పల్లెటూర్లు, చిన్న పట్టణాలను పరిశీలిస్తే అసలు పరిస్థితి ఏమిటి అనేది అర్థమవుతుంది. చదువుకోలేకపోయిన పిల్లలు ఇప్పటికీ పశువులకు కాపలాగా ఉన్నారు. పంటని అమ్మితే వచ్చే డబ్బు సంవత్సరానికి వడ్డీకే సరిపోదు. దేశం జి.డి.పి పెరుగుతోంది, అలానే రైతు కళ్ళల్లో కన్నీళ్ళు కూడా కారుతున్నాయి. ఆ కన్నీటిలోనే వారి కలలు కరిగిపోతున్నాయి. పశువులను మేపిమేపి పిల్లల మొహాలు కూడా వాటిలాగా తయారవుతున్నాయి.

ఇంగ్లీషు భాషతో ఆర్భాటం చేసేవారి వల్ల ప్రాంతీయులు ఏళ్ళ తరబడి అవమానింపబడుతూనే ఉన్నారు. ఇప్పుడు పరిస్థితులు కాస్త మెరుగయ్యాయి. ప్రాంతీయ భాషలు, హిందీ,

**అతి తక్కువగా తినడం ఆపదను కొనితెచ్చుకొనడమే**

ఆంగ్లం అన్నీ వింతవింతగా కలిసిపోయాయి. సాధారణ సంభాషణల్లో, సినిమాల్లో కూడా ఈ భాషల వింత కలయిక కనిపిస్తోంది. ఇప్పుడు ప్రాంతీయ భాషలకు గౌరవం పెరుగు తోంది. ఉద్యోగాలు వస్తున్నాయి. చదువుకున్న వారు కూడా ఈ భాషలకు ప్రాధాన్యతను ఇస్తున్నారు. పెద్ద పెద్ద కంపెనీలు కూరగాయలు అమ్మడానికి ఇంటింటికీ వెళ్తున్నాయి. రైతుల ముందు చేయిచాచి వేలంపాట లాగా చక్కటిధర చెల్లించిమరీ గోధుమలు కొంటున్నాయి.

టి.వీలు, కంప్యూటర్లు, అత్తా కోడళ్ళు, సూపర్ సింగర్లు, లిటిల్ చాంప్‌లు, వగైరా వగైరా అంతా ఎంతో మనోహరంగా అనిపిస్తుంది. క్రికెట్ కామెంటరీలు చేసేది అతివలు, గర్భంలోనే కన్నుమూసేదీ అమ్మాయిలే. చిన్న నగరాలకు షాపింగ్ మాల్స్ చేరుకున్నాయి. ప్రజలకి క్రొత్త కలలు చూపిస్తున్నాయి. ఈ కలల మధ్యలో అప్పట్లో మహాత్ములు దేశం కోసం కన్న కలలు మాయమైపోతున్నాయి. వ్యక్తిగత సార్వభౌమత్వం కోసం దేశ సార్వభౌమ అధికారాన్ని పణంగా పెడుతున్నారు. కేంద్రంలో, రాష్ట్రాల్లో ఎన్నుకోబడ్డ ప్రభుత్వ ప్రతినిధుల దగ్గర ఇప్పుడు ఏ మాత్రం అధికారం మిగిలింది? అనేక ఒప్పందాల పేరిట దేశవిదేశాల కంపెనీలకి, బహురాష్ట్రీయ కంపెనీలకి, సంయుక్త రాష్ట్ర సంఘం లాంటి అంతర్జాతీయ సంస్థల విభిన్న అంగాలకీ అప్పచెప్పేశారు అన్న విషయం తలుచుకుంటేనే ముళ్ళు గుచ్చుకున్నట్టు ఉంటుంది.

మహాత్ములు కలలు కన్నట్టుగా, ప్రజాస్వామ్యపద్ధతిలో ఎన్నుకోబడ్డ నాయకులు నిజంగానే ఆఖరి కన్నీటిబొట్టు తుడిచేందుకు నడుంకట్టారా? లేక వారి స్వార్థం చూసుకుంటూ ఈ భావాలు మర్చిపోయారా? గణతంత్రదినం జరుపుకుంటున్న ప్పుడల్లా తలెత్తే ప్రశ్న ఇప్పుడు మళ్ళీ ముందుకొచ్చింది, దేశం, గణం, తంత్రం మూడు దూరమవుతున్నాయా, దగ్గరవుతున్నాయా?

దూరం పెరుగుతోంది అంటే, సమస్యకు పరిష్కారం క్రొత్త కోణంలో వెతకాలి. ప్రగతి అనేది రాజ్యాలు, కొండల మధ్య బతుకుతున్న ఆదీవాసీ తెగలు, వెనకబడ్డ వర్గాలకు చాలా ముఖ్యం. ప్రగతి పేరుతో వీరి జీవనాధారాన్ని, పర్యావరణాన్ని బలిగొంటున్నారు. గాలి, నేల, నీరు అన్నీ కలుషితమయ్యాక ప్రగతికి అర్థం ఏంటి అని ఎవరూ అడగరే!

ఈ పరిస్థితుల్లో దేశం ఐక్యత, సమగ్రతలను కాపాడు కోవాలంటే ప్రాంతీయ ఆకాంక్షలు, దేశ అవసరాలు, ప్రగతి పథం – ఈ మూడింటి మధ్య సమన్వయం స్థాపించాలి. గణ తంత్రానికి గౌరవాన్ని మళ్ళీ కల్పించాలంటే క్రొత్త సంకల్పాలు తీసుకోవాలి. విద్య, మంచినీరు, భోజనం, వసతి మొదలైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి స్థానికంగా, దేశ వ్యాప్తంగా ఎంత ఖర్చుపెట్టాలి అనేది రాజ్యాంగంలో పొందు పరచాలి. ప్రభుత్వం ఏర్పాటులో వచ్చే రాజకీయ మార్పుల ప్రభావం దాని మీద పడకూడదు. అంతర్‌రాష్ట్రీయ స్థాయిలో దేశ గణతంత్ర గౌరవాన్ని పెంచే ఇటువంటి క్రొత్త ప్రతిపాదనలు చాలా రావాలి.

దేశపౌరులంతా కూడా ఈ విషయమై ఆలోచించి, సంకల్పం తీసుకోవాలి. యజుర్వేదంలో ఋషి పలుకుల లాగా మనలో కూడా దేశభక్తి ఉప్పొంగాలి. మన ప్రార్థనలు, సంకల్పాలు, పనులు అన్నీ దేశానికి సమర్పించుకోవాలి.

**“ఆ బ్రహ్మన్ బ్రాహ్మణో బ్రహ్మవర్చసీ జాయతామా రాష్ట్రే రాజన్యః శూరేశవ్యోతివ్యాధీ మహారథో జాయతాం దోగ్ధ్రీ ధేనుర్వోఢానడ్వానాషుః సప్తిః పురన్ధిర్యోషా జిష్ణూ రథేష్ఠాః సభేయో యువాస్య యజమానస్య వీరో జాయతాం నికామే-నికామే నః పర్జన్యో వర్షతు ఫలవత్యో నోషధయః పచ్యంతాం యోగక్షేమో నః కల్పతామ్.** – యజుర్వేదం (22/22)

***భావం:*** హే బ్రహ్మ! ఈ దేశంలో బ్రహ్మవర్చస్సుతో నిండిన బ్రాహ్మణులు మరియు ధనుర్విద్యలో నిపుణులు, శత్రువులను జయించే మహారథులు క్షత్రియులు జన్మించెదరు గాక. వేగవంతమైన గుఱ్ఱాలు, బలవర్ధకమైన ఎడ్లు, పాలిచ్చే ఆవులు పౌరులకు అందుగాక! ఇక్కడి స్త్రీలు సర్వగుణసంపన్నులు, శీలవతులు అవుదురుగాక! వీరులు, పురుషులు విజయాన్ని పొందుగాక! సాధు స్వభావంగల శ్రేష్ఠ వక్తలు, వీర యువకులు సభలో ఉందురు గాక! కోరుకున్నప్పుడల్లా అవసరానికి తగ్గ వర్షాలు కురువుగాక! మన దేశం – పళ్ళు, ఓషధులు, అన్నంతో సమృద్ధిగా ఉండి, ఎప్పటికీ ఆనందంగా–సురక్షితంగా ఉండు గాక!

*సేకరణ: అఖండజ్యోతి, జనవరి 2016;*
*అనువాదం: జయలక్ష్మి*

**అవసరాలు పరిమితంగానే ఉంటాయి, కోరికలకు అంతు ఉండదు**

## 21వ శతాబ్ది-ఉజ్జ్వల భవిష్యత్తు - 2

# వాస్తవికత-దానిని అధిగమించడమెలా?

సమస్త విశ్వములోని సగం మంది ప్రతిభాశీలురు యుద్ధం కొరకు అవసరమయ్యే అనేక పనులలో ఏదో ఒక రకంగా నిమగ్నమై ఉన్నారు. పెట్టుబడులు మరియు పెద్దపెద్ద భవనములు ఈ ప్రయోజనం కోసమే ఉపయోగించబడు తున్నాయి. పెద్దల ఆలోచన మరియు వారి సామర్థ్యములు దీని గురించి రకరకాలుగా ఆలోచించడంలోనే వినియోగించ బడుతున్నాయి. ఈవిధమైన సంపూర్ణతంత్రముయొక్క ఉపయోగము యుద్ధము కొరకే వినియోగించబడితే పరమాణు ఆయుధాలు పృథ్వీ యొక్క మహావినాశనమునకు ఖచ్చితంగా కారణమవుతాయి. అప్పుడు పృథ్వీమీద జీవనము అనేదే మిగలదు. ఒకవేళ యుద్ధము జరుగకపోతే ఇంకొక ప్రమాదము పొంచి ఉంటుంది. అదేమిటంటే తయారుచేసిన యుద్ధ సామగ్రిని ఏమి చేయాలి? ఆ ప్రయోజనముకొరకు ఉపయోగించబడిన **జనశక్తి, ధనశక్తి మరియు సాధనాశక్తిని** ఒక క్రొత్త విధానమును అవలంభించి, ఈనాడు అసంభవమనిపించే **నూతనదిశ** ఇవ్వడము కొరకు ఏమి చేయాలి?

నేటి పరిస్థితులలో అన్నింటికంటే భయంకరమైనది వక్ర బుద్ధి, సంకీర్ణ స్వార్థచింతనతో నిండిన అస్తవ్యస్తమైన మనస్సు, బద్ధకంతో కూడిన విలాసవంతమైన అనాచార స్వభావము. బయటకు దేవతల, సాధువుల ముసుగువేసుకుని తిరుగుతున్న ప్పటికీ మనిషి పై కారణముల వలన ప్రేతపిశాచస్థాయికి దిగజారాడు. నేటి జనసముదాయము శారీరిక దృష్టితో చూస్తే రోగగ్రస్తమై, లేమితో కూడిన అసహనము, బాధతో, ఆవేదనతో నిండి ఉన్నది. వీటన్నింటిని ఎలా నివారించగలము? ఇలాంటి పరిస్థితులు ఉన్నప్పుడు రాబోయేరోజులలో ఏమి చేయగలము? ఆలోచించగలిగే ప్రతివ్యక్తి ఈ ఆలోచనలతో కింకర్తవ్యవిమూఢు లవడము సహజమే. భవిష్యత్తులో ఏమి జరుగుతుందో ఊహించలేకుండా ఉన్నాము.

### సదుపయోగము చేయగలిగితే పరివర్తన సంభవమే

మానవుడు అనంతశక్తుల యొక్క భాండాగారము. వాటిలో అతి స్వల్పమైన అంశము శరీరావసరములకు వినియోగించ బడుతుంది. మిగిలిన శక్తి ప్రసుప్త, మూర్ఛితస్థితిలోనే ఉంటుంది. ఉపయోగించుకొనకపోతే పదునైన పరికరములు కూడా తుప్పు పడతాయి. ప్రతిభయొక్క అంగప్రత్యంగములను ఉపయోగించు కొనకపోతే మనిషి కూడా గానుగెద్దువలె ఏదోవిధంగా బ్రతుకును వెళ్ళదీస్తాడు. కానీ ఎప్పుడైతే అతనిలోని ఉత్సాహము పెల్లుబుకుతుందో అప్పుడు తత్పరత, లక్ష్యశుద్ధి, స్ఫూర్తి, లోతులలోకి దిగగలిగే సామర్థ్యము, సంపాదించాలనే కోరిక తమ చమత్కారములను చూపించగలుగుతాయి. దానితో ఎక్కడో ఉన్న వ్యక్తి ఎక్కడికో చేరుకోగలుగుతాడు. సాధారణ పరిస్థితులలో కూడా ఇటువంటి వ్యక్తి ఇతరులను ఆశ్చర్య చకితులను చేసే పనులు చేయగలుగుతాడు.

గత మూడు శతాబ్దముల కాలము భౌతిక ప్రయోజనము లకే పరిమితమైనను; దానిని ఆత్మజాగృతికాలము అనాలి. శక్తిని ఎక్కడ ప్రయోగించినా అది తన పనిని చేస్తుంది, చేసింది కూడా. భౌతిక ప్రగతి దిశలోనే దానిని ఉపయోగించినప్పుడు ఆ దిశలోనే అనేక అన్వేషణలు జరిగి ప్రత్యక్షవాదముయొక్క పాతమూసలోనే బుద్ధివాదమునకు క్రొత్త రూపమును తయారు చేసింది. క్రొత్త స్ఫూర్తితో నూతనత్వము ఆవిర్భవించినప్పుడు దాని పరిణామాలు కూడా అసాధారణంగా ఉంటాయి. ప్రగతి పేరుమీద విస్తృతిచెంది క్రొత్త రూపము సంతరించుకున్న భౌతిక వాదము మరియు ప్రత్యక్షవాదము ప్రపంచములోని వ్యక్తి వ్యక్తిని ప్రభావితము చేశాయి. వైజ్ఞానిక ఆవిష్కారములు అనేక సుఖసాధనల భండారమును పెంచాయి. తెలివితేటల పేరుమీద ఎంత ఎక్కువ విషయాల గురించి జ్ఞానము సమకూర్చుకున్నా రంటే అది ఎవరినైనా అహంకారిగా మార్చవచ్చు. అలా జరిగింది కూడా. విభిన్న విషయాల గూర్చి రకరకాల జ్ఞానము సంపాదించుకొనుట అభినందనీయమైన కార్యమే. ఎవరు దీని కొరకు ఉత్సాహము, పురుషార్థము చూపించారో ప్రగతిశీలురు అనే కీర్తికూడా వారికి లభించింది.

### సదుపయోగము - దురుపయోగము

విషయము ఇక్కడితో ఆగదు. ఇంతకంటే పెద్ద రూపాన్ని ధరించి మన ముందుకు వస్తుంది. అదేమిటంటే శక్తి యొక్క

నిషిద్ధ సంపాదనతో జీవించేవారికి పుట్టగతులు ఉండవు

సదుపయోగ, దురుపయోగములలో ఏదో ఒకటి ఎన్నుకొనుట. స్వార్థము, ముందుచూపులేకపోవుట అనే వాటి సమన్వయము ఎప్పుడు జరుగుతుందో అప్పుడు – ఎంత ఎక్కువ సంభవమైతే అంత కూడబెట్టుకుని, ఎంత ఎక్కువ ఇంద్రియసుఖాలు పొంద గలమో అంత పొందాలి అనే ఒకే లక్ష్యము ఉంటుంది. తొందరపాటు గలవారు, చిన్నపిల్లల మనస్తత్వము గలవారు ఇదే చేస్తారు. వీరు పొందిన సాధనాసామాగ్రిని దృఢ నిశ్చయముతో సత్ప్రయోజనముల కొరకు ఉపయోగించే స్థితిలో ఉండరు. బంగారుగ్రుడ్డు ఇచ్చే బాతుయొక్క పొట్ట చీల్చి అన్ని గ్రుడ్లను ఒకేరోజు పొందాలనుకునే తొందరపాటు స్వభావము గల వ్యక్తి చేసిన ప్రయత్నాలే వీరు చేస్తారు.

ఏ వస్తువునైనా సదుపయోగము చేయగలిగితే మనకుకానీ, ఇతరులకుగాని మంచిని చేకూర్చవచ్చు. కానీ ఆ వస్తువుయొక్క దురుపయోగం వలన ఒక అగ్గిపుల్లతో ఊరినంతటిని తగుల పెట్టగలిగే అనర్థము జరుగవచ్చు. ప్రగతిశీలమనుకునే ఈ శతాబ్దులలో మనము చాలా పొందినా, ముందుచూపు లేకపోవుటవలన వాటి సదుపయోగము జరుగకపోగా, వాటి దురుపయోగం వలన నేడు అన్ని దిశలలో ప్రమాదాల మేఘాలు ఘనీభూతమవుతున్నాయి.

నేటి వైజ్ఞానిక ఉపలబ్ధులు, శాసకుల, ధనవంతులయొక్క లాభాలకుమాత్రమే పరిమితమై ఉండి ఉండకపోతే సాధారణ జనుల స్థాయిని, ఎక్కడి నుంచో, ఇంకెక్కడికో తీసుకొనివెళ్ళి ఉండేవి. ఎప్పుడైతే యంత్రాలు మనిషియొక్క క్రియాకలాపాలలో సహాయపడటము మొదలెట్టాయో, వాటిని ఇంకా చిన్నచిన్న పరిమాణములో తయారుచేసి తక్కువ ధరకు అందిస్తున్నారు. తక్కువ శ్రమతో, తక్కువ సమయంలో కావలసినవి సమకూర్చు కుని జీవించడము సాధ్యమైనప్పుడు మిగిలిన కాలాన్ని, కళా కౌశలాల అభివృద్ధికి, వ్యక్తులను ఎక్కువ సుయోగ్యులుగా తయారు చేయుటకు ఉపయోగించుకోవాలి. దీనివలన అన్ని చోట్ల ఆనందదాయకమైన వాతావరణము ఏర్పడేది. పని లేకుండా ఎవ్వరు ఉండేవారుకాదు. అంతేకాక ఎవ్వరికీ వ్యక్తిత్వ వికాసానికి మరియు సమాజముయొక్క సర్వతోభివృద్ధికి సహాయ పడటానికి సమయము లభించుట లేదు అనే మాట వినిపించేది కాదు. కానీ అలా జరుగుటలేదు. దురుపయోగము దురుప యోగమేకదా! దీనివలన అమృతం కూడా విషముగా మారుతున్నది.

**సునియోజనము యొక్క సవ్యమైన పరిణతి**

పెద్దపెద్ద పట్టణాలను నిర్మించి వాటిని విస్తృతపరచటానికి ఉపయోగించిన తెలివితేటలను గ్రామాలవైపు మళ్ళించి ఉండి ఉంటే ఈపాటికి అన్నిచోట్లా చిన్నచిన్న స్వావలంబమైన మరియు పుష్పించి, పల్లవించి, వికసించిన చిన్నచిన్న పట్టణాలు కనిపించి ఉండి ఉండేవి. పెద్ద పట్టణాలలోని స్థలాభావము, విషయుక్త వాతావరణము మరియు అనేకరకాల వికృతులను భరించాల్సిన అవసరము వచ్చి ఉండేదిగాదు మరియు చిన్న గ్రామాల నుండి పెద్ద పట్టణాలకు ప్రతిభ వలసవెళ్ళిపోవుట వలన అవి ఈనాటి దయనీయమైనస్థితిలో ఉండవలసిన అవసరము వచ్చేది గాదు.

వ్యక్తిగత లేక సార్వజనీన క్షేత్రాలలో జరిగే యుద్ధాలను, ఒకేవిధముగా తప్పు అని ప్రకటించి ఉండేవారు. చిన్నచిన్న పంచాయతీల వలె అంతర్రాష్ట్రీయ పంచాయతీలు కూడ వివాదములనన్నింటినీ పరిష్కరిస్తూ ఉండి ఉండేవి. ఆయుధాలు స్వల్ప పరిమాణములో రక్షకభటుల దగ్గర లేక అంతరాష్ట్రీయ పంచాయతీల వద్దనే ఉండేవి. అప్పుడు యుద్ధసామగ్రి తయారు చేయుటకు వినియోగించబడుతున్న నేటి అపారమైన ధనశక్తి మరియు జనశక్తిని ఆ దిశలో ఉపయోగించవలసిన అవసరము ఉండేది కాదు. అదే జనశక్తి మరియు ధనశక్తిని – శిక్షణకు పరిశ్రమలకు, చెట్లు నాటుటకు మొదలగు అనేక ఉపయోగ కరమైన పనులకు వినియోగించినట్లయితే, యుద్ధాల కొరకు ఉపయోగించబడుతున్న ఈ శక్తి సృజనకార్యాలకు ఉపయోగపడి ఒక అద్భుత, అసాధారణ ఫలితమును పొందగలిగి ఉండే వారము.

విద్య యొక్క ప్రయోజనము ఒక గుమాస్తా లేక ఉన్నతాధి కారియో అగుటకాక సమాజవ్యవస్థ మరియు జన–జీవితము యొక్క వ్యావహారిక సమస్యల సమాధానము కొరకు ఉపయోగించబడేది. అప్పుడు అందరు శిక్షితులై సభ్య, సుసంస్కారవంతులై ఉండేవారు. వారు తమ సామర్థ్యమును సర్వత్రా వికాసము మరియు ఉల్లాసమును పెంపొందిం చేందుకు ఉపయోగించేవారు. శిక్షితుడైన ప్రతివ్యక్తి ఇద్దరు అశిక్షితులను శిక్షితులుగా చేసినప్పుడే పెద్ద పదవిని పొంద గలుగుతారనే నియమము ఉండి ఉంటే ఈనాటి నిరక్షరాస్యత ఎప్పుడో పరిష్కరించబడి ఉండేది. విద్యాలయాలతోపాటు,

**ఏది నాటుకుంటామో, అదే కోసుకుంటాము**

పారిశ్రామిక శిక్షణ (I.T.I) తప్పనిసరిగా జోడింపబడి ఉంటే నిరుద్యోగ సమస్య, పేదరికము కనిపించేవి గావు.

**ప్రచురణ మరియు చలనచిత్రములు:** ఈ రెండు పరిశ్రమలు ప్రజాభిప్రాయమును ప్రభావితము చేయుటలో చాలా పెద్దపాత్ర వహిస్తాయి. విజ్ఞానము యొక్క ఈ రెండు ఉపలబ్ధులతోపాటు వీటికి ఉపయోగపడే ఆలోచనా విధానాన్ని మాత్రమే ముద్రించాలి లేక చిత్రీకరించాలి అనే అనుశాసనము జోడింపబడి ఉంటే వ్యక్తియొక్క సర్వతోముఖి శిక్షణ యొక్క అవసరము నెరవేరి ఉండేది. జన సాధారణమునకు విషయ పరిజ్ఞానముతోపాటు సుసంస్కారవంతులుగా తయారు చేయుటలో సఫలత లభించి ఉండేది.

### పరిష్కారము ఇలా కూడా సంభవమై ఉండేది

తెలివితేటలున్నవారుకూడా ఒకవిధంగా వైజ్ఞానికులే. శాసన తంత్రము, సమాజములోని విభిన్న క్రియాకలాపాలు వారి నిర్దేశములు మరియు ఒత్తిడి వల్లనే జరుగుతాయి. **సమాజములోని చెడుఅలవాట్లను, వ్యక్తిగత అనాచారాలను** నిరోధించే కంచెగనుక వీరు ఏర్పాటు చేసి ఉంటే పతనానికి దారితీసే శక్తిని మళ్ళించి దానిని సత్ప్రయోజనాలకి ఉపయోగించుకొనేవారు. అపరాధాలు, అనాచారాలు కంటికి కూడా కనిపించేవికాదు. అందరికీ ఒక సగటు పౌరుడి జీవిత విధానము అవలంభింపజేసే వెసులుబాటు కలుగజేయగలిగితే బీదరికము అనే మాటే వినిపించేది గాదు. అందరూ ఒకేరకంగా (ఏకత) మరియు ఒకేవిధంగా (సమానత) జీవనము జీవించేవారు. అప్పుడు సమాజములో వైషమ్యాలు ఉండేవి కాదు. అందరు సమానస్థాయిలో ఉండి, అందరు వారికి తగిన రీతిలో ఎదగటానికి వీలు కలిగి ఉండేది. అప్పుడు ఈ శతాబ్దాలలో జరిగిన బౌద్ధిక, వైజ్ఞానిక ప్రగతిని అందరు కొనియాడేవారు. వాటి సదుపయోగము వల్ల పృథ్వి యొక్క కణకణము ధన్యమైపోయేది.

మత్తు పదార్థములు, దుర్వ్యసనముల పట్ల చూసిచూడనట్లు ఉంటున్నాము. కనుకనే మనుష్యులు వీటికి అలవాటు పడుతున్నారు. వాటి ఉత్పత్తిని నిషేధించి, ఉపయోగించే వారిని దండించి ఉంటే, ఈనాడు 'నెమ్మదిగా ఆత్మహత్య' చేసుకునే ఉత్సాహవంతులు తగ్గేవారు!! వ్యసనములకు బానిసకాని వ్యక్తులు శారీరిక, మానసిక సంతులనము కలవారై అన్ని విధములైన నిందలు, అవమానాలనుండి తప్పించుకునేవారు. అనేక రకాలైన దుర్వ్యసనములు సామాన్య జీవితములో పూర్తిగా కలసిపోయాయి. కాముకతను పెంచే దుష్ప్రవృత్తులు నేటి ఫ్యాషన్‌లోని ఒక భాగముగా మారాయి. రకరకాల దుస్తులు, శృంగారసామగ్రులు మొదలైనవి సమాజములో ప్రతిష్ఠకు చిహ్నాములుగా భావించబడుచున్నవి. నగలసేకరణలో ఎంతో డబ్బు దుర్వినియోగమవుతున్నది. అభివృద్ధి చెందిన 'బుద్ధి వాదము' ఈ అపవ్యయములను నిరోధించి దానివల్ల వచ్చే నష్టాలను వివరించగలిగితే మనలను దరిద్రులుగా, అవినీతి పరులుగా మార్చడానికి ముఖ్య కారణమైన ఆడంబరమైన పెళ్ళిళ్ళు ఈవిధముగా పెచ్చురిల్లి ఉండేవి కావు.

పైకి ఎక్కడము ఎప్పుడైనా నెమ్మదిగానే సంభవము. కానీ పదదల్చుకుంటే క్షణాలలో చాలా క్రిందికి పడిపోవచ్చు. గతంలో ఇదే జరిగింది. చాతుర్యం పేరుమీద మూర్ఖత్వాన్ని పెంచుకున్నాము. దీనికి ప్రమాణమేమిటంటే 'పైన పటారం లోనలొటారంగా' ఉన్న నేటి పరిస్థితులు. చింత, ఉద్విగ్నత, అశాంతి, సంశయాత్మకమైన పరిస్థితులు లోపల, బయట అంతట విస్తరించి ఉన్నాయి. ఎవ్వరికీ శాంతి లేదు, ఎవ్వరికి సంతృప్తి లేదు. విపరీతమైన వైభవమున్నా శాంతిలేకపోవడానికి కారణము మానసిక దారిద్ర్యమే. *(సశేషం)*


దైవీశక్తుల తోడ్పాటుకై
కష్ట నష్టముల నివారణకై
చేసిన కృషి సత్ఫలితములనిచ్చుటకై
జ్ఞానము, సంపదల ఆర్జన కొరకై
జీవితంలో స్థిరపడుటకై

యుగశక్తి  గాయత్రి

మాసపత్రిక చదవండి!
చదివించండి!!

ప్రతుల కొరకై సంప్రదించండి:
ఫోన్: 040-23700722, 9949111175


ఏది ఇతరులకు ఇస్తామో అదే తిరిగి తిరిగి వస్తుంది

సమయదానమే యుగధర్మము-2

# ఆలసించడానికి ఇది సమయము కాదు

మానవ శరీరము యొక్క సంరచన ఇతర ప్రాణులతో పోలిస్తే ఎంత సమున్నతమైనది అంటే, దాని నిర్వహణకి , ఏ రకమైన అసౌకర్యాన్ని సహించవలసిన అవసరము, కారణము మన దృష్టికి గోచరించదు. అన్ని జీవాలు, జంతువులు ఆడుతూ పాడుతూ జీవిస్తాయి. గెంతుతు, పాడుతు కిలకిలారావాలతో రోజంతా గడుపుతాయి, కానీ మరి వికాసము చెందిన మనిషి ఈ విధముగా ఎన్నో బాధలతో చుట్టుముట్టబడి ఎందుకు ఉన్నాడో తెలియడము లేదు. రోగము, శోకము, అభావము, క్లేశము, విద్వేషము, అశాంతికి చెందిన అనేక రకాల కారణములు అతని మెడచుట్టు ఉచ్చు బిగిస్తున్నాయి. చింతలు, శంకలతో హృదయము కొట్టుకుంటూ ఉంటుంది. ప్రతి వ్యక్తి తన పరిధిలో ఎన్నో సమస్యలను చెప్తూ ఉంటాడు, సృష్టిలో సమస్త ప్రాణుల కంటే అన్ని కోణాలలో సుసంపన్నమైన ప్రాణి, ఆపదలు అన్ని వైపులనుంచి చుట్టుముట్టిన వాని వలె రోజులు గడుపుతున్నాడు.

కొంచెం గంభీరముగా ఆలోచిస్తే మనకి కారణము స్పష్టముగా కనిపిస్తుంది. వాసనలు, తృష్ణలు, అహంకారము (ఈగోయిజమ్) అనబడే నిబిడీకృతమైన భవబంధనాలు అతడిని చాలా గట్టిగా బిగించి వేసినందువల్ల ఇరవైనాలుగు గంటలు ఈ చిక్కుల వలలో అలవికాని బాధలు పడుతున్నాడు. లోభము, మోహము, అహంకారముల వలన కోసము మనిషి ఎంతో వ్యాకులపడుతూ "ఇంకా ఎక్కువ కావాలి" అనే ఆలోచన మినహా అతడికి మరి ఏదీ స్ఫురించదు, అంతే కాక తాను అల్లుకున్న గూటిలో తానే చిక్కుకొన్న సాలె పురుగులా దాని నుంచి బయట పడటానికి ఏదో ఒక ఉపాయము ఆలోచించడానికి, ఉత్సాహం కూడా తెచ్చుకోడు, ఆ వలనుంచి తప్పించుకొనే మార్గాన్ని వెతకడు.

మౌలికమైన అవసరాలు చాలా స్వల్పముగానే ఉంటాయి. వాటిని కొన్ని గంటలలో మన స్వశక్తితోనే పొందవచ్చును. ఎవరిని అడగవలసిన అవసరము కూడా రాకూడదు. మన ఉత్పాదన ఎంత ఎక్కువ ఉన్నదంటే వాటిని మనము సారవంత మైన భూమిలో నాటితే ఒకటి నుంచి వెయ్యి, వెయ్యి నుంచి లక్ష అనే క్రమములో నిరంతరము నిరాటంకంగా జరుగుతూ పోతుంది, అంతేకాక ప్రసన్నత నుంచి ప్రఫుల్లత వరకు ఆనందాన్ని మనిషి ప్రతినిమిషము అనుభవములోకి తెచ్చుకోవచ్చును.

జీవధారి యొక్క దౌర్భాగ్యము ఏమిటంటే ఆతడు ఎప్పుడు విపరీత బుద్ధినే కలిగి ఉంటాడు. ఫలితముగా ఏ కొమ్మమీద కూర్చుంటే దానినే నరుక్కొంటాడు. పురుగులు ఎందుకు దీపము పైకి ఎగురుతాయో కాని ఏదీ పొందక తమ రెక్కలనే కాల్చి వేసుకొని ఏడుస్తూ చచ్చిపోతాయి. పిట్టలు, చేపలు శ్రమ లేకుండా ఆహారము దొరకుతుందనే అనుకుంటాయి కానీ దాని చుట్టు ఉన్న ప్రాణఘాతకమైన వలను చూడవు. ఎడారిలో మృగతృష్ణల వెంట తిరిగి తిరిగి దాహంతో లేడి చనిపోతుంది. కస్తూరి మృగమైన హరిత తన నాభినుంచి వస్తున్న సుగంధాన్ని ఎక్కడినుంచో వస్తున్నదని భావించి అన్య ప్రదేశాలలో గాలించి, గాలించి చివరికి చనిపోతుంది. కుక్క ఎండిపోయిన ఎముక కొరికి దాని రాపిడికి తన నోటి నుండి కారే రక్తాన్ని ఎముక రసమని భావించి తన రక్తపానమే చేస్తుంది.

మనిషి "బుద్ధివాది" కాబట్టి ఎక్కువ తెలివితేటలు చూపిస్తాడని భావిస్తాము. అయితే ఈ తెలివి తేటలతో చాలా కూడబెట్టాలనే ఆశతో చెత్తనుంచి నిరర్థకమైన వస్తువులను ఏరుకుని తన సంచినింపుకొని తిరిగి దానికి నిప్పంటించి, తాను ఏదో సాధించినట్టు అట్టహాసము చేసే పిచ్చివానివలె ప్రవర్తిస్తాడు. గొఱ్ఱెలు గుడ్డిగా ఒక దాని వెంట ఒకటి వెళ్తూ చివరకు అన్నీ గుంపుగా గోతిలో పడిపోతాయి. మిడతల దండు గుంపుగా ఎదుగుతాయి అవి ఎగరగలిగినప్పుడు దిశా రహితముగా ఎగిరి ఫలితముగా ఎడారిలో మలమల మాడటమో లేక జలాశయములో మునగటమో జరుగుతుంది. కానీ ఇదేవిధముగా మనిషి చేస్తే చిత్రము అనిపిస్తుంది. బాహ్య ప్రపంచంలో ఎన్నో వింతలు చూపే మనిషి తన వంతు రాగానే ఎంతో మూర్ఖముగా ప్రవర్తిస్తూ సంతోషముగా, ఆనందంగా ఆత్మహత్యకి దారితీసే పరిస్థితుల వైపు వెళ్తూ దానిని ఆపి, సవరించే ప్రయత్నం చేసే వారితో తొడకొట్టి దెబ్బలాటకి దిగుతాడు.

**పరమార్థమే పరమ స్వార్థం**

చాతుర్యాన్ని, బుద్ధిని రెండు భాగాలుగా విభజించవచ్చును. మొదటిది ఎన్నో ప్రాపంచిక క్రియాకలాపాలలో ఏదోవిధముగా సాఫల్యము పొంది చూపించవచ్చును. ఈ విధానములో నీతి – అవినీతి అనేది లేదు అనే అనవచ్చును. ఏదో ఒక రకముగా తమ పని కానిచ్చుకోవాలి అనేది వీరి అభిమతము. దీని కోసము నింగి–నేల ఏకము చేసి ఏదో విధముగా ఆ కార్యము జరిగేటట్లు చూడటమే. దీనినే బాహ్య పక్షము అంటారు.

మనిషి యొక్క అంతరంగ పక్షమని ఒకటుంది, ఇందులో మర్యాదలకి ప్రముఖ స్థానముంటుంది. ఏ నిర్ణయము తీసుకోవాలన్నా తెలివితేటలు, నిజాయితి, బాధ్యత, సాహసము అనే గీటురాయిపై నిలిచిన తరువాతే, ముందుకు అడుగు వేస్తాడు. ఈ విషయంలో తమతో పాటు ఇతరుల హితమును కూడా దృష్టిలో ఉంచుకొంటారు. ఈ సందర్భములో ఆత్మతో పాటు పరమాత్మ యొక్క అభిమతము కూడా వింటారు.

నేడు బహిరంగ పక్షానికే ప్రాముఖ్యత ఉంటున్నది. మనిషి తెల్లగా యువావస్థలో ఉంటూ అలంకరణతో ఆకర్షణీయముగా ఉంటే చాలు, ఆ వ్యక్తి లోపల ఎయిడ్స్, సిఫిలిస్, టి.బి, క్యాన్సర్ వంటి రోగాల విషాణువులు సంపర్కములోకి రాగానే అంటుకోవడానికి సిద్ధముగా ఉన్నా సరే పట్టించుకోరు. జిత్తుల మారి, పొగరుబోతు ప్రతిచోట తన ప్రతాపమేనని గొప్పలకు పోతూ ఎవరినైనా సరే భయపెట్టి, అణచివేయగలుగతాడు. బాగా సంపన్నులైన వ్యక్తుల సంపాదన కూడా న్యాయంగా సంపాదించి నది కాదు. సామాన్యంగా పులిని చూసి వాత పెట్టుకున్న నక్కలాగా, దొంగజపము చేసే కొంగలాగా రకరకాల ఆదర్శాలను వల్లించే వారే ఎక్కువ. ఇందుకు విరుద్ధముగా కొంతమంది ప్రామాణికత, ప్రఖరతని నిరూపించుకోవడానికి, పెద్ద–పెద్ద కష్టాలు పడటానికి, రెండురెట్ల మూల్యం చెల్లించు కోవడానికి తయారుగా ఉంటారు. వారి శరీరము కాదు, వారి చరిత్ర ప్రేరణకి ఉద్గమస్థానమై అసంఖ్యాకులను ముందుకి నడిపించ డానికి, ఉచ్చస్థాయికి చేరటానికి కారణమవుతారు. ఇలాంటి వారినే మూర్తీభవించిన మహామానవులని, మానవీయ ఉత్కృష్టతను, ఆదర్శవాదాన్ని రక్షించేవారని అనవచ్చును.

కానీ ఈ విలువ తెలియని వారిని, జిత్తులతో, మోసముతో, ఆడంబరముతో బ్రతకడము మినహా ఇతర విషయాలను ఒప్పు కోని వారిని ఏమనాలి? ఎక్కువ జనాభా ఇటువంటి వారి వైపే మొగ్గు చూపుతుంది, అయితే ఈ రకమైన లోకాచారానికి విలువ ఇవ్వలేము, వాటి అనుసరణ వలన మానవీయ గరిమ రక్షింపబడదు కూడా!

దుర్బలురు, పరాజితులు అయినా మానవీయ గరిమ కలవారిని అనుసరించి అభినందించాలి అంతేకానీ పెద్దవారి పలుకుబడిని చూసి ఆ చమత్కారానికి అచ్చెరువొందకూడదు.

ఈ ప్రసంగంలో పెద్దవారిని గురించి చర్చించడము లేదు, ఎందుకంటే వారు నీటి బుడగలు వలె పైకి ఉబికి కొంచెం సేపు ఇటు–అటు తిరిగి అదృశ్యమౌతారు. ఇక్కడ భూఖండానికి, సముద్రానికి దీపస్తంభాల వంటి వారి గురించి ప్రస్థావించ బడుతోంది. **శేషనాగుని పడగపై ఈ భూమి నిలిచి ఉన్నదా, లేదా అనే విషయముపై అభిప్రాయ భేదాలు ఉండవచ్చును, కాని మానవత్వ గరిమ, మహిమ మాత్రము ఆదర్శవాదుల భుజాలపై నిలిచి ఉన్నదనటము నిర్వివాదమైన అంశము. వీరి వల్లనే చిరస్థాయి శాంతి మరియు ప్రగతి ఉంటుందని ఆశించవచ్చును. ఆలోచనాపరులు, వివేకవంతులు అని వీరిని పేర్కొనవచ్చును.**

చతురులు అందుబాటులో ఉన్న కార్యకలాపాలలో తమ విశిష్టతను ప్రదర్శించి ఏదో ఒక రకముగా లాభాలు ఆర్జించి చూపుతారు, కానీ వివేకవంతులు ఏ కార్యాలవల్ల మర్యాద నిలుస్తుందో, సౌశీల్యము ఉప్పొంగుతుందో అలాంటి పని చేస్తారు, ఆచరణలో పెడతారు. ఇటువంటి గౌరవప్రదమైన అభిప్రాయాలు కలిగిన వారు మూడు ప్రధానమైన ప్రశ్నలను ఎదుర్కొంటారు–మొదటిది, **ఇతర ప్రాణులకు సర్వదా దుర్లభమైన, ఇంత కళాత్మక జీవితం, సృష్టికర్త ఏ ప్రయోజనాన్ని ఆశించి, తన విశిష్టమైన అనుదానానికి మనుష్యులను అధికారులుగా ఎన్నుకొన్నాడు ? రెండవది, నేటి పరిస్థితులలో అందుబాటులో ఉన్న సాధనములు, వైభవము యొక్క సర్వ శ్రేష్టమైన ఉపయోగం ఏమి అయి ఉండవచ్చు? మూడవది ఏమిటంటే జన్మవలె మృత్యువు కూడా నిశ్చయము. అది రేపైనా రావచ్చును, ఎల్లుండైనా కావచ్చును. ఆ తరువాత ఏ భగవంతుని దర్బారులో హాజరు కావలసి ఉన్నదో, అచ్చట ఏ విధముగా ఏ రూపములో మన జీవనచర్యను వివరించాలి?** పై మూడు ప్రశ్నలు సమాధానము కొరకు పరీక్ష కోసము తయ్యారయ్యే విద్యార్థివలె శ్రమించేవాడు, సరి అయిన

**మానసికంగా ఓడిపోయిన మనిషి సమస్తం కోల్పోతాడు**

సమాధానమిచ్చి అందులో గౌరవప్రదముగా ఉత్తీర్ణుడు అవుతాడు. అతడే మానవజీవితము యొక్క మహత్త్వాన్ని అర్థము చేసుకుని తనకి ఇచ్చిన ఉపలబ్ధులను సార్థకమయ్యేటట్లు, తదను రూపముగా వ్యవహారాన్ని మలచుకొన్నాడని అర్థము చేసుకోవాలి. ఇటువంటివారు సంఖ్యలో చాలా తక్కువగా ఉన్నా ప్రతిభ, ప్రఖరత, ప్రామాణికతలలో సంపన్నులని వీరిని మాత్రమే అనగలము.

ఎవరికైతే ఇలాంటి ప్రశ్నలతో సంబంధము లేదో, ఎవరైతే ఈ విధముగా ఎప్పుడు ఆలోచించరో, లేక ఆలోచించాల్సిన అవసరము లేదనుకుంటారో, లేక ఖాళీ ఉండదో వారు ఈ మానవజాతికి చెందిన వారైనా, యదార్థానికి వారు వేరే లోకానికి చెందిన ప్రాణులు. వ్యంగ్యంగా చెప్పాలంటే వారు పృథ్వి యొక్క యక్షులు, గంధర్వులు, కిన్నెరులని కూడా అనవచ్చును. మోటు భాషలో చాతుర్యము చాలా ఎక్కువ కలవాడు, వల విసిరేవాడు, కళావంతుడు అని అనవచ్చును. ఇటువంటి వారు చెల్లని నాణెము వలె అన్నింట్లో కాలు పెడ్తారు కానీ మానవత్వపు గీటురాయిపై పనికిరానివాడని అనిపించు కొంటారు. నిజమైన బంగారము వంటి వారు ఎవరంటే ఆదర్శాల నిప్పులో కరిగేవారు, గీటురాయికి దీటుగా నిలిచే వారు, తమ గరిమను అక్షుణ్ణంగా నిలిపి ఉంచుకునేవారు. వారే గాలివలె ప్రాణాన్ని పంచుతారు, మబ్బులవలె కురుస్తారు. సూర్యుని వలె స్వయముగా ప్రకాశవంతులుగా ఉండి తమ వెలుగు, వేడి ఇతరులకి ఇస్తారు. ఇటువంటి వారే పై మూడు ప్రశ్నలకి సమాధానము ఇవ్వగలరు. జీవితము ఎందుకు ఇవ్వబడిందో తెలుస్తుంది. ఈ జీవితముతో అధికారాలు, బాధ్యతలు అనేవి కలిసి ఉన్నాయి, సృష్టికర్త దర్బారులో ప్రవేశించి నప్పుడు తలపైకెత్తి తాము చేసిన కార్యముల సంతోషకరమైన వివరణ ఇవ్వగలరు.

తిండి-ప్రజనన కార్యక్రమాలకొరకు క్రిమి కీటకాలు కూడా బ్రతికేస్తాయి. పై రెండు ప్రయోజనాలను క్రిమి-కీటకాదులు నిశ్చింతగా పూర్తి చేసుకొంటాయి. ఇక మానవ జీవితమనే సుర దుర్లభమైన, స్రష్టయొక్క అనుపమ కళాకృతి విలువ ఇంతే అనుకుంటే దౌర్భాగ్యము చరమసీమలో ఉన్నదనుకోవాలి. మానవుని తరువాత స్థాయి దేవతల స్థాయి. ప్రగతిలో ఉపయుక్త పదవి ఇదే! ఇది కాకుండా 84 లక్షల యోనుల చక్రంలో భ్రమణం చేస్తూ నరక కూపంలో పడి ఉండటమే అనుకొంటే చేసేదేమి లేదు. బొక్కబోర్లా పడటమే ఇక మిగిలింది.

సాధారణముగా మనిషి సమయానుసారము మామూలుగా ఆలోచించి మెల్లిగా ముందుకు సాగవచ్చును, కానీ ఒక్కొక్క సారి వెంటనే నిర్ణయము తీసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. పక్కింటికి నిప్పంటుకొని వాటి కణాలు మన ఇంటి కప్పు మీద పడుతున్నప్పుడు నిద్రమత్తులో జోగుతూ కూర్చోలేము కదా! రైలు ప్లాట్‌ఫారమ్ మీద నిలబడి, గార్డ్ బండి బయల్దేరు తున్నదన్న సూచనగా విజిల్ వేస్తే ట్రెయిన్ ఎక్కి తమచోటు వెతుక్కోవడములో చురుకుతనము చూపించవలసి ఉంటుంది. పరీక్షలలో పూర్తి ఏకాగ్రతతో పరీక్ష పేపర్లకి సమాధానము రాయవలసి ఉంటుంది. ఆ సమయములో కుకల్పనలలో తేలుతూ ఉండటము చాలా నష్టాన్నే కలిగిస్తుంది. ప్రమాదం జరిగితే వెంటనే వైద్యం చేయాల్సి ఉంటుంది, లేకపోతే అధిక రక్తస్రావము వల్ల ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుంది.

ప్రస్తుత కాలములో మానవజాతి ఒక కాలు ఉత్థానము వైపు రెండవ కాలు పతనము అనే పడవ వైపు పెట్టి ఉంది. ఈ రెండింటిలో ఒకదాన్ని ఎన్నుకోవడములో ఆలస్యము చేయరాదు. ఎందుకంటే సందిగ్ధంలో ఉన్నవారిని విపరీత దిశలో వెళ్ళే నౌకలు పతన దిశ వైపుకి లాగిస్తాయి. గడిచి పోయిన కాలము తిరిగి రాదు కదా! విభీషణుడు, ఆంజనేయుడు, అర్జునుడు, బుద్ధుడు తమ నిర్ణయాలు వెంటనే తీసుకొన్నారు. వీరు తరువాత చూసుకుందాములే అనుకుంటే అంతటి సుయోగము తప్పిపోయేది కదా, సమయానికి అంది వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకొనే వారే కదా! పంటలు నాటడానికి కోసుకోవడానికి మధ్య కొంత వ్యవధి ఉంటుంది, ఎవరైతే దీనిని గమనించరో వారికి చేతిలో పంట పైకము సగమే ఉంటుంది. సోమరితనము చాలా ఎక్కువ నష్టానికి కారణము అవుతుంది. కానీ ఎంతో అరుదైన అవకాశములు అందినప్పుడు అన్యమనస్కముగా ఉండటానికి వీలు లేదు. పందెంలో గుఱ్ఱాన్ని బాగా పరుగెత్తించే వాడు కూడా అస్తవ్యస్తవేగంతో ఉంటే పరాజయమే చిక్కుతుంది. నారదుని సలహాని వినడము వల్ల ధృవుడు, ఉమ, సరస్వతి, సావిత్రి మొదలైన వారు అజరులు అమరులైయ్యారు. మూఢమతులు బహుమూల్య సంకేతాలను, సందేశాలను ఈ చెవితో విని ఆ చెవితో వదిలి వేస్తారు. జ్ఞానము కర్మతో కలిస్తేనే సార్థకమౌతుంది. ఈ ప్రయోజనము చరితార్థమవటానికి ఇదే సమయము. *(సశేషము)*

**మనోబలమే - నిజమైన బలం**

అంతర్యాత్ర-2

# అంతర్జగత్తు యొక్క జ్ఞాన విజ్ఞానం - పతంజలి మహర్షి యోగదర్శనము

### సమాధిపాదము - 1

**ప్రవేశించేందుకు ముందు తెలుసుకోవలసింది 'అథ' యొక్క అర్థము.**

యోగసాధకులందరు ప్రప్రథమంగా సాధన యొక్క ప్రవేశద్వారమును గురించి తెలుసుకోవాలి. ఎందుకంటే ఇది యోగసాధన అనే అంతర్యాత్రను ప్రారంభించే మహత్వపూర్ణ స్థలము. యోగసూత్రాలలో దీనిని గురించే మహర్షిపతంజలి కొన్ని రహస్యసంకేతాలను ఇచ్చారు. సమాధిపాదము, సాధనా పాదము, విభూతిపాదము మరియు కైవల్యపాదము. ఇప్పుడు మనం 195 సూత్రములతో కూడిన యోగదర్శనమునకు ఆధార శిల వంటిదైన ప్రథమసూత్రము గురించి చెప్పుకుందాము.

**అథ యోగానుశాసనమ్॥ 1/1**

అనగా ఇప్పుడు యోగము యొక్క అనుశాసనము.

సూత్రకారుడైన మహర్షి యొక్క ఒక్కొక్క శబ్దమును మనం సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఎందుకంటే పతంజలి మహర్షి ఏ ఒక్క శబ్దమును కూడా నిరర్థకముగా ప్రయోగించరు. ఈ సూత్రములో మొదటి శబ్దము 'అథ'. ఈ 'అథ' అనే శబ్దము యోగసూత్రములలో వలెనే బ్రహ్మసూత్రములలో కూడా వస్తుంది. "అథాతో బ్రహ్మ జిజ్ఞాసా" అని. ఇది బాదరాయణుడైన మహర్షి వేదవ్యాసులవారి ప్రథమ సూత్రము. ఈ శబ్దముపై ఆదిశంకరా చార్యులవారు, రామానుజాచార్యులవారు సుదీర్ఘ మైన వ్యాఖ్యానాలు చేశారు. తమ మధ్య అభిప్రాయభేదాలు ఉన్నప్పటికీ ఇరువురు ఆచార్యులు ఈ 'అథ' శబ్దానికి సంబంధించి ఒకే అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు. ఎవరైతే నిజంగా సాధనలో ప్రవేశించాలి అనుకుంటారో వారు సాధకుని జీవితాన్ని అర్థవంతం చేసే 'అథ' అనే శబ్దము యొక్క అర్థమును చక్కగా తెలుసుకొని ఉండాలి. 'అథ' శబ్దము యొక్క అర్థమును తెలుసు కోకపోతే మిగిలినదంతా వ్యర్థమే అవుతుంది.

'అథ' అనగా "ఇప్పుడు". ఇప్పుడే సాధకుని జీవితంలో అతని హృదయంలో నుండి యోగసాధన చేయాలనే నిజమైన కోరిక చరమదశకు చేరుకున్న పుణ్యక్షణాలు ప్రవేశించాయి. అతని అభీష్టము యొక్క జ్వాలలు వేగంగా తీవ్రతను సంతరించుకున్నాయి. పరిపక్వస్థితికి చేరుకున్న అతని పాత్రత పరీక్షకు తట్టుకొని నిలబడింది. అతనిలో శిష్యత్వము పూర్తిగా జాగృత మైంది. అతని పిలుపులో తీవ్రత స్థాయి ఎంతగా పెరిగిందంటే సద్గురువు అతనిని కలుసుకునేందుకు ఆతృతపడుతున్నారు.

పరమపూజ్యగురుదేవుల జీవితంలో ఈ 'అథ' యొక్క పుణ్య క్షణాలు 14 సంవత్సరముల వయస్సులోనే వచ్చేశాయి. ఆయన పాత్రత, పవిత్రతలు అన్ని రకాల పరీక్షలను ముందు జన్మలలోనే ఎదుర్కొని ప్రామాణికతను నిరూపించుకున్నాయి. శ్రీరామకృష్ణ పరమహంస, సమర్థగురు రామదాసు, కబీరు దాసుల రూపంలో ఆయన యోగసాధనలోని సత్యజీవితమును పూర్తిగా జీవించారు. ఆ అనుభూతుల రసాస్వాదనలో జీవితాన్ని ముంచెత్తి వేశారు. అయినప్పటికీ ఈసారి కూడా మరల ఆయన పాత్రతను నిరూపించుకోవలసి వచ్చింది. దీనిని ఆయన భాషలో చెప్పాలంటే "బాగా పిండిన దానిని మరల పిండడం". ఆయన జాగృత చేతనత్వము యొక్క పిలుపులోని తీవ్రత ఎంతస్థాయికి చేరుకున్నదంటే హిమాలయాలలోని గుహ్యక్షేత్రాలలో ఉన్న ఆయన సద్గురువు పరుగుపరుగున వచ్చారు.

ఆయన తన ఆత్మకథలో ఈ సత్యము గురించి చెప్తూ 'మనము గురువు కొరకు వెతుకవలసిన అవసరం లేదు, గురువే పరుగు పరుగున మా వద్దకు వచ్చారు.' అని వ్రాసుకున్నారు. ఇదే మహర్షి పతంజలి యోగసూత్రములలోని ప్రథమసూత్ర మందలి ప్రథమ శబ్దమును అర్థం చేసుకోవడంలో ఉన్న చమత్కారము, 'అథ'లోని రహస్యాన్ని తెలుసుకున్న అనుభూతి, ఈ ప్రయోగాన్ని నిరూపించిన సత్యము. గురుదేవులు ప్రతిచోట తన ప్రవచనాలలో చెప్పింది, తన సాహిత్యములో వ్రాసింది 'మేము మా గురువు జేబును కత్తిరించే ఉద్దేశ్యముతో రాలేదు, మేము మా శిష్యత్వాన్ని సమర్పించాలనే కోరుకున్నాము, కేవలం మా గురువుగారి వాడిని కావాలనే అనుకున్నాను. మాకు ఒకే కోరిక, ఒకే బంధము, ఒకే బంధుత్వము ఉన్నది – గురువు మరియు శిష్యుడు' అంతే.

ఆ క్షణాలు ఇంకా రాకపోతే కనుక మరల యోగశాస్త్ర అధ్యయనమును కొనసాగించక తప్పదు. అప్పుడైనా నువ్వు ఒక మహావిద్యాలయానికి, విశ్వవిద్యాలయానికి ప్రొఫెసర్వి

**తనను తాను బలహీనుడుగా భావించేవాడి ఆత్మబలం సన్నగిల్లుతుంది**

కాగలవు లేదా వినసొంపైన ప్రవచనాలు ఇవ్వగలవు, అవి విన్న వారంతా చప్పట్లతో తమ ఆనందాన్ని తెలుపగలరు కానీ నువ్వు యోగివి మాత్రం కాలేవు. యోగశాస్త్రముపై పి.హెచ్.డి.లు చేయవచ్చు, చేయించవచ్చు, కానీ నువ్వు మాత్రం యోగివి కాలేవు. 'అథ' అనే పుణ్యక్షణాలు ఇంకా నీ జీవితంలోకి ప్రవేశించలేదు. ఎందుకంటే ఇవన్నీ భౌతికపరమైన రుచులు. సాధకుని ప్రాణంలో మొలకెత్తిన అభీష్టము యొక్క కాంతికి ఇవి చాలా క్రోసుల దూరంలో ఉంటాయి. గుర్తుంచుకోండి యోగమంటే అనుశాసనమే మరేమీ కాదు. యోగమంటే శాస్త్రము కాదు, యోగమంటే అనుశాసనము. ఇది ఎలాంటి దంటే దీనిని కేవలం నువ్వే చేయాలి. ఇది ఎటువంటి జిజ్ఞాసా కాదు, దార్శనికమైన చింతనా కాదు, వీటన్నింటికంటే చాలా లోతైనది. ఇది జీవితము మరియు మరణములకు సంబంధించిన ఒక ప్రశ్న మాత్రమే.

యోగము అంటే సత్యము కాదు సిద్ధి అని అర్థము చేసుకున్నవారి జీవితంలోకి ఇంకా 'అథ' యొక్క పుణ్యక్షణాలు రాలేదు. లౌకికంగా ఏమీ సంపాదించలేకపోయాను కనుక అలౌకికంగా ఏమైనా పొందుదాము అనుకునేవారు, లౌకికమైన వైభవాన్నంతటినీ ప్రోగుచేశాను కనుక ఇక అలౌకికమైనదాన్ని కూడా స్వంతం చేసుకుందాము అనుకునేవారు, గుర్తుంచుకోండి చమత్కారాలపై కోరిక ఉన్నవారు, చమత్కారాలు చేయాలనే మహత్వకాంక్ష ఉన్నవారు అందరు గారడీవారు, ఇంద్ర జాలికులు కాగలరేమో కానీ వారి జీవితంలోకి మాత్రం 'అథ' అనే పుణ్య క్షణాలు రావు. ఆ క్షణాలు రావాలంటే వారికిక ఏదారి తెన్నూ తెలియక, జీవితం అస్తవ్యస్తంగా మారిపోయి, అన్ని దారులు మూసుకుపోయి, భవిష్యత్తు గురించిన అన్ని ఆశలు సమాప్తమైపోతే అప్పుడు యోగము యొక్క అనుశాసనము ప్రారంభమవుతుంది. ఇక ఇప్పుడు యోగము యొక్క అనుశాసనము. అంతే తప్ప ఎన్ని యోగరహస్యాలు వ్రాసినా, చదివినా అవి అర్థం కావు. ఈ 'అథ' యొక్క ఏకైక తాత్పర్యము – నిజమైన శిష్యత్వము, తీక్షణమైన పాత్రత.

సాధకుని జీవితములో ఆ 'అథ' అనేది వచ్చినట్లయితే అతనికి యోగము యొక్క అనుశాసనమును గురించి చెప్పే గురువు కూడా లభిస్తాడు. ఆధ్యాత్మిక జగత్తునందు ఎవరియందు శిష్యత్వము ఉదయించిందో వారికి సద్గురువు లభించక మానడు అనేది నూటికి నూరుపాళ్ళు ప్రమాణీకరించ బడిన ఒక వైజ్ఞానిక సత్యము, వాస్తవము. ఒకవేళ శిష్యత్వమనేది ఉదయించకుండానే గురువు లభించినా దానివల్ల ఎటువంటి ప్రయోజనము ఉండదు. బంజరు భూమిలో నాటిన విత్తనాలు వృధాగానే పోతాయి. కనుక తెలివైనవాడెవ్వడు విత్తనాలను అక్కడ నాటడు. సాధకునిలోని అంతర్భూమి సారవంతంగా ఉండి అంతర్చేతన గ్రహణశీలతను, ఫలవంతమయ్యే శక్తిని కలిగి ఉంటే అందులో యోగమనే బీజమును నాటేందుకు సద్గురువు తనంతట తానే వస్తాడు. ఆయన వచ్చేదే శిష్యునికి యోగమనే అనుశాసనమును నేర్పేందుకు కదా!

అనుశాసనము అనగా సాధించగలిగే సామర్థ్యము, తెలుసుకోగలిగే సామర్థ్యము, నేర్చుకోగలిగే సామర్థ్యము. పరమ పూజ్యగురుదేవులలోని ఈ మూడు సామర్థ్యాలను పరిశీలించి, పరీక్షించిన తరువాతనే హిమాలయవాసి అయిన ఆయన సద్గురువు ఆయనకు 24 లక్షల గాయత్రీమహామంత్ర పురశ్చరణలు 24 చేయమని ఆదేశించారు. గురుదేవుల జీవితములోని ఈ మొదటి సత్యాన్ని అర్థం చేసుకునేందుకై మనం ఈ మూడు సామర్థ్యాల రహస్యాన్ని గురించి తెలుసుకుందాము. **నీవు నీ శరీరాన్ని కదిలించకుండా, మౌనంగా కొద్దిగంటలసేపు కూర్చో గలిగితే అప్పుడు నీలో ఏదైనా చేయగలిగే సామర్థ్యము వస్తుంది.** ప్రస్తుతము ఉన్న స్థితిలో కొన్ని గంటలు కాదు కదా ఎవరూ కదలకుండా ఒక గంట కూడా కూర్చోలేరు. ప్రస్తుతము అస్తిత్వము అంతా జ్వరముతో కంపించినట్లుండే కదలికలతో నిండిపోయి ఉంది. సాధించగలిగే సామర్థ్యము అంటే ఎటువంటి అలజడి, కదలిక లేకుండా ఆగిపోయి ఉండడం. ఇది జరిగితేనే దేనినైనా తెలుసుకోగలిగే సామర్థ్యము పెరుగుతుంది.

15 సంవత్సరాల కిశోరావస్థలో ఆయన ప్రతిరోజు ఆరు గంటల పాటు ఒకే ఆసనంపై కదలకుండా కూర్చుని నియమి తంగా గాయత్రీజపం చేయడం అనేదే గురుదేవుల యొక్క 'సాధించే సామర్థ్యం' గురించి మనకు తెలియచేస్తుంది. మనస్సు యొక్క కదలిక ఆగిపోతేనే దేనినైనా తెలుసుకోగలిగే సామర్థ్యము కలుగుతుంది. అప్పుడే సాధకుడు కేంద్రీకృతుడు కాగలుగుతాడు, తెలుసుకోగలుగుతాడు. లేనిచో సామాన్యమైన మానసికస్థితిలోనే ఉంటాడు. అది ఒక గుంపులాగా ఉంటుంది. కనుకనే సామాన్యుడు ఎప్పుడు వాగ్దానాలు చెయ్యడు, సంకల్పాలు చెయ్యడు. ఎందుకంటే అవన్నీ సాధకుని గుణాలు. శిష్యత్వము యొక్క లక్షణాలు అని గురజియఫ్ చెప్పారు.

– అనువాదం: *శ్రీమతి వల్లీ శ్రీనివాస్*

**ఆత్మవిశ్వాసం ఉన్నవారినే విజయం వరిస్తుంది**

# ఆత్మనిరతుడైన యోగి యొక్క అద్భుతమైన ఉద్బోధన

'జ్ఞానము శాస్త్రములలో ఉండదు. శాస్త్రములు కేవలము ఆ జ్ఞానమును విడమర్చి చెపుతాయి అంతే! శాస్త్రజ్ఞానము ప్రతీకాత్మకమైనది. ఆ సంకేతాల రహస్యములను సాధకుడే స్వయముగా ఛేదించాలి. అందుచేత జ్ఞానం అనేది తన అంత రంగములోనే ఉంటుంది. ఆ అంతరంగములోకి ప్రవేశించి అన్వేషించనంతవరకు జ్ఞానము ఆవిష్కరించబడదు. శాస్త్రమును అభ్యసించి తద్వారా జ్ఞానసముపార్జన చెయ్యవచ్చును అని మీరు అనుకుంటున్నారా? అదొక భ్రమ మాత్రమే. ఈ భ్రమ నుండి ఎంత తొందరగా బయటపడితే అంతమంచిది.' సార గర్భితమైన ఈ మాటలను తన తల్లి గర్భము నుండి గర్భస్త శిశువు తన తండ్రియైన ఋషి కహోదకు చెపుతున్నాడు.

'కహోద' ఒక ఋషి! పలు విద్యలను ఎరిగిన బ్రహ్మవేత్త! తపో-విద్యలు మూర్తీభవించిన రూపమే కహోమహర్షి. ఆయన బ్రహ్మాండములోని ఎన్నెన్ని ఛిద్రాన్వేషణలు (రహస్య సొరంగము లను అన్వేషించినాడంటే) చేసినాడంటే అతి స్వల్ప సమయము లోనే వాటిగుండా సాగిపోవచ్చు. ఉదా॥ ఒక నక్షత్రము నుండి మరొక గ్రహమునకు చేరుకొనటానికి సుమారు ఒక లక్ష కాంతి సంవత్సరములు పడుతుంది అనుకుంటే... మహర్షులవారు కనుగొన్న మార్గం గుండా ప్రయాణించినచో కేవలము 5,000 కంటే తక్కువ కాంతి సంవత్సరములలోపే అక్కడకు చేరుకొన వచ్చు. టైమ్‌టన్నల్ అను పేరున ప్రస్తుతం అమలులో ఉన్న సాంకేతికపరిజ్ఞానము ఋషి కహోద సాగించిన అన్వేషణ ఆధారముగానే కొనసాగుతున్నది. అంటే ఋషి అందించిన వివరముల ప్రకారమే నేడు శాస్త్రజ్ఞులు లెక్కిస్తున్నారు అన్నది నిజము. ఏది ఏమైనప్పటికీ సూక్ష్మజగత్తులో దారిని ఈ రీతిలో కనుగొనటమన్నది చాలా సామాన్యమైన విషయము. అయితే కహోద మహర్షులవారు ఈ రంగములో మరింత అధిక జ్ఞానవంతులే కాక, విశేష ప్రతిభ కలవారు. ఇంతటి జ్ఞాన వంతులు, విశేష పరిజ్ఞానము, తపోనిష్ఠ కలిగిన మహర్షి కహోదకు గర్భస్తశిశువు యొక్క మాటలు అంతగా నచ్చలేదు.

కహోద మహర్షి యొక్క అహంకారము పర్వతశిఖరమును తాకుతున్నది. తనకు పుట్టబోయే బిడ్డ పలికిన పలుకులు ఆయన మనస్సును ముల్లులాగా బాధించాయి. ఆయన అహంకారము పడగవిప్పి బుసకొట్టే పాము వలె బుసకొడుతున్నది. క్రోధముతో ఊగిపోతున్నాడు మహర్షి. క్రోధము-అహంకారముల మధ్య చాలా గట్టి బంధమే ఉన్నది. పట్టలేని అహంకారపు అభివ్యక్తియే అనియంత్రిత క్రోధము! పరాకాష్ఠ నందుకొన్న క్రోధము యొక్క ఉన్మత్త స్థితిలో వివేకము లోపిస్తుంది. అంటే ఉచితానుచిత బుద్ధి కొరవడుతుంది. ఇలాంటి స్థితిలో విపరీత ఆచరణ గావిస్తారు. కహోద ఋషి విషయములో జరిగింది అదే. ఆయన పట్టలేని క్రోధముతో ఊగిపోతు గర్భస్తశిశువును శపించ టానికి పూనుకున్నాడు.

కహోద మహర్షి క్రోధము, ఆవేశముతో గర్భస్తశిశువును సంబోధిస్తూ 'ఓ అజన్మ బాలకుడా! నీ తండ్రికే జ్ఞానమును బోధించే దుస్సాహసమునకు పూనుకున్నావా? నువ్వింకా ఈ భూమి మీదకు రానేలేదు. ప్రాపంచిక మరియు పారలౌకిక జ్ఞానమును సముపార్జించుకున్న నీ తండ్రికే నువ్వు జ్ఞానమును అభ్యసింపజేస్తున్నావా? నువ్వు నీ మర్యాదా మరియు పరిధి కూడా దృష్టిలో పెట్టుకోలేదు. నీ ఈ దుస్సాహసమునకు నేను తప్పక దండన విధిస్తాను' అన్నారు.

కహోద మహర్షి యొక్క మాటలు నిప్పులు కక్కుతున్నాయి. ఆయన మొహం అరుణవర్ణం దాల్చింది. కళ్ళ నుండి అగ్ని జ్వాలలు ఎగసిపడుతున్నాయి. క్రోధముతో పెదవులు కంపిస్తున్నాయి. పళ్ళు పటపటా కొరుకుతున్నాడు. భర్త యొక్క ఈ ఉన్మత్తావస్థను చూసి ఋషిపత్ని ఎంతో భయపడిపోయింది. ఏదో ఒక భయం కరమైన సంఘటన జరగబోతున్నది అన్న ఊహతో ఆవిడకి లోలోపల వణుకుపుట్టింది. ఋషిపత్ని భయము మరియు సంకోచము నిండిన స్వరంతో 'ఓ స్వామి! మీరు ఇంతగా కోపమునకు లోనవ్వకండి! నేను నా బిడ్డ తరపున క్షమించమని వేడుకుంటున్నాను. మీరు ఈ బాలుడిని క్షమించండి!' అన్నది.

ఇలా అంటూ ఆవిడ తన భర్త పాదాల మీద పడి స్పృహ తప్పింది. అయినా ఋషి యొక్క క్రోధము తగ్గలేదు. ఆయన హృదయము తన భార్య యొక్క ఈ స్థితిని చూసి కూడా కరగలేదు. వీటన్నింటి నడుమ అజన్మశిశువు తన తల్లి గర్భములో అత్యంత శాంతముతో, స్థిరచిత్తంతో ఉన్నాడు. తన తండ్రి కోపమును చూసి ఆ శిశువు బెదరలేదు, కంపించలేదు. పైగా

ప్రతి సమస్యను ఒక ఛాలెంజ్‌గా తీసుకోవాలి

శాంతముగా, నిశ్చింతగా ఉన్నాడు. ఆ బాలుడు వర్తమాన పరిస్థితితో విచలితుడవ్వలేదు. భావికాలములో జరుగబోయే దాని గురించి ఏ అలజడికి లోనవ్వలేదు. నిజమైన జ్ఞానమున్న వారికి భయమెక్కడ ఉంటుంది? అజ్ఞానము వల్లనే భయము మరియు భ్రమ ఉత్పన్నమవుతాయి.

తన తల్లికి తిరిగి స్పృహ వచ్చాక గర్భస్త శిశువు మరల తండ్రితో ఇలా అన్నాడు. 'ఓ తండ్రిగారు! నేను మిమ్మల్ని నిందించటం లేదు, మిమ్మల్ని అగౌరవపరచటము లేదు. సార్వభౌమిక-సార్వకాలిక సత్యమునే నేను చెప్తున్నాను. నేను నిజమును మాత్రమే వచిస్తున్నాను. మీరు సత్యమును గుర్తించలేక పోయినచో అది కేవలము మీ అజ్ఞానము మరియు లోపమునే తేటతెల్లము చేస్తుంది.' మహర్షి కహోదులవారికి ఈ మాటలు మరింత దుస్సహనీయముగా అయ్యాయి. అగ్నిలో-ఆజ్యం పోసినట్లు అయ్యింది.

ఋషి కహోదులవారు అతి కుపితులై తమ కమండలము నుండి చేతిలోకి జలమును తీసుకుని శపించటానికి ఉద్యుక్తులై ఇలా అన్నారు. 'నేను కహోద మహర్షిని! నువ్వు అష్టవంకరలతో పుట్టుగాక! అని అజన్మబాలకుడవైన నిన్ను శపిస్తున్నాను. నువ్వు పుట్టిన తరువాత నీ శరీరములో ఎనిమిది భాగములు వంకరలు తిరిగిపోయుంటాయి. జనులంతా నిన్ను చూసి నవ్వుతారు, ఎగతాళి చేస్తారు.'

అజన్మశిశువు మరింత బిగ్గరగా నవ్వసాగాడు. 'ఓ తండ్రిగారు! మీరు మరల అజ్ఞాని వలె ప్రవర్తిస్తున్నారు. ఆత్మ ఎట్టి శాపవరదానముతోను ప్రభావితము కాదు అన్న విషయము మీకు బాగా తెలుసు. ఆత్మకు శాపమును ఇవ్వలేము. వరదానమును ఇవ్వలేము. ఆత్మరతుడైన సాధకుడుని ఈరకమైన మాటల చేత ఎట్టి పరిస్థితులలోను ప్రభావితము గావించ లేరు. శిశువు పరమ సంతోషముతో నిండి తల్లి గర్భములో ఉంటూనే సాధన చేస్తున్నాడు. నెలలు నిండి శిశువు జన్మించాక తండ్రియైన కహోదుడు ఇచ్చిన శాపం ఫలించినది. నవజాత శిశువు అష్టవంకరలతో జన్మించాడు. ఈ కారణము చేతనే ఆ బాలుడు 'అష్టావక్రుడు' అని పిలువబడ్డాడు.

అష్టావక్రుడు మహాజ్ఞాని! శుకదేవుని వలెనే ఈ బాలుడు కూడా జన్మతః జ్ఞానిగా పుట్టాడు. అష్టావక్రుడు సదా ఆత్మరతుడై ఉండేవాడు. ఆత్మతో రమిస్తుండేవాడు. అష్టవంకరలతో వచ్చిన గూని అతనికి ఒక సమస్యగా తోచలేదు. జ్ఞానికి శరీరము వస్త్రము వంటిది! వస్త్రము జీర్ణమైపోయాక దానిని తీసివేస్తాము. జ్ఞాని తన శరీరమును కూడా ఆవిధముగానే త్యజిస్తాడు. అష్టావక్రుడు కూడా ఇలానే భావించేవాడు.

ఒకమారు ఆతని శిష్యుడు 'ఓ ఆచార్యా! మీ తండ్రిగారు మీకు పుట్టుకతోనే అష్టవంకరులు ఉండుగాక! అని శపించారు. దీనిమీద ఏదైనా విశేష అభిప్రాయమున్నదా?' జ్ఞానియైన అష్టావక్రుడు 'కుమారా! తండ్రిగారు నాకు కేవలము శాపము మాత్రమే ఇవ్వలేదు; పైగా ఆయనిచ్చిన ఆ శాపములో మరెన్నో రహస్యములు దాగి ఉన్నాయి. శరీరములోని 8 భాగములు వంకరగా అగుగాక అన్న శాపము వెనుక యోగము యొక్క అష్టాంగముల నుండి వంచింపజేయుట అన్న ఉద్దేశ్యమున్నది. దీని అర్థము ఏమిటంటే ఇలాంటి అష్టవంకరుల శరీరమున్న ఏ సాధకుడైనా యోగసాధన చెయ్యాలని అనుకున్నా అష్టావక్రదేహముతో అతను ఎప్పటికీ సాధనచెయ్యటానికి అసమర్థుడే అవుతాడు. ఈ శాపము సర్వదా నన్ను యోగసాధన చెయ్యటం నుండి దూరం చేస్తుంది.'

జ్ఞానియైన అష్టావక్రుడు అన్న ఈ మాటలతో శిష్య బృందము 'ఇదెలా జరిగింది' అని అనుకుంటూ స్థాణువులై పోయారు. 'ఆచార్యా! ఇట్టి స్థితిలో మీరు సాధన సిద్ధించాలని ఎలా తపిస్తున్నారు?' అని అన్నారు శిష్యులు. ఆచార్య అష్టావక్రుడు 'కుమారా! క్రమక్రమముగా వికసించాలని కోరుకునే వారికే యోగసాధన అవసరము. సదాసర్వదా ఆత్మస్థుడై ఉండే సాధకునికి ఎట్టి యోగసాధనా చెయ్యవలసిన అవసరము లేదు. ఆతను నిరంతరము ఆత్మరతుడై ఉంటాడు. ఆనందముగా ఆ స్థితిలోనే మునకలేస్తుంటాడు. సుఖదుఃఖాల కతీతముగా ఆనందావస్థలో తేలియాడుతుంటాడు. ఆనందము అన్నది ఆత్మభావన యొక్క ఒకానొక స్థితి! శరీరము కేవలము దాని అభివ్యక్తికి ఒక మాధ్యమము మాత్రమే. దేహేంద్రియముల పట్ల ఆసక్తిగల జీవుడు ఈ ఆనందమయస్థితిని అనుభూతి చెందలేడు. అర్థము చేసుకొనలేడు' అని సెలవిచ్చాడు. మహాజ్ఞాని-సదా ఆత్మయందు మునకలేస్తుండే అష్టావక్రమహర్షి యొక్క శిష్యులకు కూడా దుర్లభమైన, విచిత్రమైన ఇట్టి యోగస్థితి అనుభూతిలోకి వస్తుండేది. వారంతా తమ యొక్క ఆచార్యుని సన్నిధిలో అత్యంత ప్రసన్నముగా ఉండేవారు.

*- అఖండజ్యోతి, జనవరి 2016*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**ఎంత ఎదిగినప్పటికి ఒదిగి ఉండడం శ్రేయస్కరం**

జీవనయాగము

# విద్యార్థి ఎలా జీవించాలి?

**"ఆరయ జీవనయాగము భీరుండును**
**తక్షణమ్ము వీరుండగు**
**సాధారణ జీవనమ్ము నసాధారణ**
**భావనమ్ము భారతావని సొమ్ముల్ ॥"**

*జీవితమును ఒక యాగముగా భావించిననాడు, పిరికి వాడు కూడా తక్షణమే ఒక వీరుడుగా మారుతాడు. సాదా జీవనము-ఉన్నతమైన ఆలోచన అన్నది భారతావని సొమ్ము.*

విద్యార్థులు దేనిమీద దృష్టిపెట్టాలి? ఇది ఈనాడు ప్రధానముగా చెప్పుకోవాల్సిన విషయము. చాలామంది ధనవంతులు, నాయకులు, పలు రంగములలో ప్రసిద్ధులై బాగా ధనము సంపాదించినవారంతా ఎక్కువ డబ్బును చెల్లించి తమ పిల్లలను పెద్ద పెద్ద పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. అక్కడ అవసరమునకు మించిన సుఖములు అందుబాటులో ఉంటున్నాయి. సంవత్సరమునకు లక్షలాది రూపాయలను రుసుముగా కడుతున్నారు. బాగానే ఉంది, కానీ విద్యార్థికి ఇంత సుఖము అవసరమా? మనిషి సుఖపడాలి, తప్పులేదు. కానీ సుఖపడటానికి ఒక వయస్సుంది. విద్యార్థి వయస్సులో ఎప్పుడు సుఖపడటానికి అలవాటు చెయ్యకూడదు. అలవాటు పడకూడదు.

**సుఖార్థీవా త్యజేత్ విద్యామ్-విద్యార్థీవా త్యజేత్ సుఖమ్-**
**సుఖార్జనకుతో విద్యా-నాస్తి విద్యార్థి న సుఖమ్ ॥**
అని శాస్త్రకారుడు చాలా స్పష్టముగా చెపుతున్నాడు.

**సుఖార్థీవా త్యజేత్ విద్యామ్...** నీకు సుఖమే కావాలనుకుంటే చదువుకోవటము మానెయ్యి!

**విద్యార్థీవా త్యజేత్ సుఖమ్...** విద్య కావాలంటే సుఖపడటమనే విషయమును మర్చిపో!

**సుఖార్జనకుతో విద్యా...** సుఖార్జనలోనే మునిగిపోతే నీకు చదువొచ్చే ప్రశ్నే లేదు.

**నాస్తి విద్యార్థి న సుఖమ్...** నువ్వు విద్యార్థిగా ఉండాలి అంటే సుఖము ఉండదు. అందుకు నువ్వు సిద్ధపడు.

ప్రపంచములో కొన్నింటిని మనము మార్చలేము. మనమే వాటికి అనుగుణముగా మారాలి. మన మనస్సును అందుకు సన్నద్ధము చేసుకోవాలి. పూర్వము విద్యావిధానము చాలా గొప్పగా ఉండేది. జగద్గురు శంకరాచార్యులవారు అటువంటి గొప్ప విద్యావిధానములోనే విద్యనభ్యసించిన మహనీయుడు! భిక్షాటన చేసుకుని చదువుకున్నారు. సరే ఆయన సన్యాసి, తరువాత చేసినది అదే కదా అని అనవచ్చు. మరి శ్రీరాముని మాటేమిటి? ఆయన తమ్ముల మాటేమిటి? రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు 12 సంవత్సరములపాటు వశిష్ఠమహర్షి ఆశ్రమములో ఉండి భిక్షాటన చేసుకుని చదువునభ్యసించారు. రామాయణమును పరిశీలిస్తే ఈ విషయము తెలుస్తుంది. వారు మహారాజు యొక్క కుమారులు! వాళ్ళు భిక్షాటన చెయ్యటమేమిటి! కానీ భిక్షాటన చేసేవారు. అది ప్రాచీన ఆశ్రమాలలో పాటించబడే ఒక నిబంధన. పైగా అలా భిక్షాటన చేసి తెచ్చిన దానిలోనే గురువుగారికి కొంత ఇచ్చేవారు. ఆ గురువుగారు అదే తినేవారు. లేదా భోజనమునకు ఒక ప్రత్యేకమైన వ్యవస్థ ఉండేది.

అయితే ఇప్పటిలాగా వసతిగృహములు కట్టి, అక్కడ వంట చేసి పిల్లలకు పెట్టవచ్చు కదా? అని ప్రశ్నించవచ్చు. ఇక వంటే ఉంటుంది తప్ప పాఠాలుండవు. మధ్యాహ్న భోజన పథకము పెట్టినచోట ఏమి జరుగుతున్నదో చూడండి. ఆ పథకము సరిగా అమలవుతున్నదా? లేదా? అని చూడవలసిన బాధ్యత ప్రధానోపాధ్యాయుడిది. ఇక ఇప్పుడు ఆయన పరిస్థితి ఎలా ఉందంటే.. ఉదయం లేచినది మొదలు కూర ఉందా? ఉప్పు ఉందా? పప్పు ఉందా?... ఇవి చూసుకోవలసి వస్తున్నది. దానితో ఆయన చదువు చెప్పటము మీద అంత దృష్టిపెట్టలేక పోతున్నాడు. ఏమి చేస్తాడు? ఆయనా మనిషేకదా! పథకమంటూ ఉంటే అక్కడ ఏ సాంబారో వండాక పొరపాటున మూత పెట్టడము మర్చిపోయినప్పుడు దానిలో ఏ బల్లో-ఎలుకోపడితే పరిస్థితి ఏమిటి? (ఇలాంటి సంఘటనలు జరిగినట్లు మనం టి.విలో చాలాసార్లు చూస్తూనే ఉంటాము) విద్యార్థులకు ఏమైనా జరిగితే ఆ ఉపాధ్యాయుడిని కారాగారము

**ఎంత నేర్చుకున్నప్పటికీ నేర్చుకోవలసినది ఎంతో ఉంటుంది**

నకు పంపిస్తారు. ఈ భయముతోనే ఆయన వంటశాలకే ఎక్కువ సమయమును కేటాయిస్తున్నాడు. విద్యార్థుల చదువు కుంటుపడుతున్నది. ఆయనకు వీలుకాకపోతే తన మాట వినే మరో ఉపాధ్యాయుడికి ఆ పనిని పురమాయిస్తాడు. ఈ పంతులు గారు పాఠము చెప్పడము మానేసి అక్కడ కూర్చుంటాడు. ఇంతకీ మనము ఈ చదువు చెపుతున్నది సాంబారు కోసమా? సంస్కారము కోసమా? పరిస్థితి ఎలా మారిపోయిందో చూడండి. పిల్లలకు మధ్యాహ్నభోజన పథకము ఏమిటి అసలు? పోనీ పేదపిల్లలు... అన్నము పెడితే వస్తారు అని అనుకుందాము. కానీ జరుగుతున్నదేమిటి? వాళ్ళు భోజనము చేస్తున్నారు, వెళ్ళిపోతున్నారు. బట్టలు కుట్టించి ఇస్తే... వస్తారు, బట్టలు తీసుకుంటారు... వెళ్ళిపోతారు. ఉచితముగా పుస్తకాలు ఇస్తే... వస్తారు, తీసుకుని వెళ్లిపోతున్నారు. చాలాచోట్ల ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఇలా చెపుతున్నందుకు అన్యథా భావించవద్దు. అంటే విద్యార్థికి/విద్యార్థినికి చదువుకోవాలని ఉంటే తప్ప, అది అవసరము అని వారు భావిస్తే తప్ప మనము ఎన్ని సౌకర్యములు కల్పించినా వాళ్ళు చదవరు. ఇది అందరూ... ముఖ్యంగా ప్రభుత్వము గమనించవలసిన విషయము. అంత చదువుకోవాలని లేనివారికి మనము ఎందుకు చదువుచెప్పటము? పోనియ్యండి, ఏమౌతుంది. ఐతే ఇవాళ నిజముగా పేద కుటుంబము నుండి వచ్చినవారు, చదువు అవసరమును గుర్తించినవారు తలతాకట్టుపెట్టుకుని చదువు కుంటున్నారు. నానాయాతనా పడుతున్నారు. వారికి సౌకర్యములు కల్పించటములో తప్పులేదు.

ఒక పల్లెలో ఒక మధ్యతరగతి కుటుంబము ఉన్నది అనుకుందాము. ప్రాథమికపాఠశాల ఆ ఊరిలోనే ఉన్నది. కానీ ఉన్నతపాఠశాలలో చదువుకోవాలంటే 4 కిలోమీటర్ల దూరము సైకిల్‌మీద వెళ్ళాలి. అంటే వెళ్ళిరావటానికి 8 కిలోమీటర్లన్నమాట. పైగా బురదతో కూడినదారులు. మొత్తము 8 కిలోమీటర్లు సైకిల్‌మీదనే ప్రయాణించాలి. ఆ స్థితిలో చదువు సరిగ్గా రాకపోతే ఎందుకు 8 కి.మీ సైకిల్ త్రొక్కుతూ వెళ్ళి–వస్తున్నాము, ఏమిటి ప్రయోజనము? అని ప్రశ్నించుకోవలసి వస్తుంది.

ఇవాళ ఎ.సి. తరగతి గదులు, ఎ.సి బస్సులు... అన్నీ ఎ.సీనే! మరి చదువు సంగతో? చదివేవారు చదువుతారు, లేనివారు లేదు. ఏమి జరుగుతున్నదో ఆ దేవుడికి తెలియాలి. ఎ.సి తరగతిలో కూర్చుంటే సాధారణముగా నిద్రవస్తుంది తప్ప చదువు రాదు అని పెద్దలు అంటుంటారు. పైగా చదువుకునే విద్యార్థికి వేడి ఎక్కువగా ఉంటుంది. పెద్దలు ఒక ప్రాచీనమైన కథ చెపుతుంటారు.

ఒక కుటుంబములో పెద్దవాడికి చదువు చెప్పించేవారట. చిన్నవాడికేమో పొలం పనులు పురమాయించారుట. ఇద్దరు భోజనానికి ఇంటికి వచ్చేవారు. ఇంటి ఇల్లాలు వ్యవసాయం చేస్తున్న పిల్లవాడికి పాలు, పెరుగు, నెయ్యి తక్కువ వేసేది, చదువుకుంటున్న విద్యార్థికి అవన్నీ ఎక్కువగా వేసి పెట్టేది. వ్యవసాయం చేస్తున్న పిల్లవాడికి ఇది బాధగా అనిపించి ఉండబట్టలేక ఒకరోజు తల్లిని 'ఏమిటి ఇలా చేస్తున్నావు? నేను మట్టి పిసుక్కునేవాడినని లోకువా? వాడు చదువు కుంటున్నాడని గొప్పా?' అని అడిగేశాడు. నాయనా! నేను తల్లినిరా. పక్షపాతబుద్ధి నాకెందుకుంటుంది? ఎందుకిలా చేస్తున్నానో నీకు చూపిస్తాను అని ఇద్దరి బిడ్డలను దగ్గర కూర్చో బెట్టుకుని గట్టిగా ఉన్న వెన్నపూస ముద్ద తీసి పిల్లలిద్దరి నెత్తిమీద పెట్టి, కొంతసేపు అలా కూర్చోమని చెప్పింది. ఆశ్చర్యముగా కాసేపటికి చదువుకునే విద్యార్థి తలమీద ఉన్న వెన్నపూస ఎక్కువ శాతం కరిగిపోయింది. వ్యవసాయము చేస్తున్నవాడి తలమీద పెట్టిన వెన్న పెద్దగా కరగలేదు. పిల్లలకు దీనిని చూపించింది. ఏమిటమ్మా ఇలా జరిగింది? అని బిడ్డలు ప్రశ్నించారు.

'నాయనా! చదువుకుంటున్నవాడి ఒంట్లో వేడి ఎక్కువగా ఉంటుంది. అన్నయ్య ఉదయం 9 గంటలనుండి సాయంత్రము 5 గంటల వరకు బడిలో కదలకుండా బల్లమీదే కూర్చుని నుంటాడు. అలా కూర్చోవటం చేత శరీరములోకి వేడి చేరుతుంది. నువ్వు పొలములో కష్టపడుతున్నమాట నిజమే! ఐతే నువ్వు కాసేపు చెట్టు క్రింద కూర్చుంటావు. కొంత తడవు పొలము పనిచేస్తావు. మరి కాసేపు గుడిసెలో పడుకుని విశ్రాంతి తీసుకుంటావు. ఇంకాసేపు ఆగాక ఇన్ని రేగుపళ్ళు కొట్టుకు తింటావు. సాయంత్రము అయ్యేసరికి చెఱువులో ఈత కొడతావు. నీకు ఇన్ని సౌకర్యములున్నాయి. కానీ అన్నయ్య బడిలో ఒక్కచోటునే కూర్చుని చదువుకోవాలి. ముఖ్యంగా జ్ఞాపకశక్తి పెరగాలి అంటే, అన్నయ్య పాలు–పెరుగు–వెన్న–

**పోటీతత్వం ఉండాలి కానీ అసూయ ఉండకూడదు**

నెయ్యి ఎక్కువగా తినాలి. తినకపోతే చదువుకున్నది గుర్తుండదు. అన్న శరీరములో వేడి అధికంగా ఉంటుంది. అందుచేత అవన్నీ ఎక్కువగా పెట్టాను. అంతే తప్ప నాకు భేదభావము లేదు' అని అన్నది.

చదువు అన్నది ఎటువంటి తత్త్వముతో ఉంటుందో గమనించండి. అందుకే చదువుకునే విద్యార్థులు భోజనములో నెయ్యివేసుకుని తినాలి. కానీ ఇవాళ లావు అవుతున్నామనీ; డైటింగ్ చేస్తున్నామనీ ఇవన్నీ తినడము మానేశారు. **'ఘృతేన వర్ధతే బుద్ధి'**---నెయ్యి తింటే బుద్ధితీక్షణత పెరుగుతుంది. పూర్వము మన దేశములో బ్రాహ్మణులు వేదములను పనసలు -పనసలుగా చదివేవారు. ఒకేరోజు 82 పనసలు అప్పజెప్పిన మహామహులు కూడా ఉండేవారు. అంత జ్ఞాపకశక్తి వాళ్ళకి ఉన్నదీ అంటే వారి విజయరహస్యము-'నెయ్యి!' హాయిగా నెయ్యి వేసుకుని తినేవారు, అది అరిగేవరకు చదివేవారు.

నెయ్యి తినండి, కానీ శ్రమ చెయ్యండి. ఆడుకోండి, పని చెయ్యండి, సైకిల్ త్రొక్కుకుంటూ బడికి వెళ్ళండి. ఇవాళ్ళ కళాశాలకు వెళుతున్న యువతను గమనించండి. ఏ తరగతిలోనైనా 100 మంది విద్యార్థులుంటే ఆవరణలో 90 దాకా మోటార్‌బళ్ళు, కార్లు ఉంటే; 10 మాత్రమే సైకిల్స్ కనిపిస్తాయి. అసలు కష్టపడుతున్నదేమున్నది అక్కడ? పోనీ కథలో తల్లి అన్నట్టుగా కొన్ని గంటలపాటు కదలకుండా కూర్చుని చదువుతారా అంటే అదీ లేదు. ఉన్నతపాఠశాల, ప్రాథమికపాఠశాలలోనైతే కాసేపు కూర్చుని చదువుకుంటారు. కళాశాలకు వచ్చిన విద్యార్థులు అక్కడ కూర్చోరు. అటూ-ఇటూ తిరుగుతుంటారు, తోటలవెంట, గట్లవెంట తిరుగు తుంటారు. మొత్తమ్మీద కాలమును దుర్వినియోగము చేసుకుంటారు.

ఇలా కాకుండా విద్యార్థులు 'నేను చదువుకుంటున్న కాలములో సుఖమన్నది మర్చిపోవల్సినదే' అని నిర్ధారించు కోవాలి. చదువుకోవాలనుకునేవాడు సుఖమును కోరుకో కూడదు. సుఖము కావాలనుకునేవాడు చదువు మానెయ్యడము మంచిది. ఇవాళ చదువుకుంటున్న విద్యార్థులను గమనించండి. 4, 5 తరగతులు చదువుకుంటున్న పిల్లలకు ఇంతంత పెద్ద పొట్టలుంటున్నాయి. అసలు చదువుకునేటప్పుడు అంత భారీకాయము ఎలా వస్తుంది? అంటే హాయిగా కార్లలో వెళ్ళడము, రావడము, కూర్చోవడము, శ్రమ చెయ్యక పోవడము బాగా అలవాటైపోయింది. అది తప్పు. హాయిగా కడుపారా తినాలి, కష్టపడి చదువుకోవాలి.

ఒక ప్రణాళిక వేసుకుని పనులను పూర్తిచేసుకొనుట! ఇది విద్యార్థులు గమనించవలసిన మరో విషయము. వీలైతే పనులను ముందుగానే పూర్తిచేసుకోవాలి. లేకపోతే ఆందోళన పెరుగుతుంది. చాలామంది విద్యార్థులు పరీక్షలు ముంచు కొస్తున్నప్పుడు చదువుతారు. ఏడాదంతా సమయమును వృథాగా గడపటము; మార్చిలో పరీక్షలనగా అసలు కొన్ని పుస్తకములు జనవరిలో కొంటారు. పైగా 'ఆల్ ఇన్ వన్' అనే పుస్తకము వస్తున్నది. దానిలో బాగా ముఖ్యమైనవి లేదా ఇంకోలా చెప్పాలంటే అడిగీ అడిగీ అరిగిపోయిన ప్రశ్నలు-జవాబులు ఉంటాయి. దానిని కొంటారు. పుస్తకమును కొన్నా కూడా దానిని వెంటనే చదవడము మొదలుపెట్టరు. శివరాత్రి జాగారము పూర్తయ్యాక చదువు కోసము జాగారము మొదలు పెడతారు. ఇక ముక్కునపట్టి వ్రాయటమేగా? చదువు అబ్బేదేముంది?

ఐతే దీనికి భిన్నముగా విద్యార్థి ఎలా ఉండాలంటే- **'శ్వః త్కార్యమ్ అద్యకుర్వీత మధ్యాహ్నేహ్యఃపరాహ్ణికమ్ నహిమృత్యు ప్రతీక్షేత కృతం వా పృథ వా కృతమ్॥"** సంస్కృతములో **'శ్వః '** అనగా **'రేపు'** అని అర్థము. **'హ్యః'** అంటే **'నిన్న'** అని అర్థము. **'అద్య'** అనగా **'ఇవాళ'** అని అర్థము.

**'శ్వఃత్కార్యమ్ అద్యకుర్వీత-** రేపు చెయ్యవల్సిన పనిని వీలైతే ఇవాళే చేసేసుకో! రేపు అప్పగించవల్సిన పాఠము ఇవాళ్ళే చదివెయ్యి! ఇది ఉద్యోగస్థులకు కూడా బాగా ఉపయోగ పడుతుంది. రేపు చెయ్యాల్సిన పనిని కాస్త ప్రణాళిక వేసుకుని సగం పని ఇవాళే పూర్తిచేసుకో! అలా చేస్తే రేపటికి సుఖముగా ఉంటుంది. ఆ... సమయముందిగా రేపు చేసుకోవచ్చులెద్దు అని అనుకున్నామా ఇక అంతే. రేపు ఆ పనికి కూర్చునే సమయమునకు ఏదైనా ఆటంకము వస్తే? ఎవరైనా బయటకు వెళ్దాము రమ్మంటే? పైగా ఇవాళ మనకు వచ్చిన పెద్ద ఆటంకము 'సెల్‌ఫోన్!' అది కొన్న దగ్గరనుండి ఎవరెప్పుడు ఫోన్ చేస్తారో తెలియదు. ఎక్కడకు రమ్మంటాడో, ఎంతసేపు మాట్లాడతాడో తెలియదు. కనుక రేపు చెయ్యవలసిన పనిని ఇవాళే పూర్తిచేసుకో!

**విద్య, వినయం, వివేకం సమపాళ్ళలో ఉంచుకోగలగాలి**

**మధ్యాహ్నేజాపరాహ్ణికమ్...** అపరాహ్నము అనగా 3.00 గంటల తరువాతి కాలము. సాయంత్రము చెయ్యాలనుకున్న పనిని మధ్యాహ్నమే చేసెయ్యి! సాయంత్రము కలిసొస్తుంది. అంతగా అయితే అప్పుడు విశ్రాంతి తీసుకోవచ్చు లేదా ఇంకో పని చేసుకోవచ్చు. మనస్సుకు ఆందోళన ఉండదు. ఇవాళ ఆందోళన అన్నది పెద్ద సమస్య! ముఖ్యముగా విద్యార్థులకు ఒత్తిడి బాగా పెరిగింది. ఎందుకని? వాళ్ళు చదివేది చిన్న తరగతి అయినా పుస్తకాలు ఒక మూటలాగా ఉంటున్నాయి. పదవతరగతి వరకూ ఈ మూట మోయాల్సిందే. దానితో నడుము వంగిపోతుంది. మనిషిని నిటారుగా నిలబెట్టలేని విద్య జీవితములో ఏమి నిలబెడుతుంది? పుస్తకముల బరువు ముఖ్యము కాదు, మస్తకములో ఏమైనా జ్ఞానము పెరిగిందా? అనేది ముఖ్యము. ఇవాళ చదువులో ఎంత ఒత్తిడి ఉందో గమనించండి. ఒకటో తరగతి పిల్లవాడికి హాయిగా కాసేపు గడపటానికి, ఆటలాడుకోవటానికి సమయమే చిక్కటం లేదు. తల్లిదండ్రుల పరిస్థితి అంతే. పిల్లవాడికి నెలకొక్కరోజు ఖాళీ దొరికితే గొప్ప. అంత బరువు, అంత ఒత్తిడి ఉన్నప్పుడు ఏమి చెయ్యాలి? రేపటి పనిని ఇవాళే చెయ్యాలి. **మధ్యాహ్నేజాపరాహ్ణికమ్...** సాయంత్రము చెయ్యాల్సిన పనిని మధ్యాహ్నమే చేసుకోవాలి. ఇది జీవితములో పిల్లలతోపాటు పెద్దలకు కూడా ఉపయోగపడే విషయము.

**నహిమృత్యు ప్రతీక్షేత కృతం వా పృథ వా కృతమ్...** మనం పని పూర్తిచేసినా, చెయ్యకపోయినా మృత్యువు క్షణము కూడా ఆగదు. మనము సాధారణముగా పనిని ముందుకు నెడుతూంటాము. ఉదా॥ దేవీభాగవతము చదవటము తెలిసి చాలా మంచిదని ముందు పుస్తకము కొనితెచ్చి 'దీనిని వేసవిలో హాయిగా చల్లబాటున తీరిగ్గా కూర్చుని చదువుకుంటాను' అని అనుకుంటారు. వేసవి వచ్చేవరకు ఆ మనిషి ఈ లోకములో ఉంటాడా? ఉండడా? అనుమానమే! చదవకుండానే వెళ్ళిపోతే? డబ్బు దండుగ. జ్ఞానము రాలేదు. అందుకే ఎంత పెద్ద పుస్తకమైనా వెంటనే చదవటము మొదలుపెట్టాలి. ఆ పుస్తకమును చదవటానికి ప్రతిరోజు ఒక్క పావుగంట సమయమును వెచ్చించండి.

పావుగంట కూడా ఒక రోజులో చాలా ముఖ్యమైనదేకదా! పావుగంట మీకు ఆరోజులో మిగిలిన $23^3/_4$ గంటల కాలములో విజయమును సాధించటానికి సహాయపడుతుంది. కనుక పావుగంట ఎంతో విలువైనది. ఇటువంటి పావుగంటలు జీవితములో ఎన్నున్నాయి? రోజులో 24×4=96 పావుగంటలున్నాయి. ఒక్క పావుగంటే ఇంత విలువైనదైతే మరి మనం ఉపయోగించు కుంటే 96 పావుగంటలు ఎంత విలువైనవిగా నిలుస్తాయోకదా! జీవితము మొత్తమునకు ఇది అన్వయించబడితే! అందుచేత ఎప్పుడు జీవితములో సమయమును వృథా చెయ్యకూడదు. వీలైనంత ముందుగా ఉండి కాలముతోపాటు పరిగెడితే ఖచ్చితముగా విజయమును లభిస్తుంది.

*(గరికపాటి నరసింహారావుగారు చెప్పిన 'జీవనయాగము' నుండి సంకలనము చేయబడినది)*

– శ్రీమతి లక్ష్మీరాజగోపాలు

## సంకల్పబలము

*స్వాతంత్ర్య సంగ్రామంలో నవ్వుతూ ఉరికంబాన్ని కౌగిలించుకొన్న రామప్రసాద్‌బిస్మిల్‌చౌధీ విద్యార్థి దశలో సిగరెట్టుకు దాసుడయ్యాడు. రోజుకి 40-50 సిగరెట్లు త్రాగేవాడు. ఫలితంగా ఆరోగ్యం పాడైంది. సిగరెట్లకు డబ్బు కావాలి కదా! చిన్న చిన్న దొంగతనాలు కూడా మొదలు పెట్టాడు. శరీరంతోపాటు మనస్సు కూడ బలహీనపడింది. ఒకరోజు దొంగతనం చేస్తూ పట్టుబడ్డాడు. తల్లి నిర్దాక్షిణ్యంగా చితకబాదింది. పిల్లవాడు ఆలోచనలో పడ్డాడు. తనకంటే శారీరికంగా, మానసికంగా ఆరోగ్యంగానున్న ఒక మిత్రుని వద్దకు వెళ్ళాడు. అతని ఆరోగ్యానికి కారణం అడిగి తెలుసుకున్నాడు. తనకు ఏ దురలవాట్లు లేవనీ, రోజూ వ్యాయామం చేస్తాననీ చెప్పాడు ఆ మిత్రుడు. తను కూడా ఆవిధంగా మారాలని దృఢంగా నిశ్చయించుకున్నాడు రామప్రసాద్‌బిస్మిల్. ఆరోజు నుండి సిగరెట్లు మానేసి వ్యాయామం మొదలుపెట్టాడు. మెల్లమెల్లగా మనస్సు, శరీరం కూడా కోలుకోవటం మొదలుపెట్టాయి. కండలు దేరిన వస్తాదులా తయారయ్యాడు. ధైర్యంగా స్వాతంత్ర్య సమరంలో దూకాడు. అనేక ఉద్యమాలలో యధాశక్తి తనవంతు పాత్రను నిర్వహించాడు. చిట్ట చివరకు నవ్వుతూ నవ్వుతూ దేశమాత కోసం ప్రాణాలు అర్పించాడు. ఒక్క దృఢసంకల్పమే ఒకానొక దేశభక్తుణ్ణి తీర్చిదిద్దింది.*

– అనువాదం: పొన్నూరు హైమవతీశాస్త్రి

**ఆత్మవిశ్వాసం పెంచుకోగలగాలి**

బోధ కథ

# అహంకారాన్ని వదిలేస్తే బ్రహ్మర్షి అయ్యాడు

"ఆహా! నేటి ఈ పూర్ణచంద్రుడు ఎంతో కాంతివంతంగా వెలిగిపోతూ ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నాడు కదా! అన్నది అరుంధతి. "అవును దేవీ! నేడు చంద్రుడు ఆ విధంగానే వెలిగి పోతున్నాడు." "ఏవిధంగా స్వామీ?" పులకింతతో, మిక్కిలి సంతోషంతో ఋషిపత్ని అయిన అరుంధతీదేవి ఆశ్చర్యంతో వశిష్టమహర్షితో అంది. "అరుంధతి! ఇప్పుడే నీవు నేటి చల్లటి చంద్రుని వెన్నెలను ప్రశంస చేశావు కదా! అయితే నా మదిలో అనుకోకుండానే ఒక ఉపమానం వచ్చింది!" వశిష్టులవారు తన ధర్మపత్నికి జవాబు ఇచ్చాడు!

"ఎటువంటి ఉపమానం? చెప్పండి. ఈనాటి వెలుగులీను తున్న చంద్రునితో తమరు ఎవరిని పోల్చుతున్నారు? ఎందుకు మౌనం దాల్చారు?

"చెప్పనా–చెడుగా అనుకోవు కదా?"

"ఉపమానమనేది సాహిత్యంలో ఒక ఆలంకారిక వర్ణన మాత్రమే. అందులో చెడుగా అనుకోవల్సిందేముంది?"

"ప్రియా! నేటి ఈ చంద్రుడు విశ్వామిత్రుని తపస్సు వలె ప్రకాశిస్తున్నాడు."

ఈ ఉపమానం వినగానే అరుంధతీదేవి ఖిన్నురాలైంది! "అరే! నీ ముఖమెందుకు ఈ మాట వినగానే వాడిపోయింది?"

వశిష్ఠులవారి నోటి నుండి విశ్వామిత్రుని ప్రశంస విన్న అరుంధతి నిజంగానే దుఃఖితురాలైంది! అనుకోకుండానే ఆమెకు తమ గడచిన జీవితంలోని ఒక బాధాకరమైన సంఘటన గుర్తుకొచ్చింది! అది ఎంతటి భయంకర సంఘటన అంటే; అటువంటి విషయాన్ని ఏ తల్లి ఎప్పుడు మరువనే మరవదు! వశిష్ఠులవారు తిరిగి ఇలా అన్నారు – "అరే అరుంధతి! నీవు అంతా విని మౌనంగా ఎందుకున్నావు?"

"ఆ జరిగిపోయిన భయంకర పుటను తమరు తిరిగి తెరుస్తున్నారా మహర్షీ! మన వందమంది సంతానాన్ని నిర్దాక్షిణ్యంగా వధించిన హంతకుడిని తమరు ఈవిధంగా ప్రశంసిస్తూ ఉంటే వింటూ నేనెలా సహించగలను? నేనూ ఒక తల్లినే! ఒక వ్యధిత హృదయమున్న మాతగా కూలబడి ఉన్నాను? తమరు ఋషివర్యులు! ప్రాపంచిక మోహబంధాలను దాటినవారు; మమతానుబంధాలతో బంధించబడిలేరు! కానీ నేను వాత్సల్యమనే సున్నితమైన బంధముతో పెనవేసుకున్న తల్లిని. ఈ హంతకుడు నా పుత్రులను వధించిన క్రూరుడు! జీవితంలో మనకు మిగిల్చినదేమిటి?" ఇది విన్న వశిష్ఠులవారు ఇలా అంటున్నారు.

"ఓహో! అదా విషయం! అవును సత్యమే! నీ హృదయం మీద దారుణమైన దెబ్బపడింది. విశ్వామిత్రుడు కోపోద్రేకం చెంది అమానవీయ దుష్కర్మ చేశాడు. కానీ ఒక విషయం ఎవరిలో అయినా సద్గుణాల మూల్యాంకనం చేసే సమయంలో మనం వ్యక్తిగత శత్రుత్వాలను చూడకూడదు! నేను ఒప్పుకుంటాను; క్షణిక భావావేశంలో విశ్వామిత్రుడు మన కుటుంబాన్ని సర్వ నాశనం చేశాడు... నిజమే కానీ అతడిలో కొన్ని మంచి గుణాలు కూడా ఉన్నాయి. ఆ విశిష్టతల గొప్పదనం కూడా ఉంది. ఆ విశిష్టతలను మనం గౌరవించాలి కూడా... **శత్రువులో కూడా ఏవైనా దివ్యగుణాలుంటే వాటిని మెచ్చుకోవలసి ఉంటుంది.**

దీనికి అరుంధతి జవాబు తటాలున ఇవ్వలేకపోయింది. ఐతే మెల్లని వ్యంగంతో కూడిన గొంతుతో ఇలా అంది– "మహర్షీ! ఒకవేళ అదే నిజమైతే తమరు ఆయనకు బ్రహ్మర్షి బిరుదు నెందుకివ్వలేదు? అదే అతడు మీనుండి అనిపించుకోవాలని కోరుకుంటున్నాడు! అందుకోసమే గదా ఈ పోట్లాటంతా!" వశిష్ఠులవారు ఈ మాటతో కలతచెందారు! మీరు వారి మీద చేసిన ఈ ఆరోపణ కూడా సత్యమే! 'ఆయనను బ్రహ్మర్షి' అని అనండి. అంతటితో ఆయనలోని కోపమంతా పోతుంది. అంతే!"

వశిష్ఠమహర్షి మౌనం దాల్చాడు! ఏదో లోతైన విషయాన్ని ఆలోచిస్తూ ఉండిపోయాడు! "మహర్షీ! ఏమి ఆలోచిస్తున్నారు? ఎందుకని మాట్లాడరు? దీనిని నా యొక్క అయిష్టతగా అనుకొని మౌనం దాల్చారా?" ఎలాగైనా ఇక వశిష్ఠులవారు నోరు విప్పవలసి వచ్చింది – "భద్రే! సద్గుణాలను ముక్తకంఠంతో ప్రశంసించుట మానవుని కర్తవ్యం. బాధలు అంటురోగాల వంటివి! అవి వాయుమండలంలో తరంగాల మాదిరి తిరుగుతూ ఉంటాయి! వాటి వేగము వాయువులాగా తీవ్రమైనది! **మనం సద్గుణాలను ప్రశంసించకపోతే దుర్గుణాలు వాతావరణంలో విస్తరించిపోతాయి!** సమాజం కలుషితమవుతుంది! అందుచేత ఆరోగ్యవంతమైన వాతావరణ సృష్టికొరకు సద్గుణాల ప్రశంస ఎంతైనా అవసరం ఉన్నది.

కానీ విశ్వామిత్రుడు అనేక దుర్భావనలతో నిండి ఉన్నాడు కదా! "విశ్వామిత్రునిలో వాస్తవంగా ఒకే దోషముంది! ఇతరమైన

**కష్టపడటాన్ని ఇష్టపడితే అభీష్టం సిద్ధిస్తుంది**

దుర్బలతలతో అతని చుట్టుప్రక్కల పల్లవించే శాఖ-ప్రశాఖలు కూడా ఉన్నాయి."

"అలాగా! అయితే ఆ దోషాలేమిటో నేను తెలుసుకోవచ్చా?"

"అహంకారం! ఆయన తన తపస్సుతో సమానంగా ఇతరులు చేసిన తపస్సుని అంగీకరించడు! ఇంకా ఎవరైతే ఆయన తపస్సు శ్రేష్ఠమైనదని అంగీకరించరో అటువంటివారిని ద్వేషిస్తాడు!"

"అయితే కేవలం అహంకారం మాత్రమేనా ఆయనలోని దోషం...!"

"అవును అరుంధతి! అహంకారంతోనే ఈర్ష్య, ద్వేషం, క్రోధం, వ్యాకులత, సంఘర్షణ, భయం వాటితో ప్రేరణ చెందిన మానవుడు దుష్కర్మలను చేయబూనుతాడు!"

"సత్యమే! అయితే ఇది తమ మనోభావమన్నమాట! ఒక హంతకుడిని కూడా తమరు అహంకారం లేనివాడైన మీదట మహాపురుషుల కోటిలో చేర్చగలరన్నమాట!" అరుంధతి వక్ర భాషలో అంది!

"మానవుడు దుష్టుల నుండి దూరంగా ఉండి; సాధు పురుషులతో కలసి ఉండాలి! సద్గుణాలను అతడు మెచ్చుకో గలగాలి! నేను విశ్వామిత్రుని దుర్గుణం (అహంకారం) చూడ కుండా అతనిలోని సద్గుణాలను, తపశ్చర్యను, కష్టాన్ని సహించే ఓర్పుని మాత్రమే చూస్తున్నాను! అందుచేతనే నేడు నా నోటినుండి చంద్రుని వెన్నెల వలె విశ్వామిత్రుని తపస్సు కూడా వెలిగి పోతుందని అనగలిగాను"

"ఇప్పుడు తమ దృష్టికోణం నాకు అర్థమైంది! తమరు తమ పుత్రులను వధించిన హంతకునిలో కూడా సద్గుణాలనే చూడగలుగుతున్నారు."

యాదృచ్ఛికంగా విషయపరంగా విశ్వామిత్రుడు వశిష్ఠుల వారి కుటీరం వెనుక దాగి ఉండి, ఆ దంపతులు అనుకొంటున్న సంభాషణను విన్నాడు! ఈ మాటలు విన్న ఆయనకు ఆశ్చర్యమేసింది! వశిష్ఠుడు ఎన్నడు తనను మెచ్చుకోలేదు. ఆయనను మెప్పించుటకొరకే ఈయన గొప్ప తపస్సు చేశాడు! అనేకమైన కష్టాలను సహించాడు! విశ్వమంతా తన తపస్సు ఎంతో శ్రేష్ఠమని స్వీకరించుట జరిగింది. కానీ వశిష్ఠుడు మాత్రం మౌనం వహించాడు. కోపంతో ఉత్తేజనం చెందిన ఈయన వశిష్ఠులవారి పుత్రులను వధించుట జరిగింది. అయినా కూడా సముద్రం వంటి గంభీరంతో వశిష్ఠుని నోటి నుండి ప్రశంస గాని లేక బాధతో నిట్టూర్పు గాని వెలుపడలేదు. అందుచేత ఈయన వశిష్ఠుని ఎడల శత్రుత్వం వహించినందున; ఈరోజు ఆయనను చంపుట కొరకై రావటం జరిగింది! బ్రహ్మర్షి అవ్వాలనే అణచుకోలేని కోరిక, పేరాశ ఆయనను పిచ్చివానిగా, కలత చెందినవానిగా మార్చింది.

ఈ ఋషి దంపతుల సంవాదం విన్న తరువాత ఆయన మనోకమలం ఒక్కసారి వికసించింది! ఓహో! చివరకు వశిష్ఠుల వారు ఈయన తపస్సును శ్రేష్ఠమైనదిగా ఒప్పుకోవటం జరిగింది! ఆయనకు తాను బ్రహ్మర్షి అయినట్టు అనిపించిది! ఆయన అహంకారం తృప్తిచెందింది! ఉద్విగ్నత తొలగిపోయింది! శాంతి, సంతులత యొక్క శీతలత ఆయన హృదయంలో అంతులేని ఆనందాన్ని నింపింది!

ఇప్పుడు ఆయనలోని వివేకం పూర్తిగా మేలుకొంది. న్యాయభావన ఆయనలో పొంగులువారింది! వివేకదృష్టిని సారించి చూడగా... విశ్వామిత్రునకు తానొనర్చిన భయంకర తప్పు తెలిసివచ్చింది. ఆయన ఇప్పుడు గ్రహించగలిగాడు వశిష్ఠులవారు ద్వేషంతో కాక, న్యాయంతో ప్రేరణ చెంది మాత్రమే తనను బ్రహ్మర్షిగా గుర్తించడం జరగలేదని.

ఇప్పుడు విశ్వామిత్రుని దృష్టిలో వశిష్ఠుడు ఒక న్యాయదృష్టి కలిగినవానిగా, కర్తవ్యపాలన చేయువానిగా, సహృదయునిగా కన్పించాడు. ఇప్పుడాయన కుటీరం చాటునుండి బయటకు వచ్చి పశ్చాత్తాపంతో వశిష్ఠ ఋషి దంపతుల ఎదుటకు వచ్చాడు. ఆయన వశిష్ఠులవారి పాదాల మీద పడి; తన అపరాధాన్ని అవివేకాన్ని క్షమించమని కోరాడు. ఎవరినైతే అరుంధతీదేవి హంతకుడని అన్నదో, అతడే నేడు తన భర్త చరణాల మీద పడి క్షమను యాచించసాగాడు. పశ్చాత్తాపంతో నిండిన వేడి కన్నీటిధార వశిష్ఠులవారి పాదాలను అభిషేకించ సాగింది. వశిష్ఠమహర్షికి ఇప్పుడు పూర్తిగా విశ్వాసం కలిగింది... విశ్వామిత్రుని అహంకారం దూరమైందని.

అహంకారం కరిగిపోయిన మీదట ఇక పశుప్రవృత్తి; నీచతత్వం ఇంకా ఎక్కడ ఉంటాయి? మనస్సు సరైన దిశలో మరలి; ఆయనలో ఇక మారవలసిందేమి మిగిలిలేకుండా పోయింది.

వశిష్ఠులవారు తన చరణాల మీద ఒదిగిన విశ్వామిత్రుణ్ణి ఎంతో ప్రేమభావనతో, ఆత్మీయతతో పైకి లేపి ఇలా అన్నాడు - "బ్రహ్మర్షి! లేవండి" విశ్వామిత్రుడు చకితుడయ్యాడు. ఇప్పుడు తాను లోపలనుండి మారినట్లు అయ్యింది! ఇక బయట ఉన్న మార్పు రావటానికి కష్టమేముంటుంది? హృదయం పరివర్తనం చెందినందున దర్పాలు, ద్వేషాలు సమస్తం దూరమయ్యాయి ఇప్పుడాయన సర్వత్రా 'బ్రహ్మర్షి' అని పిలవబడ్డాడు.


*- అనువాదం: జి. చెన్నకేశవరావు*
*అఖండజ్యోతి, మార్చి 1999*

**విజయం కొరకు దొడ్డిదోవలు వెతకకండి**

పూజ్య గురుదేవుల అమృతవాణి

# ఆధ్యాత్మికత అంటే రొక్కబేరమే-5

*ఆధ్యాత్మికతను రొక్కబేరముగా నిర్వచిస్తూ 'జీవితములో ఆంతరిక సంతృప్తి, ఆధ్యాత్మిక ఉన్నతి వాటంతటవే లభించటానికి నిర్దేశించబడిన ఆయా సిద్ధాంతములను, సంప్రదాయములను పాటించడమే ఆధ్యాత్మికత యొక్క అసలైన అర్థము' అని పరమపూజ్యగురుదేవులు ప్రవచించినట్లు గత సంచికలో మీరు చదివి ఉన్నారు. ఆధ్యాత్మికవిద్యను చక్కగా అర్థం చేసుకున్నవారు 'తమ సంపదనంతా అనుభవించడానికి కాదు-ఉపయోగపడటానికే' అని తెలుసుకుంటారు. దృష్టికోణమును మార్చుకొనడము ద్వారా ఇది సాధ్యమౌతుంది. ఈ విషయమై పరమపూజ్యగురుదేవులు తమను తాము ఒక ఉదాహరణగా చెప్పుకుంటూ దృష్టికోణమును మార్చుకొనడము ద్వారా తమ యొక్క ఆత్మీయతా పరిధి విస్తృతమైనదని, సృష్టిలోని ప్రతి ఒక్క ప్రాణి తమకు సంబంధించినట్లు అనుభూతి కలిగిందని తెలియజేస్తున్నారు. ఆప్తకాములుగా మారినప్పుడు మాత్రమే ఈ భావం ఉదయిస్తుంది. క్రమముగా వారిని అజాతశత్రువు దిశగా అడుగులు వేయిస్తుంది కూడా! రండి! వారి అమృతవాణిని మరింతగా హృదయంగమము చేసుకుందాము.*



## మన శత్రువులు హృదయం లోపలే ఉన్నారు

మన శత్రువులు బయటెక్కడో లేరు. మనహృదయం లోపలే ఉండి దౌర్జన్యం చేస్తున్నారు. బయట ఉండే శత్రువులను మనం 'వైరి' రూపంలో స్పష్టముగా చూడగలం. కానీ అంతరంగ శత్రువులైన వైరి-వైరిభావము మన లోపలే ఉంటాయి.

మేము 'వైరభావమును' హృదయం లోపలే అంతం చేసివేశాం. ఇక శత్రువులనేవారు ఎక్కడుంటారు కనుక. మథురలో సహస్రకుండీ గాయత్రీయజ్ఞం సుసంపన్నమైనది. వీడ్కోలు వేడుకలో కొంతమంది గాయత్రీమాత ప్రతిమలను పంచారు. గాయత్రీమంత్రం అందరికీ ఇవ్వబడింది. వచ్చినవారందరికీ బస, ఆహారపానీయములు ఏర్పాటు చేయబడ్డాయి. వారిని ఎవ్వరు ఏమీ అనకుండా మన పరివారంలోని వ్యక్తులను వారి వెంట ఉంచాము. 'విగ్రహ పూజ' లేకుండా కేవలము మంత్రజపంతోనే గాయత్రీమాతను అర్చించవచ్చని వారిలో కొందరు అభిప్రాయపడ్డారు. వారివారి అభిప్రాయములను, భావములను స్వేచ్ఛగా వ్యక్తం చెయ్యనిచ్చాము. అది వారి హక్కుగా భావించి వారికి భావాలను వ్యక్తం చెయ్యటానికి అవకాశాన్నిచ్చాము.

## మేము అజాత శత్రువులం

'వీళ్ళు మీకు శత్రువులు, మీ పట్ల చెడుగా ప్రవర్తిస్తున్నారు' అని ఎవరైనా చెప్పినా మేము అంగీకరించము. మాకు శత్రువులు అనేవారెవ్వరు లేరు. అజాతశత్రువు రూపములో మేము నిశ్చితంగా, ఎప్పుడైనా, ఎక్కడికైనా వెళ్ళగలం. బయటనుండే వ్యక్తులు మమ్మల్నేమి చెయ్యగలరు? అందుచేత మేము క్రూరజంతువులు తిరగాడే అడవులలోకి కూడా నిర్భయంగా వెళ్ళగలము.

పోయినసారి హిమాలయములకు వెళ్ళినప్పుడు ఒక గుహలో నివసించాము. మంచు విస్తారముగా కురుస్తూ చలి విపరీతముగా ఉన్నది. ఆ గుహలో నిప్పురగల్చబడి ఉన్నది. చలికి వణుకుతూ అడవి జంతువులు కూడా మాతోపాటు ఆ గుహలో ఉన్నాయి. గుహ చాలా పెద్దది. అగ్నితాలూకు వెచ్చదనానికి సింహములు, పులులు, ఎలుగులు, మొత్తం అడవంతా ఒక కుటుంబమై అక్కడ మాతోపాటు కూర్చున్నది. చిన్నచిన్న కుక్క పిల్లలు కూడా. పిల్లలకు జన్మ నిచ్చిన కుక్క ఎటో వెళ్ళిపోయింది. పిల్లలు ఇక్కడ మిగిలిపోయాయి. మేము వెళ్ళటానికి బయలు దేరినప్పుడు కుక్కపిల్లలు మా వెంట పడ్డాయి. వాటిని ఒక సంచిలో తీసుకువచ్చాము. బయట

ఏదైనా సాధించాలంటే ముందుగా ఆ లక్ష్యం గురించి కలలు కనండి

అనేక క్రూరజంతువులు, భూతపిశాచములు కూడా ఉంటాయి. భూతం కనిపించినా మేము చలించము. దానిని చేరదీసి నీవు కూడా మా అభిమానమునకు పాత్రురాలివే అని అభయ మిస్తాము. భూతానికి కూడా మనం భయపడవల్సిన పనిలేదు.

## ఆధ్యాత్మికత యొక్క లక్ష్యము- దృష్టికోణమును సంస్కరించుకొనటము

అజాతశత్రువుగా ఉండగలిగే ఈ స్థితిని మీరూ పొందగలరు. 'దీనికోసం దృష్టికోణమును సంస్కరించుకోవాలి. ఇలా చేస్తే మీరు ఆధ్యాత్మితకను అమలుపరచినట్లే!' ఇది మీరు చేయగలిగిననాడు మీరు ఈ జీవితములోనే స్వర్గములో దేవతలతోపాటు నివసిస్తున్న అనుభూతిని పొందగలరు. అప్పుడు ఇక చూడండి. ఈ పేదరికం, ద్వేషం, వ్యథ, కోపం మొదలైనవన్నీ ఏదో గారడీ జరిగినట్లుగా వాటంతటవే మాయమైపోతాయి. మీవద్ద సరియైన ఆలోచనావిధానము ఉంటే కనుక మీరు ఈ జీవితములోనే దేవతలు, మహా మానవులు కాగలరు.

24 వేల గాయత్రీమంత్రజపం మీ చేత చేయించడము, అనుష్ఠానం చేయించటంలోని మా లక్ష్యం ఏమిటంటే మీరు ఇక్కడినుండి వెళ్ళేటప్పుడు మీ ఆలోచనావిధానము మారిపోవాలి. అలాకాకుండా **మీరు మీ పాత భావాలతోటి అలవాటైన పాత ఆలోచనా విధానం తోటి స్థిరంగా కట్టుబడి ఉండి, కేవలము జపం మాత్రమే చేస్తాంటే మీ జీవితములో మార్పురావటం జరుగదు.** ఆలోచనలను సంస్కరించుకొనకుండా కేవలము గంగాస్నానం చేస్తూ, ఉపవాసాలు చేస్తూ, తపస్సు చేస్తూ ఉంటే వారి జీవితాలో ఎలా ఉంటాయో మీరు అంతే ఉంటారు.

దేవీనవరాత్రులలో కొంతమంది బందిపోటు దొంగలు ఆ తొమ్మిదిరోజులూ కేవలము నీరు మాత్రమే త్రాగి ఉపవసించి, దేవికి 9 మేకలను బలి ఇచ్చిన తరువాతనే ఆహారమును స్వీకరిస్తారు. అలాగే దుర్గాపారాయణ కూడా చేస్తుంటారు. కేవలము పూజ-ఉపాసనలతో కూడిన కర్మకాండకు మాత్రమే పరిమితమైనవారికి ఎంతమేరకు మేలు జరుగుతుందీ అనేది మేము ఖచ్చితముగా చెప్పలేము. కానీ ఆధ్యాత్మికతను మీ భావనలలో, ఆలోచనలలో, చేతలలో, ప్రవర్తనలో కలుపుకొని జీవించగలిగితే మీరు 'అజాతశత్రువులు, ఆప్తకాములు' కాగలరు.

ఆధ్యాత్మికతను ఆధారముగా చేసుకొని మేము పొందిన మూడవసిద్ధి 'అల్పఛందత' (అంటే సంపదలు). దానిని మీరూ పొందాలని మేము కోరుకుంటున్నాము. కుబేరుడు అందరికన్నా అధిక సంపన్నుడు అని చెప్తారు. అలాగే రావణాసురుడు ఎంతో సంపదలున్నవాడు. సికిందర్, నైజామ్‌నవాబు, ఫోర్డ్, టాటా, బిర్లా... మున్నగువారంతా కూడా సంపన్నులే. వారితోపాటు మరొక పేరు చెప్పవల్సివస్తే అది మేమే అవుతాము. మావద్ద అంత సంపద ఉన్నది. ఎలా? సరే చెప్తున్నాము. జాగ్రత్తగా వినండి.

## సంపద యొక్క ఫిలాసఫీ

సంపదను గురించిన ఫిలాసఫీ చాలా సరళమైనది. తేలికగా అర్థం చేసుకోవచ్చు. ఒక వస్తువైనా, ధనమైనా ఆఖరుకు ప్రాణియైనా సరే మనది అనుకున్నంతవరకు అది మన సంపద అవుతుంది. అది మన నుండి దూరంగా జరిగిపోయినప్పుడు ఇక మనది కాదు. దానిమీద మన కెలాంటి వ్యామోహము ఉండదు. ఉదాహరణకు నా దగ్గర ఒక 20 రూపాయల కాగితం ఉన్నదనుకోండి. అది నా దగ్గరున్నంతసేపు ఎంతో జాగ్రత్తగా చూసుకుంటుంటాను. దురదృష్టవశాత్తూ దానిని ఎవరో దొంగిలించారు. ఏమి చేస్తాను? కొంతసేపు బాధపడి వదిలివేస్తాము. అలాగే ఇల్లు... మనదీ అని అనుకున్నంతసేపే ఆ ఇంటి మీద ఎంతో శ్రద్ధ ఉంటుంది. వేరెవరికైనా దానిని అమ్మివేసినపుడు అదే ఇల్లు పరాయిదైపోతుంది. ఇంకా చెప్పాలంటే అల్లుడు మన అమ్మాయిని బాగా చూసుకున్నంత కాలం అతడిని మనం గౌరవిస్తాం. కానుకలిస్తాం. ఎంతో ప్రేమను పంచుతాము. అమ్మాయికీ అల్లుడికీ మధ్య స్పర్థలు ఏర్పడి విడాకులు తీసుకున్న పిదప అదే అల్లుడిని మనం ముఖం చూడటానికి కూడా ఇష్టపడము. మనది కాదు అనుకున్న నిమిషము నుండి ఇక అది పరాయిదైపోతుంది. దానికీ-మనకు ఎటువంటి సంబంధము ఉండదు.

## 'ఆత్మవత్ సర్వభూతేషు' అన్న భావమును వ్యాపింపచేసుకొండి

'నాది-మనది' అన్న భావమును విస్తృతం చేసుకొనగలిగితే ప్రపంచములో ఉన్న సంపదంతా మనదే అవుతుంది. కొన్ని కోట్లకన్నా ఎక్కువ విలువ జేసే సూర్యుడు మాకు ఉన్నాడు.

**లక్ష్యం, కష్టం తోడయితే విజయం మీదే**

అత్యంత పవిత్రమైన గంగానది మాకు ఉన్నది. అందులో ఎంతసేపు స్నానం చేసినా మమ్మల్ని ఎవ్వరు ఏమీ అనరు. నింగీ-నేల, నీరు-నిప్పు, అడవి, సూర్య-చంద్రులు, భగవంతుడు, అన్నీ మావే, అంతా మావారే! అంతా మా సంపదే! మాది-మనది అనే భావనను ఎంతగా వ్యాపింప జేయగలిగితే అంత అధిక సంపన్నులం కాగలము. ఆత్మీయతా (నేను, నాది) భావనను ఎంతగా కుంచింపజేసుకుంటే అంత పిసినారివారు అవుతారు. ఎవరైనా సరే ఆత్మీయతాభావనను తన శరీరము వరకు, తన భార్యాబిడ్డల వరకు, తనకున్న స్వల్ప సంపదల వరకు పరిమితం చేసుకుంటారో వారిని పరమ దరిద్రులుగా చెప్పుకోవచ్చు. తనకున్న వస్తుసంపదలన్నింటినీ అందరికీ చెందినవిగాను, అందరివద్ద ఉన్న సంపద తనకు కూడా చెందినదిగాను భావించే వ్యక్తి నిజముగా ధనవంతుడు.

**సీయరామమయ సబ జగ జానీ। కరఉఁ ప్రనామ జోరి జుగ పానీ॥** అన్న భావన కలుగుతుంది. ప్రతి ఒక్క స్త్రీని సీతాదేవిగాను, ప్రతి ఒక్క పురుషుడినీ శ్రీరాముడిగాను చూడ గలిగిన వ్యక్తి అందరిలోనూ ఆత్మీయతాభావమును పొంద గలిగిన వ్యక్తి. 'ఆత్మవత్ సర్వభూతేషు' అన్న వాక్యాన్ననుసరించి తనను తాను ఎంతగా ప్రేమించుకుంటాడో అదే రీతిలో ప్రతి ఒక్కరినీ ప్రేమించగలుగుతాడు.

మిత్రులారా! మీరంతా నా కుటుంబసభ్యులు, మా మిత్రులు. మమ్మల్ని మేము ఎంతగా ప్రేమిస్తామో అంతకన్నా అధికముగా మిమ్మల్ని మేము ప్రేమిస్తున్నాము. మా పిల్లలతో సమానముగా మిమ్మల్ని అభిమానిస్తున్నాము. మాకు లక్షల మంది బిడ్డలున్నారు. ఒక లక్షమందిని ఒక గంటసేపు జపం చెయ్యమంటే ఏమవుతుంది? లక్షగంటల జపం జరుగుతుంది. 24 గంటలూ మేము చెప్పిన పనులలో నిమగ్న మయ్యే వ్యక్తులు లక్షమంది ఉన్నారు. ఇదంతా ఎలా సాధ్యమైంది? మేము ఆత్మీయతాభావనను సర్వత్రా వ్యాపింపజేశాము కాబట్టి. ఇది మాకెంత ఆనందమును ఇస్తుందో చెప్పనలవి కాదు. మీకున్న ఒక్క బిడ్డ ద్వారా ఎంతో సంతోషం పొందుతారు మీరు. మరి అలాంటి బిడ్డలు మాకు లక్షలమంది ఉన్నారు. ఇక మా సంతోషమును మీరు అంచనా వెయ్యగలరా? ఆత్మీయతా భావమును విస్తృతం చెయ్యడమే రొక్కబేరం వంటి ఆధ్యాత్మికత. దీని సహాయముతో మీరు దేన్నయినా పొందగలరు.

– *అఖండజ్యోతి, మే 2016*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

## మైత్రి మహిమ

*ఒక అడవిలో లేళ్ళు, కాకులు, తాబేళ్ళు, ఎలుకలు కలసి జీవిస్తూ ఉండేవి. కాని విపరీత స్వభావాలు కలిగిన ప్రాణులు కావటం వలన పరస్పరం పోట్లాడుకొంటూ ఉండేవి. ఈ పోట్లాటల వల్ల అవి వేటగాళ్ళకు చిక్కి మరణిస్తూ ఉండేవి. ఇలా తరతరాలుగా సాగటం వలన వీటి వంశమే లేకుండా పోతుందని భావించి ఒక మహాత్ముడు ఈ నాలుగు ప్రాణులకు కలసి మెలసి జీవించమని ఉపదేశం చేశాడు. ఆయన ఉపదేశ ప్రభావం వలన వీటి అంతరంగంలో మార్పు కలిగి, ఇవి కలసి మెలసి జీవించనారంభించాయి. ఒకనాడు ఒక వేటగాడు నీటిలో తాబేలుని పట్టుకొన్నాడు. మిగిలిన మూడు జంతువులన్ని స్నేహపాశం బంధించగా, అవి తెలివిని ఉపయోగించి తాబేలుని రక్షించాలనుకున్నాయి. లేడి కుంటుతూ వేటగాని ముందుకు వెళ్ళింది. కాకి అతని వీపువైన వాలింది. వేటగాడు కుంటి లేడిని అవలీలగా పట్టుకొనవచ్చునని చేతిలోని వలను క్రింద వైచి లేడిని వెంబడించాడు. ఇంతలో ఎలుక వల కొరికి తాబేలుతో సహా పారిపోయింది. చాలా సేపు లేడి వెంట పరుగెత్తి, లాభంలేక వేటగాడు నిరాశతో వెనుకకు తిరిగి వచ్చాడు. వల కోరికవేయబడి ఉంది. తాబేలు లేదు. ఆ ప్రాంతంలో ఏవైనా అతీంద్రశక్తులు ఉన్నాయా అని వేటగానికి భయం వేసింది. భయంతో వడివడిగా ఇంటికి పరుగుతీశాడు.*


*కలిసి మెలిసి జీవించటం వల్ల, పరస్పరం మైత్రి కలిగి ఉండటం వల్ల సమస్త ప్రాణులు ఎంతటి విపత్తులనైనా అవలీలగా ఎదుర్కొనగలవు. ఏకాకిగా బ్రతికేవారు. సంతులనం కోల్పోయేవారు చిన్న చిన్న విపత్తులకే ఎక్కువ నష్టాన్ని, కష్టాన్ని పొందుతూ ఉంటారు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**విజేతలు అవ్వాలంటే నేర్పుతోపాటు ఓర్పు తప్పనిసరి**

నావారితో నా మాట

# యువక్రాంతి సంవత్సరం 2016 - దివ్యత్వ జాగరణ కార్యశాలలు



యువత పలుచోట్ల ఏర్పాటు చేయగల కార్యశాలల్లో ఆరవది 'జీవించే కళ'. దీనికి సంబంధించి కొన్ని ముఖ్యమైన సూత్రాలున్నాయి. మనకు జీవించే విజ్ఞానానికి, కళకి తేడా తెలియాలి. జీవించే కళ అన్న మాటలోనే అందం, గాంభీర్యం ఉన్నాయి. చాలాసార్లు మనం కర్కశమైన విజ్ఞానపు మాటలలో చిక్కుకుపోతాం. కానీ జీవితాన్ని ఒక కళాకారుడి లాగా జీవించాలి. ప్రతి క్షణం నవ్వుతూ నవ్విస్తూ గడపాలి. జీవితం క్షణభంగురమైనది. ఎప్పుడు పిలుపు వస్తుందో చెప్పలేం. కాబట్టి ప్రతిక్షణం తృప్తిగా జీవించాలి. జీవితాన్ని కళగా జీవించడానికి కొన్ని ముఖ్య సూత్రాలు.

**(1) ఆర్ట్ ఆఫ్ బికమింగ్ (మారే కళ):** స్వామి వివేకానందుని మాటలలో ఇది విన్నాం. కాని ఎలా మారాలి, ఎలా తయారు అవ్వాలి? ముందు మనం తయారవ్వాలి, తరువాత ఇతరులను తయారు చేయాలి. మనం స్వయంగా అలా మారినప్పుడు మన నుండి సకారాత్మక ఆలోచనా తరంగాలు నిరంతరం వెలువడుతూనే ఉంటాయి. మన ప్రాధాన్యత పెరుగుతుంది. అప్పుడు మనుషులు మనలను చూసి మారతారు. యువతను మనం కలుపుకోవాలి. ఈ విధంగానే వారు కలుస్తారు. మొట్ట మొదట దార్శనికత. తక్షణం కలిగే ఫలితాల కన్నా, నేడు చేసిన పనుల వల్ల భవిష్యత్తులో రాబోయే పరిణామాలపై దృష్టి పెట్టాలి. దానిని బట్టే చేయవలసిన పనులను తెలివిగా నిర్ధారించుకోవాలి. రెండవది వివేకాన్ని మేలుకొలపటం. వివేకం మేలుకుంటే చాలా తలుపులు వాటంతటవే తెరుచుకుంటాయి. నిజానికి వివేకమే మన ఉజ్జ్వల భవిష్యత్తుకు ద్వారం తెరుస్తుంది. వివేకంతోనే జీవితం పట్ల దృష్టిని పదునుపరుచుకోవచ్చు. మూడవది, "లైఫ్ బియాండ్ మైటీ సెల్ఫ్", మనం మాత్రమే కాదు ప్రపంచమంటే. అది కూడా గమనించాలి. పరమార్థం గురించి ఆలోచిస్తే, స్వార్థం దానంతటదే తృప్తిపడుతుంది. ప్రాణి ప్రపంచం, వెనుకబడ్డవారు, నిరక్షరాస్యులు, దళితులుగా పిలవబడేవారు, వీరందరి పట్ల కూడా మనకు బాధ్యత ఉంది. మనం కొత్తగా తయారవడానికి ఇవి సూత్రాలు.

**(2) ఆర్ట్ ఆఫ్ థింకింగ్ (ఆలోచించే కళ):** అసలు ఆలోచించడం కూడా ఒక కళనే అని చాలామంది అర్థం చేసుకోరు. మనం చాలా పనులు ఆలోచించకుండా, పథకం వేసుకోకుండా చేసేస్తుంటాం. విస్తారంగా స్వాధ్యాయం చేసి ఉంటే, అనంతమైన ఆలోచనల సాగరంలో విహరించగలరు. కాబట్టి ఆలోచించే కళను నేర్చుకోండి. జాగ్రత్తగా ఆలోచించి, రోజువారీ పనులను కూడా పాయింట్లుగా రాసుకుని, దానిని బట్టే పని చేయండి. చాలా మంది ఏమాత్రం ఆలోచించకుండా ఏదోటి అనేస్తారు. ఆ తరువాత ఎందుకలా అన్నానా అని పశ్చాత్తాప పడతారు. అందుకే గురువుగారు, "మూర్ఖులే ముందు మాట్లాడి తరువాత ఆలోచిస్తారు, తెలివైన వాళ్ళు ముందు ఆలోచించి తరువాత మాట్లాడతారు." అన్నారు. మనం ఆలోచనల భాండాగారం, ఖజానా తయారు చేసుకోగలగాలి. దాని కోసం రోజు పద్ధతిగా చదువుతూనే ఉండాలి. ప్రతి విషయాన్ని గంభీరంగా ఆలోచించాలి. మీరు ఆలోచించే విధంగానే మీరు తయారైపోతారని శ్రీమద్భగవద్గీత చెప్తుంది. మీ ఆలోచనల ప్రతిబింబమే మీ వ్యక్తిత్వం. ఐన్‌స్టీన్, ప్లూటో, శ్రీ అరవిందో, స్వామి వివేకానంద, పరమపూజ్య గురుదేవులు ఈ కళతోనే తయారయ్యారు.

**(3) ఆర్ట్ ఆఫ్ వర్కింగ్ (పని చేసే కళ):** మన దైనందిన పనులు కూడా ఒక కళలాగా చేస్తూ నేర్చుకోవాలి. ప్రతి పనికి సంబంధించి పనిని క్లుప్తంగా రాసుకుని, మన జ్ఞాపకశక్తి మీద నమ్మకం పెట్టుకోకుండా రోజంతటి పనులను వరుసగా రాసుకుని నిర్ధారించుకోవాలి. పనిని భారంగా భావించకుండా, ఒక సాధనలా చేయాలి. మధ్య మధ్యలో పనులు మారుస్తూ ఉండండి, మార్పు ఉంటే విసుగుకు తావుండదు. అప్పుడు మార్పువల్ల ఏ పనీ చెడిపోదు. విజయశిఖరాలను చేరుకుంటారు.

**(4) ఆర్ట్ ఆఫ్ రిలేటింగ్ (బాంధవ్యాలను నెరవేర్చే కళ):** కుటుంబం, కార్యాలయ పరివారం, మిత్ర సముదాయంతో ప్రేమగా వ్యవహరించాలి. మాట్లాడుతూ ఉండాలి. ఆరోగ్యం

ఒక్కరోజులో అద్భుతాలు జరిగిపోవు

బాగాలేదని తెలిస్తే పలకరించండి. ప్రత్యేకించి పెద్దవారికి మీ ప్రేమ చాలా అవసరం. ఆ తరువాత స్థానం చిన్న పిల్లలది. పది నెలల పిల్లలు కూడా మీ భావాలను గుర్తుపట్టగలరు. అకారణంగా కోపగించుకోకండి. గారాబంతో పాడు చేయ కూడదు కాని ఒక కంటితో చేరదీయాలి, మరొకదానితో సరిచేయాలి.

**(5) ఆర్ట్ ఆఫ్ ఆర్గనైజింగ్ (క్రమబద్ధంగా పనులు నిర్వహించే కళ నేర్చుకోవాలి):** ఇల్లు, కార్యాలయం, వ్యాపారం, ఎక్కడైనా సరే ఇది అవసరం. క్రమబద్ధమైన జీవన విధానమే విజయానికి తాళం. మీరంతా కూడా పని చేయడం నేర్చుకోవాలి, ఇవ్వడం నేర్చుకోవాలి, తీసుకోవడం నేర్చుకోవాలి. పని బోరు కొట్టకుండా, రసవత్తరంగా ఉండేట్టు చూసుకోవాలి.

**(6) డీప్ ఇకాలజీ (పర్యావరణానికి అనుకూలమైన జీవిత విధానం):** మన అంతస్సుతో పాటు పరిసరాలను కూడా పచ్చగా మార్చుకోవాలి. విజ్ఞాన విధానాలన్నీ ఇక్కడ ఏకమవు తాయి. ప్రాణి జగత్తు, వనస్పతుల ప్రపంచం, పర్యావరణం, ఋతువుల క్రమం, వీటన్నింటితో అనుకూలత ఏర్పర్చుకోగలిగితే జీవితం మెరుగుపడుతుంది. లోతుగా ఆలోచించడం నేర్పిస్తుంది డీప్ ఇకాలజీ, అలాగే మన పనుల మీద దృష్టి సారించడం కూడా. ఈ విషయం అర్థమయితే 125 కోట్లమంది గల భారతదేశం మారిపోయినట్టే.

**(7) లివింగ్ విత్ హెల్దీ డైట్:** అసలు మనం రుచి కోసం తింటామా, ఆరోగ్యం కోసమా. నేటి జీవన విధానంలో చాలా వరకు రుగ్మతులు ఈ 'రుచి రోగం' వల్ల వచ్చినవే. "అన్నో వై మనః" అంటుంది ఋగ్వేదం. మనం తినేదే మన మనస్సుగా మారుతుంది. అందుకే అసలు మనం ఏం తింటున్నామో అన్నదానిని జాగ్రత్తగా గమనించుకోవాలి. మనుషులకు శాఖాహారమే సరిపడుతుంది. మాంసాహార జంతువులకీ, మన శరీర ఆంతరిక అవయవ నిర్మాణానికీ తేడా ఉంది. కాబట్టి మనం శాఖాహారం మీదే ఆధారపడాలి. ఈ ఫాస్ట్‌ఫుడ్ సంస్కృతి అంతా నాశనం చేస్తోంది. ఎందులో మాంసం, గుడ్లు ఉంటాయో తెలియదు. మీరు బైటికెళ్ళి ఏదో తింటుంటారు, పిల్లలకీ పెడ్తారు, వాళ్ళని ఇప్పటినుంచే కుసంస్కారులుగా చేస్తారు. మొలకలు, పళ్ళు, సలాడ్లు, మల్టీగ్రైన్ రొట్టెలు, కూరగాయలు (మీ పెరట్లో, కుండీలలో పెంచినవి) అన్నీ క్రమం తప్పకుండా తినాలి. తాజాగా తయారుచేసిన జూస్‌లు తాగాలి. మీరెప్పటికీ రోగాలబారిన పడరు. ఆరోగ్యకరమైన భోజనంతో ఒత్తిడిలేని ఆనందదాయకమైన దీర్ఘ జీవనం లభిస్తుంది.

**(8) క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి, బద్ధకానికి బానిస కాకండి:** కాలినడకకు ప్రాముఖ్యత ఇవ్వండి. పరిగెత్తండి, సైకిల్ తొక్కండి, వ్యాయామం చేయండి, అంతే కాని ఊరికే మంచంపై వాలి శరీరాన్ని రోగాలకు నిలయం చేయకండి. ప్రతి రోజు క్రమం తప్పకుండా చేసే వ్యాయామం శరీరాన్ని, మాంస కండరాల్నీ దృఢపరుస్తుంది. హార్మోన్లు, ఎన్‌జైముల స్రావాలకు తోడ్పడుతుంది. ఊరికే తిని కూర్చుంటే లావవుతూ ఉంటారు, రోగాలు వస్తూ ఉంటాయి. గురువుగారు ప్రజ్ఞా యోగమనే విధానాన్ని చెప్పారు, అది అందరు చేయదగ్గది. ఈ వ్యాయామం సూర్యనమస్కారానికి వికసిత రూపం, దీనిని గాయత్రీ మంత్రాక్షరాలతో చేస్తారు. దీని సి.డి. శాంతికుంజ్ నుంచి తెప్పించుకోవచ్చు.

**(9) అండర్‌స్టాండింగ్ ద జాయ్ ఆఫ్ సర్విస్ (సేవాధర్మ ప్రాముఖ్యతను అర్థం చేసుకోండి):** నిస్వార్థ సేవ యొక్క ప్రాముఖ్యతను తెలుసుకోండి, అందరిపట్ల ఆత్మీయ సేవభావాన్ని వికసింపచేసుకోవడం నేర్చుకోండి. ఇతరుల సద్భావనతో పాటు ఆత్మసంతోషం కూడా లభిస్తుంది. ముసలివారు, ఒంటరిగా ఉన్నవారికి వారానికి రెండుమూడుసార్లు వెళ్ళి సేవ చేయండి. వంతులవారిగా అలా చేస్తూ వారిని సంతోషపెట్టవచ్చు. ఆసుపత్రికి వెళ్ళండి. అక్కడ చాలా మంది మీకోసం వేచి ఉంటారు. అవసరం ఉన్నవారికి మీకు వీలైన సహాయం చేయండి. మురికివాడల్లో, అనాధాలయాలలో, గుళ్ళల్లో మీ అవసరం ఉంది. గుళ్ళను శుభ్రం చేయండి. అనాధలకు సహకరించండి. మురికివాడల్లో స్వయంసేవ, స్వచ్ఛత కార్యక్రమాలను నడపండి.

**(10) హెల్దీ ఏజింగ్ (ముసలితనాన్ని వైభవంగా తెచ్చుకుందాం):** మీ వార్ధక్యానికి మీరే స్వయంగా సిద్ధంకండి, ముసలివారికి ఏజింగ్ సూత్రాలను చెప్పండి-సమాజానికి మీరేమి ఇవ్వగలరు? ప్రాపంచిక బంధాల నుండి ఎలా ముక్తి పొందాలి? ఆరోగ్యంగా శరీరమనే సంచి నుండి ఎలా ముక్తి పొందాలి?

**ఏడవ కార్యశాల - హోలిస్టిక్ హెల్త్ మానేజ్మెంట్ (సమగ్ర స్వాస్థ్య నిర్వహణ):** హోలిస్టిక్ అనే ప్రక్రియలో అన్ని ధారల సమన్వయం చేయడం జరుగుతుంది. నేడు ఆరోగ్యం లాంటి విషయంలో కూడా ఆధ్యాత్మ ప్రధాన వైద్యాన్ని తప్పకుండా

**ఓర్పు లేకపోతే గొప్ప విజయాలు లభించవు**

చేరుస్తున్నారు. ఇప్పుడు వైద్యులకు రోగి అంటే ఒక్క శరీరమే కాదు, శరీరం-మనస్సు-ఆత్మ, దానితో ముడిపడ్డ పరిసరాలు, కుటుంబ సభ్యులు కూడా అందులోకి వస్తారు. 21వ శతాబ్దంలోకి రాగానే మన దేశానికి పట్టిన కొన్ని పీడలు -

1) మహమ్మారులు 2) పోషకాహారలోపం 3) శక్తి సంక్షోభం 4) పర్యావరణ వినాశనం 5) మాదక ద్రవ్యాలు, మందుల వ్యాపారం

రోగులకు వైద్యుడు దేవునితో సమానం. ఆయన మీద ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. కానీ వైద్యుడికి కూడా కొన్ని సమస్యలుంటాయి. సమయాభావం వల్ల రోగిని మనస్సుపెట్టి జాగ్రత్తగా చూసుకోలేడు. ఆరోగ్యనిర్వహణపై ప్రభావం చూపే మరికొన్ని ముఖ్యమైన విషయాలు

1. నైతిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలు - కుటుంబ సంస్కారాలు
2. రోగి దగ్గర లేదా వైద్య సంస్థ దగ్గర నిధుల కొరత
3. రాజకీయ హస్తక్షేపం, లేదా వైద్యప్రక్రియకు ఎవరైనా అడ్డుకోవడం

భారతీయ సంస్కృతిలో సమగ్రమైన ఆరోగ్య నిర్వహణ అంటే యోగ ద్వారా అన్ని వైద్య ప్రణాళికలను సమన్వయపరిచి అత్యుత్తమ సేవను అందించడం. నేడు వైద్య విధానంలో ఎథిక్స్ (విలువలు)కు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నారు. వైద్యుడి సాధారణ నిర్లక్ష్యానికి కూడా అతని మీద కేసు వేయడం లేదా మీదపడి కొట్టడం చేస్తున్నారు. సమగ్రంగా ఆలోచిస్తే ఈ పరిస్థితులు రావు. మానవుల సంవేదన, వైద్యుని అత్యుత్తమ సంరక్షణను సమన్వయ పరుస్తుంది. రోగులలో జాగరూకత తీసుకొచ్చే వైద్యుల సముదాయాలున్నాయి, అదే విధంగా ఏ వైద్యుడు తప్పటడుగు వేయకుండా కూడా జాగ్రత్త తీసుకుంటాయి. కొన్ని నైతిక వైద్యవిలువలు - లింగ నిర్ధారణ కోసం వైద్యుడిని ఒత్తిడి చేయడం, గర్భాన్ని తొలగించడం, అబార్షన్, వైద్యుని సహకారంతో ఇచ్ఛా మృత్యువును వరించడం, అతివృద్ధులు మరియు శక్తి హీనమైన రోగులు, పెరుగుతున్న వైద్య ఖర్చులు, పెరుగుతున్న హెచ్.ఐ.వి మరియు ఎయిడ్స్ వంటి భయంకర రోగాలు, మహావ్యాధిగా ఎదుగుతున్న ఒత్తిడి. ప్రత్యామ్నాయ వైద్య పద్ధతులతో కొత్త విప్లవం వచ్చింది. బ్రహ్మవర్చస్ పరిశోధనా సంస్థానం, దేవ సంస్కృతి విశ్వ విద్యాలయం ద్వారా యజ్ఞ చికిత్సతో పాటు సమగ్ర వైద్య ప్రణాళికలు ఉదయించవచ్చనే అంచనా పెరుగుతోంది. ప్రత్యామ్నాయ వైద్యంలో రెండు రకాలు ఉన్నాయి.

**సేంద్రీయ వైద్యం-హెర్బల్ వైద్యం:** (వనౌషధుల ఆధారంగా), ఆరోమా వైద్యం (సుగంధిత నూనెలతో), పంచకర్మ వైద్యం, ఆహార వైద్యం, ఆర్థో మాలిక్యులర్ వైద్యం (కీళ్ళు, కండరాల చికిత్స) మరియు యోగచికిత్స.

**మనస్సు మరియు శరీరాల సమన్వయ చికిత్స:** హిప్నో థెరపీ (సమ్మోహనం ద్వారా), ప్రాణిక్ హీలింగ్, ధ్యాన చికిత్స. ఈ కొత్త విధానాలు విపరీతంగా ఖ్యాతిని పొందాయి. ఇప్పుడు షుమారు 60 నుండి 70 శాతం మంది వీటి మీదే ఆధారపడు తున్నారు. రోగాలను అదుపు చేయడానికి, సమగ్రమైన ఆరోగ్యం కోసం జీవన విధాన నిపుణులు ఇప్పుడు వీటినే సిఫార్సు చేస్తున్నారు. క్రిస్టల్ థెరపీ, రేకీ, స్పర్శ చికిత్స ఇవన్నీ కూడా ప్రఖ్యాతి గాంచి విజయవంతం అవుతున్నాయి. ఆస్టియోపతి, మసాజ్, సమగ్ర ఆయుర్వేదం, చైనీస్ మెడిసెన్, హోమియోపతి, ప్రకృతి వైద్యం ఇవన్నీ కూడా ఉపయోగంలో ఉన్నాయి. కామ్ (కాంప్లిమెంటరీ ఎండ్ ఆల్టర్నేటివ్ మెడిసెన్) ఇప్పుడొక స్థాపిత వైద్య విధానం. ఈ విధంగా ఈ కార్యశాలలో ఆరోగ్యానికి సంబంధించిన జాగృతిని ప్రజల్లో తేవచ్చు. దేవసంస్కృతి విశ్వవిద్యాలయపు పాలీక్లినిక్‌లు ఈ దిశలో విప్లవాత్మక ప్రయత్నం చేస్తున్నాయి. *(సశేషం)*

*- అఖండజ్యోతి, డిసెంబర్ 2016*
*అనువాదం: శ్రీ ఎం.వి.ప్రసాద్*

## ప్రార్థన యొక్క చమత్కారము

*సామాన్యంగా మనిషి, దీనుడిగా, హీనుడిగా, స్వల్ప శక్తిగలవాడని నిత్యజీవితంలో కనిపిస్తుంది. కానీ మనిషి దగ్గర ఒక శక్తి ఉన్నది. దీని సహాయంతో లోకపరలోకముల అనంతమైన సిద్ధులు, సామర్థ్యములను పొందవచ్చు. అదే ప్రార్థన యొక్క శక్తి, పరమాత్మ ఎడల అవిచలమైన శ్రద్ధ, దృఢమైన విశ్వాసము యొక్క శక్తి. మనిషి ప్రార్థనతో తనను తాను మార్చుకోవచ్చు. శక్తిని ప్రాప్తించుకోవచ్చు. విశ్వాస పూర్వకంగా చేసిన ప్రార్థనతో పరమాత్మ పరుగుపరుగున వస్తాడు.*

*- అఖండజ్యోతి, ఫిబ్రవరి 1999*
*అనువాదం: ముక్కామల రత్నాకర్*

**ప్రతి గొప్పపనికి వెనకాతల ఎన్నో ఏళ్ళ కఠోర శ్రమ, పనితనం ఉంటాయి**

# స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు - 32

## శ్రీ సీతారామశర్మ - ఎర్రబాలెం, గుంటూరు జిల్లా

శ్రీ రాజేంద్రప్రసాద్‌శర్మ – భగవతీదేవిశర్మల దంపతులకు శ్రీ సీతారామశర్మ 5, జూన్ 1968లో నైనిటాల్ పట్టణములో ఉత్తరాఖండ్ రాష్ట్రములో జన్మించారు. ప్రాథమిక విద్యను దేశ రాజధాని ఢిల్లీలో పూర్తిచేశారు. తదుపరి ఢిల్లీ నగరంలో అల్యూమినియం తలుపులు, ద్వారములు, కిటికీలు తయారు చేసెడి కార్ఖానాలో చేరి పనిచేయసాగారు. ఇదే కర్మాగారంలో 1984 వరకు ఢిల్లీలోనే పనిచేశారు. ఢిల్లీలో ఉండగానే గాయత్రీ పరివార్‌తో సంపర్కం కలిగింది. హరిద్వార్‌లోని శాంతికుంజ్ గాయత్రీ తీర్థాన్ని పలుమార్లు సందర్శించారు. తుదపరి వ్యాపార విస్తరణ దిశగా అడుగులు వేసెడి దిశలో తన మకాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములోని విజయవాడ పట్టణానికి మార్చారు. విజయవాడలో అల్యూమినియం ద్వారాలు, తలుపులు, కిటికీలు తయారుచేసెడి కర్మాగారాన్ని ప్రారంభించారు.

సెలవు దినాలలో ఖాళీ సమయాలలో, విజయవాడకు దక్షిణ దిశగా ఎర్రబాలెం పంచాయితీ ఏరియాలోనున్న కృష్ణాశ్రమంతో పరిచయం పెరిగి, దాని ట్రస్టీగా పదవిని చేపట్టి తన సేవలనందించారు. తదుపరి మరికొందరితో కలిసి శ్రీ భగవాన్ మహావీర గోశాలను ఎర్రబాలెం మంగళగిరి మం॥, గుంటూరు జిల్లాలో ప్రారంభించారు. వధశాలకు తరలించెడి గోవులను ఖరీదు చేసి వానికి ప్రాణభిక్ష పెట్టి వానిని పోషించెడి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు. 340 గోవులను సంరక్షించుచున్నారు.

తిరుపతి, మధురై, కన్యాకుమారిలలో జరిగిన అశ్వమేధ యజ్ఞాలలో పాల్గొని తనవంతు సేవలను అందించుట జరిగింది.

ప్రస్తుతము విశ్వగాయత్రీ పరివార్ మంగళగిరి శాఖ వారి ద్వారా గాయత్రీ పరివార్ వ్యాప్తికై జరుగుచున్న కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని తన వంతు కర్తవ్యాన్ని పోషిస్తున్నారు.

వీరికి వీరి కుటుంబానికి తన ఆయురారోగ్యాలను, శక్తి సంపదలను ప్రసాదించవలసిందిగా యుగశక్తి గాయత్రి గురుసత్తాను సవినయంగా ప్రార్థించుచున్నది.

## శ్రీ పంచుమర్తి మోహన కోటేశ్వరరావు, మంగళగిరి

శ్రీ పంచుమర్తి రామకోటయ్య–బసవ పున్నమ్మ దంపతులకు మోహన కోటేశ్వరరావు తెనాలి పట్టణం, గుంటూరు జిల్లాలో జన్మించారు. తెనాలి పట్టణంలో తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేస్తూ ప్రీ యూనివర్సిటీ కోర్సు పూర్తి చేశారు. తల్లిదండ్రుల కులవృత్తి అయిన చేనేత వృత్తిలో తండ్రిగారికి సహాయ సహకారాలనందిస్తూ 1970 జిల్లా పరిషత్ నూజివీడు శాఖా కార్యాలయంలో టైపిస్టుగా ప్రవేశించారు. తదుపరి కృష్ణా జిల్లాలోని ఆగిరిపల్లి, విజయవాడలో పనిచేస్తూ సూపరింటెండెంట్‌గా 2004లో పదవీవిరమణ చేశారు. మంగళగిరికి, తన కుటుంబ నివాసాన్ని మార్చి, మళయాల స్వామి సారథ్యంలో ఎర్రబాలెం గ్రామంలోని శాంతిసేవ ఆశ్రమం ద్వారా ఆధ్యాత్మిక జీవితాన్ని తొలిసారిగా రుచి చూచారు. ఆ ఆశ్రమం సత్సంగాలలో క్రమంతప్పక పాల్గొనేవారు. ఒకసారి ఈ ఆశ్రమంలో పంచ కుండీ గాయత్రీయజ్ఞము చేయుట జరిగింది. ఈ యజ్ఞక్రతువు ద్వారా అత్యంత ప్రభావితులై ఇట్టి యజ్ఞాలను మంగళగిరి చుట్టుప్రక్కల అనేక గ్రామాలలో వ్యాప్తి చేస్తూ పరమపూజ్య గురుదేవుల ఆలోచనలను ఇంటింటా వ్యాప్తిచేయుటకై అవిరళ కృషి చేయుచున్నారు. దీనిలో భాగంగా యుగశక్తి గాయత్రి మాసపత్రికలను టోకుగా తెప్పించి, ప్రజలలో స్వాధ్యాయాన్ని పెంపొందించుచున్నారు. అట్లే గురుదేవుల విరచిత సాహిత్యాన్ని ప్రజలతోపాటు, మంగళగిరి దేవాలయాన్ని దర్శించుటకై వచ్చెడి యాత్రికులలో కూడా వ్యాప్తిచేయుటకై కృషిచేయుచున్నారు. పదవీవిరమణ తదుపరి తమ శేష జీవితాన్ని గురుదేవుల మార్గంలో నడుస్తూ మరుజన్మకై కావలసిన శక్తిసంపన్నతలను నాటుకొనుచున్నారు.

ఇట్టి వీరిని ఆ గురుసత్తా ఆశీర్వదిస్తూ ఆశీస్సులనందించవలసిందిగా యుగశక్తి గాయత్రి ప్రార్థిస్తున్నది.

★★★

**విజయం సాధించాలంటే ఎన్నో ఒడిదుడుకులను తట్టుకోవలసిందే**

## సుప్రసిద్ధ పుణ్యక్షేత్రము, మంగళగిరి పట్టణము, గుంటూరు జిల్లా ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహింపబడుచున్నది

1. మానవునిలోని పశుప్రవృత్తుల ఉన్మూలనకై, షోడశ సంస్కారముల ప్రయోగించి ఈ యజ్ఞ ప్రక్రియద్వారా జననం నుంచి మరణం వరకు 16 సంస్కారాలు చేసి, దైవీ ప్రవృత్తులను మానవులలో పెంపొందించేవారు.
2. యజ్ఞ ప్రక్రియకు మూడు లక్ష్యాలున్నాయి. అ) దేవ పూజనం – అనగా పరిష్కృత వ్యక్తిత్వం – దైవీ సద్గుణాల అనుసరణ. ఆ) సంగతీకరణము అనగా ఏకత్వం, సహకారం సంఘీ భావనల పెంపొందించుట ఇ) దానము అనగా సమాజ పరాయణత, విశ్వకుటుంబీకత మరియు ఉదార సహృదయతల పెంపొందించుట. ఈ ప్రక్రియ ద్వారా సద్భావనలు, సత్కర్మలు పెంపొందించ గల్గెడి ప్రేరణ లభిస్తుంది.
3. ఆత్మప్రగతికి సత్కర్మలు (తపస్సు) సద్జ్ఞానము (యోగ) ఆధారము
4. భౌతిక ప్రగతికి శ్రమ, శిక్షణ ఆధారాలు
5. యజ్ఞము విశుద్ధరూపంలో సామూహికం. దీనిని ఒంటరిగా ప్రయోగించరాదు.
6. యజ్ఞాగ్ని అందించే ఆదర్శాలు ఎ) ఎల్లప్పుడు వేడిగా – సక్రియంగా ఉండుట. బి) అనుకరణీయంగా (జ్యోతిర్మయం) ఉండుట. సి) తన సంపర్కంలో వచ్చిన వారిని తనలా తయారు చేయుట. డి) యజ్ఞాగ్నిలో పచనం కాబడిన వానిని వాయువు రూపంలో సమాజమంతటికి పంచుట ఇ) నిరంతరము ఊర్థ్వాభిముఖంగా ఉండుట.
7. స్వర్గము వరకు ఆత్మను తీసుకువెళ్ళగలిగే వాహనము యజ్ఞాగ్ని.
8. ఉదారత, పవిత్రత, సహకారత అనే త్రివేణిపై యజ్ఞము యొక్క తత్త్వదర్శనము ఆధారపడి ఉంది. ఈ మూడే ప్రపంచాన్ని సుఖంగా ఉంచి సమున్నతంగా సుందరంగా చేస్తాయి.
9. నేటి పర్యావరణ సమస్యను రూపుమాపుటకై యజ్ఞోపచార ప్రక్రియ పునరుద్ధరింపబడి తీవ్రతను సంతరించుకోవాలి.
10. యజ్ఞము శారీరిక రోగాలతోపాటు మానసిక రోగాలను కుదర్చ గలదనెడి దానిని, అధర్మణ, ఋగ్వేదాలు చాటి చెప్పుచున్నాయి.
11. యజ్ఞముల ప్రముఖ ప్రయోజనం వాయుశోధనతోపాటు, వాతావరణ నిర్మాణం చేయుట. పవిత్ర వేద మంత్రాల స్వస్వర ఉచ్చారణ విశ్వచేతనత్వంలో పవిత్రతను నిర్మించే దివ్య కంపనాలను ఉత్పన్నం చేస్తుంది.
12. సామాన్యమైన అగ్నిని, యజ్ఞాగ్నిగా దేవాగ్నిగా మలిచే పనిని అధర్వుడు ఉద్గాతలాంటి విశిష్ట యాజకుల యొక్క శ్రద్ధా సంకల్పశక్తి చేస్తుంది. యజ్ఞాగ్నిలో పవిత్రహోమ ద్రవ్యముల సూక్ష్మీకరణవల్ల సూక్ష్మజగత్తు అత్యంత ప్రభావితం చెందుతుంది.
13. పర్జన్యము యొక్క స్థూల అర్థము మేఘాలు, సూక్ష్మ అర్థము–ప్రాణవర్షం. పర్జన్యము దుర్భిక్ష నివారణకై జరిగే మేఘ మథనం, వర్షముతో కలిసి నేలమీదికి వచ్చే ప్రాణతత్వం యొక్క అభివర్ధనకు తోడ్పడుతుంది.
14. ప్రస్తుతం జరుపతలపెట్టిన ఉచ్చస్తరీయ అశ్వమేధ మహాయజ్ఞ ప్రయత్నం ప్రజల ఆలోచనా సరళిని పరిష్కృతం గావించి ఉజ్జ్వల భవిష్యత్తును నిర్మించగలదనెడి సంకల్పం.
15. పురాణాలలో ముఖ్యంగా అగ్ని పురాణంలో రాజ్యప్రాప్తికై, వ్యాధి నాశనానికై, అకాలమృత్యువు నిరోధించుటకై, ధర్మార్థ కామ మోక్షాల సాధన కొరకై, ధనప్రాప్తికై, లక్ష్మీయజ్ఞము ఉద్దేశింపబడ్డాయి. సిద్ధించిన మంత్రాలతో నిర్ణయించబడిన హవన సామాగ్రితో యజ్ఞమువల్ల సకల వశీకరణలాంటి అనేక ప్రయోగాలు అమలులో ఉన్నాయి.
16. సంపూర్ణ మానవజాతి ఉన్నతికై ఋషులంతా ఏకస్వరంతో ఇలా అన్నారు.

**అశ్వమేధా స్వాయితా దేవాం వృష్ఠయుత్యర్ గేణ మానవః ।**
**అప్యాయణం వైకుర్వంతి యజ్ఞాః కళ్యాణహేతవః ॥**

అశ్వమేధం ద్వారా ప్రసన్నులయిన దేవతలు మానవుల మీద శుభాలను వర్షింపజేస్తారు.

17. కలి ప్రవాహాన్ని నిలువరింపజేసి సత్యయుగ వాతావరణాన్ని పునర్ నిర్మించే ఈ మహాయజ్ఞాల శృంఖల యజ్ఞము చేసే యాజకుల మహోన్నత కోరికను పూర్తిచేయుటకై ఒకప్పుడు పృథు, అంబరీషుడు వంటి లోక నాయకులు ఋషి సత్తములు ఈ మహత్తర ప్రయోగాన్ని చేసి మానవులను ఉద్ధరించిరి. ఈనాడు ఇదే ప్రయోగాన్ని ఋషి సత్తా గురుసత్తా శక్తులద్వారా సంచాలితం కానున్నది.
18. యజ్ఞము అనగా విజ్ఞానమే కాదు. అద్భుత విజ్ఞానము కూడా.

**వైఫల్యాన్ని పట్టించుకోవద్దు, విజయాన్ని తలకెక్కించుకోవద్దు**

# అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం - కార్యకర్తల సమావేశముల నివేదిక

**విశాఖపట్టణంలో**

అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞము, మంగళగిరి, గుంటూరు జిల్లాలో జనవరి 2018లో నిర్వహింపతలపెట్టిన దాని విజయానికై కార్యకర్తల ద్వితీయ సమావేశం విశాఖ పట్టణంలో 27 నవంబరు 2016న జరిగింది. ఈ సమావేశానికి ఆదరణీయ డా॥ బ్రిజ్‌మోహన్‌గౌర్‌జీ మరియు ఆదరణ శ్రీ అశ్విని సుబ్బారావుగార్లు మార్గదర్శనం చేశారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పుగోదావరి మరియు పశ్చిమగోదావరి జిల్లాల నుండి గాయత్రీ పరివార్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమావేశం దీప ప్రజ్వలనతో ప్రారంభమయింది. తదుపరి ప్రేరణా గీతాలను శ్రీమతి సావిత్రి బృందం, విశాఖపట్నంవారు మరియు ఉత్తమ్‌కుమార్, తోషన్ సాహూల బృందం, శాంతి కుంజ్ వారు ఆలపించారు.

తొలుత అశ్విని సుబ్బారావు, దక్షిణభారత గాయత్రీ పరివార్ ప్రధాన సంచాలకులు ప్రసంగిస్తూ ఈ సమావేశంలో అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం 2018 జనవరి విజయానికి కార్యకర్తల సూచనలను, సలహాలను స్వీకరించి తదనుగుణమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించు టకై ఏర్పాటు చేయబడమైనదని ప్రకటించారు. ప్రేరణా గీతాలను అధిక సంఖ్యలో కార్యకర్తలు నేర్చుకొనుటకై ఒక పాటల సి.డి.ని. నూతనంగా రూపొందిం చడమైనదని, దీని సహాయంతో అత్యధికులు పాటలు నేర్చుకొనవలసిందిగా కోరారు. తదుపరి 2017 డిసెంబరులోపు అనేక చోట్ల 24 కుండముల, జిల్లా కేంద్రాల్లో 108 కుండముల యజ్ఞాలు చెయ్య సంకల్పించాం అని తెలిపారు.

తదుపరి ఆదరణీయ డా॥ బ్రిజ్‌మోహన్‌గౌర్‌జీగారు కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ "సమాజంలో రెండు విధాలైన శక్తులు పనిచేస్తూ ఉంటాయి. ఒకటి మనుష్య లలో ధర్మం పేరుతో మూర్తిపూజలు చేస్తూ, స్వార్ధచింతనను, కర్మ కాండను, మూఢాచారాలను పెంపొందిస్తూ ఉంది. రెండవ శక్తి దీనికి భిన్నంగా మనుష్యులలో చైతన్యాన్ని మరియు జ్ఞానాన్ని పెంపొందిస్తూ, సుఖశాంతులు మానవ జీవనలక్ష్య సాధన దిశగా సాగిపోవుటకు కావలసిన మార్గదర్శనాన్ని అందిస్తున్నది.

ఈ అశ్వమేధయజ్ఞం ద్వారా మానవాళికి మానవజీవన, సాధన, ఆరాధనలను నేర్పాలని సంకల్పించాం. వ్యక్తినిర్మాణం తద్వారా సమాజ నిర్మాణం జరగాలి. భగద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునునితో "ధర్మానికి హాని జరిగినప్పుడు తిరిగి ధర్మోద్ధరణకై తాను అవతరిస్తుంటాను" అన్నారు. దీనిలో భాగంగా సమాజంలో విశ్వంలో తిరిగి ధర్మోద్ధరణ జరిగి భూమిని స్వర్గంగా మార్చాలనెడి సంకల్పంతో పరమపూజ్యగురుదేవులు జన్మించుట జరిగింది. వేదాలను, పురాణాలను, ఉపనిషత్తులను మధించి, వానిలో నున్న జ్ఞానామృతాన్ని మనకు చిన్న చిన్న పుస్తకాల రూపంలో అందించారు. అట్లే నిత్యగాయత్రీ ఉపాసన ద్వారా ఆ దైవీ గుణాలను మనలో పెంపొందించుకొంటూ, సాధన, ఆరాధనల ద్వారా మానవజీవన లక్ష్యాన్ని చేరుకోవాలి. నిస్వార్ధ బుద్ధితో, నిష్కామకర్మతో సమాజకళ్యాణ దిశగా మన కర్తవ్యాన్ని పాలించాలి. "కోర్కెల సాధనకైగాక దైవీగుణాలు మనలో పెంపొందించుకొనెడి దిశగా మన దైవీ ఉపాసన సాగాలని, గురుదేవులు చెప్పారు. అట్లే తన మార్గంలో నడుస్తూ తన లక్ష్యసాధనకై కృషి చేసెడివారి వ్యక్తిగత బాధ్యతలను సంరక్షణను తాను చూచెదనని మనందరికి హామీని ఇచ్చారు.

మీ అందరికీ సుఖశాంతులు చేకూరి మీ జీవితాలు మంగళ మయం కావాలని ఆ దైవాన్ని ప్రార్థిస్తున్నాను. ఓం శాంతిః శాంతిః శాంతిః

**కార్యకర్తల స్పందనలు-సంకల్పం**

1. శ్రీ గురుమూర్తి, శ్రీ శంకరరావు, కురుపాం, విజయనగరం జిల్లా. 41 గ్రామాల్లో ప్రజ్ఞామండళ్ళను స్థాపించి గాయత్రీ మంత్ర ఉపాసనను వ్యాప్తి చేస్తున్నాం. 1000 ఇళ్ళలో దేవస్థాపన చేశాం. ఇంకా దీనిని పెంచుతాం.

2. శ్రీ ఆదినారాయణ, పార్వతీపురం: ఇప్పటికి 50 గృహాలలో దేవస్థాపన చేశాం. దీనిని ఇంకా పెంచుతున్నాం.

3. శ్రీ శిల్లా నారాయణమూర్తి, పాలకొండ, విజయనగరం జిల్లా: పాలకొండలో 108 గృహాలలో దేవస్థాపన చేయ సంకల్పించారు. అశ్వమేధానికి రూ. 25000/- అంశదానాన్ని అందించారు. 400 క్యాలండర్లు, 2017 వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కొనుగోలు చేశారు.

**కష్టానికి ఫలితం దక్కక మానదు**

4. శ్రీ విశ్వేశ్వరరావు, చలమయ్య మరియు డి. పద్మావతిగార్లు 108 ఇళ్ళలో దేవస్థాపన చేశారు. దీనిని ఇంకా పదిరెట్లు పెంచాలని సంకల్పించారు.

5. శ్రీమతి సావిత్రి నర్సింగరావు, వైజాగ్: నెలకు 500 మ్యాగజైన్లు బట్వాడా చేయుచున్నారు. దీనిని 700 నుండి 1000 వరకు పెంచాలని సంకల్పించారు.

6. శ్రీ జైన్, వైజాగ్: 1008 మంది సాధకులను తయారుచేయ సంకల్పించారు.

7. శ్రీమతి దుర్గాసావిత్రి, వైజాగ్: స్టీలు ప్లాంటు ఏరియాలో 1108 మంది సాధకుల తయారుచేయ సంకల్పించారు.

8. శ్రీ బి.ఎన్.రావు, వైజాగ్: సాధ్యమైనంత ఎక్కువమందిని తయారుచేయ సంకల్పించారు.

9. నౌసేన విభాగ్ (నావికాదళ కేంద్రము-వైజాగ్): 101 మంది సాధకులను సంసిద్ధం చేస్తారు.

10. శ్రీమతి ఇందిరాదేవి, లంకెలపాలెం, విశాఖజిల్లా: 28 కోట్ల గాయత్రీ మంత్రలేఖన సంకల్పం చేశారు. దీనిలో భాగంగా ఇప్పటికీ ఒక్కకోటి పూర్తిచేయించారు. 108 మంది సాధకుల తయారు చేయ సంకల్పించారు.

11. శ్రీ టి.వి.ఎస్. నాగేశ్వరరావు, శ్రీమతి సౌజన్యగార్లు, యలమంచిలి, విశాఖజిల్లా: 108 మంది సాధకుల చేయ సంకల్పించారు.

12. శ్రీ అబ్దుల్లా మాష్టారు, యలమంచిలి: ఇప్పటికీ ఆరుగురిని సాధకుల సిద్ధం చేశారు. మరో 18 మందిని సిద్ధం చేయ సంకల్పించారు.

13. శ్రీమతి నాగమణి: అమలాపురం, తూ.గో.జిల్లా: ఇప్పటికీ 1000 అశ్వమేధం కిట్లు తీసికొనుట జరిగింది. ఇంటింటా దేవస్థాపన కార్యక్రమం ప్రారంభించారు. దీనిని 2016కు చేర్చాలనెడిది సంకల్పం.

14. శ్రీరామకృష్ణంరాజు, రంగాపురం: ఇప్పటికీ 300 కిట్లు తీసుకొని దేవస్థాపన కార్యక్రమం ప్రారంభించారు. దీనిని 500కు చేర్చాలనెడి సంకల్పం.

15. శ్రీమతి శ్యామల, అనపర్తి, మామిడాడ గ్రూపులు, తూ.గో. జిల్లా: ఇప్పటికీ 500 దేవస్థాపనల పని ప్రారంభించారు. లక్ష్యం 1008.

## గాయత్రీ శక్తిపీఠం, నారాకోడూరు గ్రా॥, గుంటూరు జిల్లాలో

గాయత్రీ శక్తిపీఠం, నారాకోడూరు గ్రా॥, గుంటూరు జిల్లాలో 29 నవంబరు 2016 మంగళవారము ఉదయం కార్యకర్తలను సమావేశం, ఆదరణీయ డా॥ బ్రిజ్‌మోహన్‌గౌర్ మరియు శ్రీ అశ్వినిసుబ్బారావు గార్ల సారథ్యంలో జరిగింది. చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు మరియు కృష్ణా జిల్లాల నుండి కార్యకర్తలు హాజరైనారు.

2018 జనవరిలో జరుపతలపెట్టిన అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞానికై సాధకుల తయారీపై చేపట్టిన కార్యక్రమ ప్రగతిని విశ్లేషించుట జరిగింది.

తొట్టతొలుత మంగళగిరి క్షేత్రమందు అశ్వమేధ గాయత్రీ యజ్ఞాన్ని 2018లో నిర్వహించవలయుననెడి దానిని నిర్ణయించుటకై ప్రధాన భూమికను పోషించినవారిలో ప్రముఖులైన శ్రీ రాఘవయ్య నాగార్జున ఉన్నత పాఠశాల, పెదవడ్లపూడి డైరెక్టరు గారిని సత్కరించారు. తన సన్మానానికి, సమాధానమిస్తూ శ్రీ రాఘవయ్యగారు తనవంతు సంపూర్ణ సహకారాన్ని అందిస్తూ యజ్ఞ సఫలతకు కృషి చేసెదనని సభాముఖంగా ప్రకటించారు.

అట్లే మంగళగిరిలో అశ్వమేధ యజ్ఞాన్ని నిర్వహించాలనెడి సంకల్పసిద్ధికై కృషి చేసిన శ్రీ భోజనపల్లి ప్రసాద్ మరియు శ్రీమతి రమాదేవిగార్లను కూడా సన్మానించారు.

సన్మానానికి సమాధానమిస్తూ తనవంతుగా 2000 మంది సాధకులను తయారు చేసెదనని శ్రీమతి రమాదేవిగారు ప్రకటించారు. అట్లే అశ్వమేధ యజ్ఞ సఫలానికై, 24 లక్షల గాయత్రీ మంత్ర జపాన్ని చేయించెదననెడి సంకల్పాన్ని శ్రీ ప్రసాద్‌గారు తీసికొన్నారు.

శ్రీ ప్రకాశరెడ్డి, గుంటూరు: 500 మంది సాధకులను తయారు చేస్తానన్నారు.

శ్రీ రామ్మూర్తి మరియు జగన్నాథ్: ఏజన్సీ ప్రాంతం విశాఖ జిల్లా 108 మందిని చేయ సంకల్పించారు.

శ్రీ సవాయిసింగ్ మరియు శ్రీ చలపతిగార్లు, చీరాల: 551 మంది సాధకులను మరియు 25వేల మంది విద్యార్థులను సంసిద్ధుల గావించెదనని వరుసగా సంకల్పించారు.

శ్రీ శ్రీనివాసరావు, పొన్నూరు: 1008 మంది సాధకుల తయారీకై సంకల్పం గైకొన్నారు.

**ప్రకృతికి విరుద్ధంగా వెళ్తే ఫలితాలు దారుణంగా ఉంటాయి**

డా॥ శ్రీరామ్, తెనాలి: తన శక్తివంచన లేకుండా 5000 మందిని సిద్ధం చేస్తామన్నారు.

శ్రీ కృష్ణ, ఇల్లందు, ఖమ్మం జిల్లా: 108 మంది సిద్ధం చేసెదమన్నారు.

శ్రీ సింగారెడ్డి-శ్రీమతి నాగరాజకుమారి, కొత్తపాలెం శక్తిపీఠం: 480 మంది సిద్ధం చేసెదమన్నారు.

శ్రీరామకృష్ణ, తిరుపతి: 500 మందిని సిద్ధం చేసెద మన్నారు.

కుందూరువారి పాలెం, గుంటూరు జిల్లా, గాయత్రీ శక్తి పీఠము: 500 పూర్తిచేశారు. 6000 మందిని సంసిద్ధం చేసెద మన్నారు.

శ్రీ శ్రావ్యమల్లిఖార్జునరావు, ఖమ్మం జిల్లా: 50 మందిని సంసిద్ధం చేసెద మన్నారు.

శ్రీమతి అరుణాచౌదరి, పిడుగురాళ్ళ: 50 మందిని సంసిద్ధం చేసెద మన్నారు.

శ్రీ కోట సుబ్బారావు, గుంటూరు: 108 మందిని సంసిద్ధం చేసెదమన్నారు.

### గాయత్రీ చేతనా కేంద్రము, హైదరాబాద్

సభకు ఆదరణీయ డా॥ బ్రిజ్‌మోహన్ గౌర్‌జీ, శ్రీ అశ్విని సుబ్బారావుగార్లు అధ్యక్షత వహించారు. సభలో పాల్గొన్న కార్యకర్తలు ఈ రీతిలో సంకల్పాన్ని గైకొన్నారు.

1. శ్రీ యం.వి.ఎస్.రాజు, హైదరాబాద్: పూజ్యగురుదేవుల సంరక్షణలో, వారి సంపూర్ణ ఆశీస్సులతో తన పరిశ్రమ మూడు పువ్వులు-ఆరుకాయలుగా దిన దిన ప్రవర్ధమానమగుచున్న దన్నారు. శాంతికుంజ్ ఆదేశానుసారం, తాను తగిన రీతిలో సమయదానాన్ని, అంశదానాన్ని సమకూర్చుటకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

2. శ్రీ గోకుల్‌చంద్, ఉపాధ్యాయ, బేగంబజార్: 108 సాధకులు 500 మంది పరివారంతో అశ్వమేధంలో పాల్గొనెద నన్నారు.

3. శ్రీ చౌధురి, ఖమ్మం: చేతనా కేంద్రం సూచనల ప్రకారం నడచుకొనెదనన్నారు.

4. శ్రీ యుగంధర్, మౌంట్ శంబళ, హైదరాబాద్: గాయత్రీ మంత్రాన్ని చుట్టు ప్రక్కల గ్రామాల్లో చేస్తున్నాం. తులసిచెట్లను పంచుతున్నామన్నారు.

5. శ్రీ పులిసత్యన్నారాయణ, వేములవాడ: సాధ్యమైనంత ఎక్కువ మందిని తయారు చేస్తామన్నారు.

6. శ్రీమతి సుమాపటేల్, వాడరేవు (చీరాల), సహ్యాద్రి ఆశ్రమం: 300 ఇళ్ళలో పూర్తిచేశారు. మరో 1000 ఇళ్ళలో దేవస్థాపన చేస్తామన్నారు.

7. శ్రీ చందేశ్వర్ అగర్వాల్: అంశదానం అందిస్తున్నారు.

8. శ్రీ అనిల్‌కుమార్ (అశ్విని): సాంకేతిక సహకారాన్ని అందించెదమన్నారు.

9. శ్రీమతి వరలక్ష్మి (వి.హెచ్.పి.): 116 మంది సాధకులను సిద్ధం చేస్తామన్నారు.

10. శ్రీమతి అనూరాధ, కూకట్‌పల్లి: బాలసంస్కారశాలల ద్వారా గాయత్రీని వ్యాప్తి చేస్తామన్నారు.

11. శ్రీమతి డా॥ నీలవేణి, కూకట్‌పల్లి: తనవద్దకు వైద్యసేవలకై వచ్చెడివారిని ప్రభావితం చేస్తామన్నారు.

12. శ్రీ రత్నాకర్: పత్రిక ద్వారా తన సేవలనందించెదనన్నారు.

13. శ్రీ రామకేశవులు, కర్నూలు: చేతనాకేంద్రానికి సేవల నందిస్తానన్నారు.

14. శ్రీ సోనీజీ: తాను నిత్యం చేసెడి గాయత్రీ యజ్ఞాల ద్వారా ఎక్కువమందిని ప్రభావితం చేసెదమన్నారు.

15. శ్రీ జగన్నాథం: తనకప్పగించిన పనులను ఎప్పటికప్పుడు పూర్తిచేస్తూ తన సమయాన్ని ఇస్తానన్నారు.

16. శ్రీమతి వాణి-రంగారావు, గాయత్రీజ్ఞానమందిర్, ఓల్డ్ బోయినపల్లి, సికింద్రాబాద్: తమ సంపూర్ణ సహకారాన్ని అంశ దాన, సమయదానాల రూపంలో అందించెమని సంకల్పం గైకొన్నారు.

17. శ్రీ ప్రతాపరెడ్డి, సరూర్‌నగర్: 108 మంది సాధకులను తయారు చేసెదమన్నారు.

18. శ్రీ వెంకటేశ్వర్లు, బోరబండ: 108 మందిని సిద్ధం చేసెదమన్నారు.

19. శ్రీ లక్ష్మీనారాయణ, జగిత్యాల: 516 మందిని సంసిద్ధం చేస్తామన్నారు.

20. శ్రీ సుబ్రమణ్యం, చిత్తూరు: 108 మందిని సంసిద్ధం చేస్తామన్నారు.

21. శ్రీ శ్రీనివాస్, కూకట్‌పల్లి: 108 మందిని సంసిద్ధం చేస్తామన్నారు.

**విశ్వాసంతో ప్రయత్నిస్తే ఏ పని అయినా నెరవేరుతుంది**

వార్తలు

# ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## పరమపూజ్య గురుదేవుల సాహిత్య తెనుగు అనువాదకులకు సన్మానం

పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య విరచిత హిందీ మూలంలోనున్న సాహిత్యాన్ని తెనిగించి ఆ సాహితీ సుమాలను తెలుగువారికి గత దశాబ్ద కాలంపైబడి అందించుచున్న ఈ క్రిందనుదహరించిన సహోదరీమణులకు శాంతికుంజ్, హరిద్వార్, గాయత్రీతీర్థ్ ప్రతినిధి ఆదరణీయ డా॥ బ్రిజ్‌మోహన్‌గౌర్‌జీ మరియు ఆదరణీయ శ్రీ అశ్విని సుబ్బారావుగార్లు ఒంగోలు పట్టణములోని శ్వేతద్వీపములో 30 నవంబరు 2016న సత్కరించుట జరిగింది.

అప్పుడు జరిగిన పరివార్ సమావేశాన్ని ఉద్దేశిస్తూ ఆదరణీయ డా॥ బ్రిజ్‌మోహన్‌గౌర్‌జీ ప్రసంగిస్తూ ఇలా అన్నారు – ప్రియ డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారు ఇంతమంది అనువాదకులను తయారుచేసి పూజ్యగురుదేవుల విరచిత సాహిత్యాన్ని తెనుగువారికి అందించుట అత్యంత ముదావహం! ఒకే కుటుంబంలోని పెద్దలు మొదలు పిన్నల వరకు ఈ యుగసాహిత్య అనువాదంలో పాలుపంచుకొని, తెనుగువారికి పూజ్యగురుదేవుల జ్ఞాన సాహిత్యాన్ని సరళమైన భాషలో అందించుట మిగుల అభినందనీయం. పూజ్యగురుదేవులు, వందనీయ మాతాజీల పట్ల గల ఆరాధన వీరికి, సమర్పణ తనను కదిలించి వేసింది అన్నారు. ఇట్టి మీ అందరికీ, మీ పరివారానికి సుఖ శ్రేయస్సులనందించి, శాంతి సౌభాగ్యాలను ప్రసాదించాలని ఆ దివ్య గురుసత్తాను ప్రార్థించుచున్నాను అన్నారు.

### శ్రీమతి ఎల్. రాజ్యలక్ష్మి

వీరు హైస్కూలు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు. పూజ్యులు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారుగారి వద్ద శుశ్రూష చేసి వారి ఆధ్యాత్మిక జ్ఞానసంపదను పుణికి పుచ్చుకొని, వారి తదనంతరము ఆ జ్ఞాన సంపదను నేటి తరానికి అందించుచున్న విదుషీమణి. శ్రీరామకృష్ణ మాష్టారికి తమ ఇంటిలో ఆవాసం కల్పించి, వారి ఆధ్యాత్మిక సాధనల ప్రగతిలో తన వంతు సేవా సహకారాన్ని అన్నివేళల అందిస్తూ వారి కృపకు పాత్రులైనారు. అట్లే పరమపూజ్య పండిత శ్రీరామశర్మ ఆచార్య మరియు వందనీయ మాతాజీలను దర్శించి వారి ఆశీస్సులను స్వయంగా పొంది, వారి దివ్య మందిరాన్ని ఒంగోలులోని తమ గృహం శ్వేతదీపమందు ఏర్పాటుచేసికొని, అనునిత్యం ఆ దివ్య గురుసత్తాను స్మరిస్తూ, ధ్యానిస్తూ వారి ఆలోచనలను సమాజంలో వ్యాప్తిచేయుచూ యుగనిర్మాణ కార్యక్రమంలో చురుకైన పాత్రను పోషిస్తున్న ధన్యజీవి. తన మనస్సును, శరీరాన్ని ధనాన్ని తమ గురువులకర్పించి వారి మార్గంలో చరించుచున్న భాగ్యశాలి.

### శ్రీమతి మంచెళ్ళ సీతామహాలక్ష్మి

వీరు శ్రీమతి రాజ్యలక్ష్మిగారి పెద్ద సోదరి. వీరు వసుధ హిందీ భాషా పండితురాలు, ప్రభుత్వ పాఠశాలలో హిందీ పండితురాలిగా పనిచేసి విశ్రాంత ఉపాధ్యాయినిగా జీవితాన్ని సాగిస్తున్నారు. డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారి శిష్యురాలిగా గత రెండు దశాబ్దములకు పైబడి గాయత్రీ పరివార్‌లో ఉంటూ ప్రకాశం జిల్లాలో గాయత్రీ పరివార్ వ్యాప్తికై ఒంగోలు వచ్చెడి శాంతికుంజ్ ప్రతినిధులకు తన గృహంలో ఆవాసం కల్పించి, వారికి తన సంపూర్ణ సహాయ సహకారాలను అందించిన మొట్టమొదటి వ్యక్తి. ఈ రీతిగా పరమపూజ్య గురుదేవులు, వందనీయ మాతాజీల హృదయాలలో తనకంటూ ఒక స్థానాన్ని పదిలపరచుకొన్న ధన్యజీవి, సాధకురాలు. పూజ్య గురుదేవుల సాహిత్యాన్ని అనువదించుటలో తన వంతు కర్తవ్యాన్ని ఇంత వృద్ధ వయస్సులో కూడా పోషించుచున్న సంకల్పశీలి. దీక్షాపరురాలు – తన పరివారాన్నంతటిని గాయత్రీ పరివార్‌లో చేర్చి తన గురుదక్షిణను చెల్లించుకున్న సమర్పణాశీలి.

### శ్రీమతి కామరాజు, కృష్ణకుమారి

భారతసర్కార్ భారత సంచార నిగమ్‌లో పనిచేసిన విశ్రాంత ఉద్యోగిని. వీరు శ్రీమతి రాజ్యలక్ష్మిగారి కనిష్ఠ సోదరి. అత్యంత

పనులను వాయిదా వెయ్యకూడదు

వినయశీలి, నిష్ఠాగరిష్ఠురాలు, పరమపూజ్యగురుదేవులు మరియు వందనీయ మాతాజీల అనుంగు బిడ్డలా తన జీవితాన్ని మలచుకొన్న సాధుసంతురాలు. పూజ్యగురుసత్తా నామాన్ని తన శ్వాసగా చేసికొని తాను తరిస్తూ, ఇతరుల తరింపజేయుటకై తన కలం ద్వారా తనలోనున్న ఆ వాగ్దేవి సహాయంతో పరమపూజ్యగురుదేవుల సాహిత్యాన్ని తెనిగించుతూ పండిత, పామరులకు, మనోవికాసాన్ని యుగశక్తి గాయత్రి పత్రిక ద్వారా చేకూర్చుతున్న సుగుణశీలి. నిరాడంబరంగా, నిష్కామంతో, యుగనిర్మాణ ఉద్యమంలో తనవంతు కర్తవ్యాన్ని పోషిస్తున్న కర్మశీలి!

### శ్రీమతి లక్కరాజు లక్ష్మీరాజగోపాల్

పూజ్యులు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారి సంపర్కంలో చిన్న వయస్సులోనే ఆధ్యాత్మిక చింతనను పుణికిపుచ్చుకొని, తద్వారా లభించిన సాహితి సరస్వతి శక్తితో పరమపూజ్య గురుదేవులు విరచిత హిందీమూలం సాహిత్యాన్ని అనువదించి, పెద్దలకు, సమకాలీనులకు గురుసత్తా జ్ఞానాన్ని అందించుచున్న తరుణీమణి. తాను తెనిగించిన దానిని తానే స్వయంగా డి.టి.పి. చేసి, తప్పొప్పులు సరిదిద్ది యుగశక్తి గాయత్రి మాసపత్రికకు అందించుచున్నారు. తనకుగల సమయాన్ని ఒక ప్రక్క తన కుటుంబానికి అందిస్తూ, మరోప్రక్క గురుదేవుల యుగ నిర్మాణానికై వెచ్చిస్తూ, "గృహస్థ జీవనం ఒక తపోవనం" అనెడి దానిని ఆచరించి చూపుచున్న ఆదర్శమూర్తి.

### శ్రీమతి టంగుటూరి వల్లీశ్రీనివాస్

వీరు శ్రీమతి రాజ్యలక్ష్మిగారి ప్రథమ సంతానం. తన బాల్యదశ నుండే పూజ్యులు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారి నుండి ఆశీస్సులను, సంస్కారాలను అందిపుచ్చుకున్న మార్కండేయురాలు. తత్ఫలితంగా విద్యార్థి దశలోనే పరమ పూజ్యగురుదేవులు, పరమ వందనీయ మాతాజీలను శాంతికుంజ్‌లో సందర్శించుకొన్న భాగ్యశాలి వరపుత్రి, తపోధనుల ఆశీస్సుల ఫలితంగా యుక్తవయస్సు నుండి గురుసత్తా ద్వారా తనకు లభించిన ఆశీస్సుల పరిజ్ఞానంతో పూజ్యగురుదేవుల విరచిత హిందీమూలం సాహిత్యాన్ని తెనిగిస్తూ అనేక వ్యాసాలను, పుస్తకాలను తెనుగు వారికి అందించుచున్నది. పిట్టకొంచెము-కూత ఘనమన్న రీతిలో తన కలం ద్వారా పూజ్యగురుదేవుల సాహిత్యానికి పదునుపెట్టి యుగనిర్మాణ ఉద్యమానికి ఊపిరిలూదుచున్న యువభావనాశీలి.

## హైదరాబాదులో

కార్తీక పౌర్ణమి సందర్భంగా తేది 14.11.2016న గాయత్రీ జ్ఞానమందిరం, ఓల్డ్‌బోయినపల్లి ఆవరణలో 9 కుండముల గాయత్రీ మహాయజ్ఞము మరియు సామూహిక సత్యనారాయణ వ్రతములు అత్యంత వైభవంగా జరుపబడినవి. ఈ కార్యక్రమంలో 400 మంది భక్తులు ఉత్సాహంగా పాల్గొని, సత్యనారాయణ వ్రతకథల ద్వారా సత్యమే నారాయణుడని, సత్యరూపంలో భగవానుని దర్శించి ఆరాధించడమే సత్య నారాయణ వ్రతం అనేటటువంటి గురుదేవుల సందేశాన్ని తెలిసికొనుట జరిగింది. అందరికి భోజన ప్రసాదము అందించ బడినది.

సేవా కార్యక్రమాలలో భాగంగా తేది 03.12.2016న గాయత్రీ జ్ఞానమందిరంవారు DIYA (డివైన్ ఇండియా యూత్ అసోసియేషన్) సంస్థ వారి సహకారంతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, గాంధీహాస్పిటల్ మరియు రోడ్లమీద రాత్రిపూట చలిలో ఇబ్బందిపడుతూ నిద్రించే అనాథలకు 500 దుప్పట్లు, రగ్గులు అందించడం జరిగింది.

## కామారెడ్డి పట్టణములో జరుగనున్న 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞం

*తెలంగాణా రాష్ట్రములోని కామారెడ్డి పట్టణములో* ***07.01.2017 నుండి 08.01.2017*** *వరకు 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞం, శాంతికుంజ్ హరిద్వార్ ప్రతినిధుల ఆధ్వర్యంలో జరుపబడును.*

***తేది 07.01.2016న*** *సా॥ 3 గం॥లకు కలశయాత్ర ధర్మశాల, గంగివర్తక సంఘ్ భవన్, సిరిసిల్లా రోడ్డు నుండి అయ్యప్పస్వామి దేవాలయం అయ్యప్పనగర్ వరకు; తదుపరి సా॥ 6 గం॥లకు దీపయజ్ఞం, ప్రసాద వితరణ.*

***తేది 08.01.2016న*** *ఉ॥ 8 గం॥లకు 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞం, పూర్ణాహుతి మరియు భోజన ప్రసాద వితరణ, అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణమందు జరుగును.*

***నిర్వహణ:*** *గాయత్రీ జ్ఞానమందిరం, స్వర్ణధామనగర్, ఓల్డ్‌బోయినపల్లి, సికింద్రాబాద్.*

**రేపటి పని ఈరోజు చెయ్యాలి, ఈరోజు పని ఇప్పుడే చెయ్యాలి**